కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


సింధూ నదీ జలాల నిలిపివేతతో పాకిస్థాన్‌కు అస్థిత్వ ప్రమాదం?

లాస్ ఏంజిల్స్‌లో సంక్షోభం : మీడియా భిన్న దృక్పథం

లోపలి పేజీల్లో


సంపుటి 27, సంచిక: 350 | బుధవారం | 11-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## భారత వ్యోమగామి తొలి ఐఎస్ఎస్ యాత్ర నేడే

05



## లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించండి

ప్రధాని మోదీకి ఖర్గే లేఖ

05

## ఎన్‌సిపి చీలుతుందని ఎప్పుడూ అనుకోలేదు

05

# 2 బహిరంగ సభలు



- రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణనపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సభలు
- ఎఐసిసి చీఫ్ ఖర్గేతో భేటీలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన కాంగ్రెస్ అధిష్టానం
- మంత్రులకు శాఖల కేటాయింపుపై చర్చోపచర్చలు
- అధిష్టానం పిలుపుతో ఢిల్లీకి భట్టి, ఉత్తమ్
- నేడో రేపో శాఖల కేటాయింపు : మంత్రి వివేక్ వెంకట్‌స్వామి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీలో తెలంగాణ సిఎం ఎ.రేవంత్‌రెడ్డి పర్యటన బిజీ బిజీగా కొనసాగుతున్నది. సోమవారం ఢిల్లీకి వెళ్ళిన సిఎం మంగళవారం ఎఐసిసి అగ్ర నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగిన నేపథ్యంలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై అంశంపై వారితో సిఎం చర్చించారు. పలువురు మంత్రుల శాఖల్లో మార్పు, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నది. మరోవైపు టిపిసిసి నూతన కార్యవర్గాన్ని సోమవారం రాత్రి ప్రకటించిన నేపథ్యంలో గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కార్పోరేషన్ల చైర్మన్ పదవులను కూడా భర్తీ చేయాలని అధిష్టానాన్ని సిఎం కోరినట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణనపై రెండు బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సభల తేదీలను ఖరారు చేయాలని, వీటికి హాజరుకావాలని మల్లికార్జున్ ఖర్గేను, రాహుల్ గాంధీని రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిఎంకు వారు దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పరిపాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్‌కు మరింత ప్రజాదరణను సాధించాలని సిఎంకు అధిష్టానం నాయకులు సిఎంకు సూచించారు.ఈ క్రమంలో ఈ అంశాలన్నింటిపైన చర్చించేందుకు ఢిల్లీకి రావాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు ఎఐసిసి అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళగా,డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క కూడా రాష్ట్రంలో బుధవారం నాటి తన కార్యక్రమాలను

తరువాయి 2లో

## 'కగార్' చట్టవిరుద్ధ హత్యలు తక్షణం ఆపండి

- కస్టడీలో ఉన్న మావోయిస్టు నాయకులను కోర్టులో హాజరుపర్చండి
- ప్రధాని మోదీకి ఐదు వామపక్ష పార్టీల విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ 'కగార్' పేరుతో ఛత్తీస్‌గఢ్,ఆ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న చట్టవిరుద్ధమైన ప్రభుత్వ హత్యలను తక్షణం నిలిపివేయాలని, ఎలాంటి వివక్షకు తావులేని న్యాయ విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని ఐదు వామపక్షాలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లిఖితపూర్వకంగా డిమాండ్ చేశాయి. గాలింపు చర్యలు చేపట్టిన భద్రతాబలగాల కస్టడీలో ఉన్న మావోయిస్టులందరినీ న్యాయస్థానం ఎదుట హాజరుపరచి, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వామపక్షాలు కోరాయి. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(మార్క్సిస్ట్‌-లెనినిస్ట్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, రివల్యూషనరీ సోషలిస్ట్‌పార్టీ (ఆర్ఎస్‌పి)ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, అఖిలభారత ఫార్వర్డ్‌బ్లాక్ (ఎఐఎఫ్‌బి) ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్ సంయుక్తంగా ప్రధానమంత్రికి లిఖితపూర్వక విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు మీడియాకు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. "అనేకమంది సీనియర్ మావోయిస్టు నాయకులు భద్రతా బలగాల అదుపులో ఉన్నట్లు నివేదికలు వెలువడుతున్నాయి. వారిని తక్షణం న్యాయస్థానంలో హాజరుపరచాలని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఛత్తీస్‌గఢ్, ఆ పరిసర ప్రాంతాలన్నీ పూర్తిగా సైనికులతో నిండిపోయాయని, సాధారణ జన జీవితం పూర్తిగా

తరువాయి 2లో

## ప్రభుత్వాసుపత్రిలో బాలుడు కిడ్నాప్

- నల్లగొండ జిల్లా కేంద్రంలో కలకలం
- బాలుడిని పట్టుకొని గోడదూకి పారిపోయిన గుర్తుతెలియని మహిళ
- భువనగిరి బస్సు ఎక్కినట్లు సిసి కెమెరా పుటేజీలో గుర్తింపు

ప్రజాపక్షం/నల్లగొండ



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుని కిడ్నాప్ మంగళవారం కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి అనే గర్భిణీ తన రెండవ డెలివరీ కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. భాగ్యలక్ష్మి తనకు సహాయకురాలుగా వరసకు చిన్నమ్మ అయిన వృద్ధురాలిని వెంట తీసుకొని రావడం జరిగింది. అయితే ఆమె ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటుండగా వృద్ధురాలు బాలుని తీసుకొని బయట ఆసుపత్రి ఆవరణలో ఆడిపిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల

తరువాయి 2లో

# అమెరికాలో అమానుషం

**భారతీయ విద్యార్థిని నేలపై పడుకోబెట్టి సంకెళ్లు**

ఘటనపై భగ్గుమన్న భారత్

ట్రంప్‌తో మోదీ మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** అమెరికాలోని న్యూవార్క్ విమానాశ్రయంలో భారతీయ విద్యార్థి చేతికి సంకెళ్ళు వేసి, నేలపై పడుకోబెట్టిన ఘటనపై భారతదేశం భగ్గుమంటోంది. ఈ అమానుష ఘటనను నెటిజన్‌లు తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. భారతీయ విద్యార్థిని నేలపై పడుకోబెట్టి, చేతులకు సంకెళ్లు వేసి అరెస్ట్ చేసి, ఆ తర్వాత దేశం నుంచి బహిష్కరించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌లు, ఫోటోలు పెద్ద ఎత్తున వైరల్

తరువాయి 2లో

## బహుళ అంతస్తులో భారీ అగ్నిప్రమాదం

ప్రాణాలు రక్షించుకునే క్రమంలో ఇద్దరు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి




**న్యూఢిల్లీ :** ఢిల్లీ ద్వారక ప్రాంతంలోని ఎనిమిదవ, తొమ్మిదవ అంతస్తుల డూప్లెక్స్ ఫ్లాట్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఇద్దరు చిన్నారులు సహా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు భవనం నుంచి దూకే ప్రయత్నం చేయగా, వారు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భవనం ఎనిమిదవ అంతస్తులో ఉన్న ఆలయం నుండి మంటలు ప్రారంభమై అతి వేగంగా ప్లాస్టిక్ ప్యానెల్‌ల ద్వారా వ్యాపించాయని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ప్రమాదంలో మరణించిన మృతులను యశ్ యాదవ్ (35), 12 ఏళ్ల కుమార్తె (12), 11 ఏళ్ల మేనల్లుడుగా గుర్తించారు. వీరు ఎనిమిదవ అంతస్తు బాల్కనీ నుండి దూకే ప్రయత్నం చేశారు. ఈ కుటుంబం భవనంపై రెండు అంతస్తులలోని డూప్లెక్స్‌లో నివసిస్తుంది. అయితే మంటలు చెలరేగినప్పుడు కుటుంబం మెట్ల ద్వారా తొమ్మిదవ అంతస్తుకు వెళ్లి ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నం చేసిందని,

తరువాయి 2లో

## నేడు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ముందుకు కెసిఆర్

**భారీ జనసమీకరణతో వెళ్ళేందుకు బిఆర్ఎస్ ప్లాన్**

ప్రజాపక్షం/హైదరాబాద్



'కాళేశ్వరం కమిషన్' విచారణలో భాగంగా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బుధవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ అడిగే ప్రశ్నలకు ఒక వైపు కెసిఆర్ సన్నద్ధమవ్వగా, మరోవైపు భారీ జనసమీకరణ చేపట్టేందుకు బిఆర్ఎస్ సిద్ధమైనట్టు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్యనాయకులతో పాటు, నాయకులను కూడా హైదారబాద్‌కు చేరుకోవాలని ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చినట్టు సమాచారం. 'కాళేశ్వరం ప్రాజెక్ట్'లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ కమిషన్ ఇప్పటికే అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను,పలువురు ఇంజనీర్లను విచారించిన విషయం తెలిసిందే. ఇటీవల మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లను కూడా కమిషన్ విచారించింది. బుధవారం ఉదయం కెసిఆర్‌ను విచారించనుంది. కాగా మాజీ సిఎం హోదాలో విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో బహిరంగ విచారణ కాకుండా ఇన్ కెమెరా విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎర్రవెల్లి నుంచి బిఆర్‌కె భవన్ వరకు కెసిఆర్ వెంట సుమారు 15 నుంచి 20కి పైగా వాహనాల కాన్వాయ్ ఉండేలా బిఆర్ఎస్

తరువాయి 2లో

## 51వేల విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా

- బ్యాంకర్లతో ప్రభుత్వం ఒప్పందం
- రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం
- విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసమే పథకం
- డిప్యూటీ సిఎం భట్టి




ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న 50,868 మంది విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం కోసం బ్యాంకర్లతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో మంగళవారం విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాకు బ్యాంకర్లతో ఒప్పందం అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సిఎం ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల కోసం పనిచేసే సంస్థల్లో విద్యుత్ సంస్థ ప్రధానమైనదని, ఆ సంస్థలో పనిచేసే సిబ్బంది కుటుంబాల గురించి వారి యోగ క్షేమాల గురించి ఆలోచించి తీసుకున్న ఈ ప్రమాద బీమా పథకం బాగా తృప్తిని ఇచ్చిందని తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేసే

తరువాయి 2లో

## రూ.2125 కోట్ల పెట్టుబడులు 5020 మందికి ఉపాధి

- రాష్ట్రానికి చెందిన ఐదు కంపెనీలతో యుఎఇ కంపెనీల అవగాహనా ఒప్పందం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో యుఎఇకి చెందిన శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంయుక్తంగా రూ.2125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో.. ఈ రెండు సంస్థలు మంగళవారం సచివాలయంలో అవగాహన ఒప్పందం చేసుకున్నాయన్నారు. తద్వారా కొత్తగా మరో 5020 మంది తెలంగాణ యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు. 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి... తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పం' అని ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పేర్కొన్నారు. 18 నెలల్లో 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏడాదిన్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి. ఈ ప్రయాణంలో ఈరోజు మరో గొప్ప అడుగు ముందుకేశాం అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా దూసుకెళ్తున్న తెలంగాణ పురోగతిలో భాగస్వామయ్యేందుకు ముందుకొచ్చిన యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్‌ను ప్రభుత్వం తరఫున

తరువాయి 2లో

## కర్నాటకలో మళ్లీ కులగణన

రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ హైకమాండ్ సూచన



**న్యూఢిల్లీ :** కర్ణాటకలో మరోసారి కులగణన చేపట్టే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం కీలక సూచన చేసింది. నిర్ణీత కాలపరిమితి లోగా తిరిగి కులగణన చేపట్టాలని సిఎం సిద్ధరామయ్యకు సూచించింది. ఈ మేరకు ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులతో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ సహా పలువురు నేతలు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మీడియాతో

తరువాయి 12లో

## బస్‌పాస్ చార్జీల పెంపు పేదలపై పెను భారం

- తక్షణమే పెంపును ఉపసంహరించుకోవాలి : సిపిఐ
- బస్‌భవన్ వద్ద ఎమ్మెల్సీ కవిత ధర్నా
- విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ : ఎఐఎస్ఎఫ్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి బస్సు చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని పాలు పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. చార్జీల పెంపు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు పెను భారం కానుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి బస్‌పాస్ చార్జీలు పెంచి ఒక్కో ప్రయాణికుడు పై ప్రతి నెల రూ. 200 నుంచి రూ.300 భారం మోపడం సరైంది కాదని, దీనిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రమే ప్రయాణిస్తారని... వారికి రాయితీలను ఇవ్వాల్సింది పోయి చార్జీలు పెంచి వారిపై మోయలేని భారం మోపారని ఆయన

తరువాయి 12లో

## జనాభాపరంగా నెం.1 స్థానంలో భారత్

- ఈ ఏడాది చివరికల్లా 146 కోట్లకు చేరిక
- సంతానోత్పత్తి రేటులో పడిపోయిన ఇండియా
- ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్ వెల్లడి



**న్యూఢిల్లీ:** ఐక్యరాజ్యసమితి అంచనాల్లో భారతదేశం 2025లో జనాభాలో అగ్రస్థానం నిలబెట్టుకున్నప్పటికీ సంతాసాఫల్యత నిష్పత్తి మాత్రం ఉండాల్సినదానికంటే కిందిస్థాయికి క్షీణించింది. ఈ ఏడాది మనదేశ జనాభా అంచనా 146 కోట్లు. దీంతో ఈ ఏడాది కూడా మన దేశం ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశాలలో ప్రథమస్థానాన్ని నిలబెట్టుకున్నట్టే. ఐతే సంతానసాఫల్యత విషయంలో మొత్తంగా చూసినప్పుడు భారతదేశ నిష్పత్తి 2.1 కంటే తక్కువస్థాయికి క్షీణించింది. ఐక్యరాజ్యసమితి రూపొందించిన కొత్త భౌగోళిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. భారత్ మహిళల్లో సంతాన సాఫల్యత అంచనా నిష్పత్తి 1.9 శాతం మాత్రమే ఉంది. నిజమైన సంతానోత్పత్తి సంక్షోభం నుండి బయటపడాలని, సాధించలేని లక్ష్యాలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని యుఎన్ఎఫ్‌పిఎ-2025 ప్రపంచ జనాభా పరిస్థితి నివేదిక (ఎస్ఓడబ్ల్యుపి) పిలుపు ఇచ్చింది. ఇది నిజమైన సంక్షోభం, ఇది జనాభా తగ్గుదల కాదు లేదా

తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## కీవ్‌పై రష్యాదాడి : ముగ్గురు మృతి

**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై మరోసారి రష్యా దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురు పౌరులు మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆన్‌లైన్‌లో ఒక ప్రకటన చేస్తూ, 315 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని పేర్కొన్నారు. మూడేళ్ళ యుద్ధంలో జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇదికూడా ఒక దాడి అని పేర్కొన్నారు. రాత్రికి రాత్రే డ్రోన్లతోపాటు ఏడు క్షిపణులను కూడా ప్రయోగించారని ఆయన చెప్పారు. కీవ్ నగరంలో ఇద్దరు మరణించారు. తొమ్మిదిమంది గాయపడ్డారు. అదేవిధంగా రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ తమ భూభాగంలోకి ప్రవేశించిన 102 ఉక్రేన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

### ఆ మూడూ తోలుబొమ్మ దేశాలే

లాత్వియా, ఎస్తోనియా, లిథుయేనియా దేశాలు మూడూ యూరోపియన్ యూనియన్ చేతిలో తోలుబొమ్మలుగా మారాయని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ విమర్శించారు. ఈ మూడు దేశాలకు ఎంతమాత్రం నిజమైన, హేతుబద్ధమైన రాజకీయ స్వాతంత్ర్యం, రాజకీయ స్వేచ్ఛ లేకుండాపోయాయని, రాజకీయ స్వయంప్రతిపత్తి లేకుండాపోయిందని విమర్శించారు.

# ట్రంప్ వర్సెస్ కాలిఫోర్నియా గవర్నర్

## పుడ్డూ-బెడ్డూ లేని నేషనల్ గార్డ్స్





**శాక్రమెంటో :** కాలిఫోర్నియాలో వలస ప్రజల ''ఐ సి ఇ'' నిరసనలు (ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులపట్ల వ్యతిరేకత) అర్థరాత్రి దాటేసరికి దాదాపు సద్దుమణిగాయి. మంగళవారంనాటికి దాదాపు ప్రశాంతత ఏర్పడిందని డిస్ట్రిక్ట్ అటార్నీ చెప్పారు. కానీ రాజకీయస్థాయిలో మాత్రం కాలిఫోర్నియా-వైట్‌హౌస్ మధ్య వివాదం ముదిరి పాకాన పడింది.

వలస ప్రజల నిరసనను అణచివేయడానికి సైన్యాన్ని తరలించిన ట్రంప్ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తప్పుపట్టారు. నేషనల్ గార్డ్స్ అవసరంలేదంటూ వారిని అడ్డుకునేందుకు గవర్నర్ ఇచ్చిన ఆదేశాన్ని అధిగమించారనీ, అందుకు అతీతంగా ప్రవర్తించడం కాలిఫోర్నియా రాష్ట్ర సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన న్యూసమ్ కోర్టులో సవాలు చేశారు. ఈ చర్యతో ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఫెడరల్ అథారిటీని న్యూసమ్ ఉల్లంఘించారని, అందువల్ల కాలిఫోర్నియా గవర్నర్‌ను అరెస్టు చేయాల్సిందే అంటూ భీష్మించారు. ''చట్టబద్ధంగా సంక్రమించే కార్యనిర్వాహక అధికారాల పరిధిని అతిక్రమించడానికి ట్రంప్ పదే పదే తన అధికారాన్ని దుర్వినియోగం చేశారు, ఈ చర్య రాజ్యాంగ విరుద్ధం'' అని గవర్నర్ తరపున అటార్నీ జనరల్ తన కోర్టు దావాలో స్పష్టంగా తెలియజేశారు. దీంతో ఈ సమస్య ట్రంప్ వెర్సస్ గవిన్ న్యూసమ్‌గా మారింది. దేశాధ్యక్షుడు ట్రంప్ నేషనల్ గార్డ్స్‌ను కాలిఫోర్నియాలో మోహరించడాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ట్రంప్ చర్య రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని ఆయన పిటిషన్‌లో కోరారు. సైనికులను మోహరించిన ట్రంప్ కాలిఫోర్నియా ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నారని, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. 2000 మంది నేషనల్ గార్డ్స్ సైనికులకు తినడానికి ఆహారం, తాగునీరు నిద్రపోవడానికి సరైన ప్రదేశం చూపించకుండా వారిని కాలిఫోర్నియాకు తరలించారని, సైనికులంతా రోడ్లపై అడ్డదిడ్డంగా పడుకుని జనాన్ని భయపెడుతున్నారని విమర్శించారు.

మొదట కాలిఫోర్నియాకు తరలించిన రెండువేల మంది నేషనల్ గార్డ్స్‌లో సగంమందిపైగా పనీపాటా లేకుండా ఖాళీగా కూర్చున్నారని, వారికి తిండి పెట్టేవారు లేరని, నిద్రపోయేందుకు తగిన సౌకర్యాలు లేవని, ఇప్పుడు కొత్తగా మరో 2000 మంది నేషనల్ గార్డ్స్‌ను పంపించి ఏం చేస్తారని, వారికి ఎలాంటి సౌకర్యాలు, తగిన పని ఇవ్వకుండా పస్తులు పెడతారా? అని గవిన్ న్యూసమ్ ప్రశ్నించారు.

సైనికులను చాలా అమర్యాదగా ట్రంప్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సైనికులు ఒక ప్రభుత్వ భవనంలో ఎలాంటి సదుపాయాలు లేకుండా నిద్రపోతున్న దృశ్యాలను ఆయన ఎక్స్ వేదికగా, సోషల్ మీడియాలో షేర్ చేశారు.

# లాస్ ఏంజెల్స్‌కు బలగాల రెట్టింపు

**వాషింగ్టన్ :** ట్రంప్ యంత్రాంగం లాస్‌ఏంజెల్స్‌కు రెట్టింపు బలగాలను తరలించింది. గడచిన నాలుగు రోజులుగా తీవ్ర నిరసనలమధ్య 2000 మంది నేషనల్ గార్డ్స్ వలస ప్రజల నిరసనను అణచివేసేందుకు ప్రయత్నిస్తుండగా మరో 2,000 మంది నేషనల్ గార్డ్స్‌ను లాస్‌ఏంజెల్స్‌కు తరలించినట్లు వాషింగ్టన్‌లో వైట్‌హౌస్ ప్రభుత్వ యంత్రాంగం మంగళవారంనాడు ధృవీకరించింది. అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ఉన్నతాధికారులు 700 మంది మెరైన్ బలగాలను తరలించారు. ఐతే ఈ బలగాలు రాత్రికి ఆలస్యంగా శాక్రిమెంటో చేరుకుంటాయి. దీంతో మొత్తం సైనిక బలగాల సంఖ్య 4,700కు చేరుకుంది. ఐతే రెండో బృందం కాలిఫోర్నియా చేరుకున్నట్లు ధృవీకరణ లేదు.

కాలిఫోర్నియాలో ఆస్తులను సంరక్షించేందుకే ఈ దళాలు వెళుతున్నాయని ఉత్తర కమాండ్‌కు చెందిన అధికారి ఒకరు చెప్పారు. దేశానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధంలో ఉపయోగించాల్సిన నేషనల్ గార్డ్స్ సైన్యాన్ని సొంతదేశంలోని ప్రజల నిరసనను అణచివేసేందుకు తరలించడాన్ని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ మాత్రమేకాకుండా బాహ్య ప్రపంచం కూడా తప్పుపడుతున్నది. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం తన చర్యను, నేషనల్ గార్డ్స్ పనితీరును సమర్థించుకున్నారు. నిరసనలు ప్రారంభమైన తర్వాత 800 మంది లాస్‌ఏంజెల్స్ పోలీసులు ''టాక్టికల్ ఎలర్ట్'' కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

### మెక్సికన్ వలస ప్రజలు క్రిమినల్స్ కాదు



**మెక్సికోసిటీ :** వలస ప్రజలు క్రిమినల్స్ కాదనీ, వారికి గౌరవ మర్యాదలు ఇవ్వాలని మెక్సికో దేశాధ్యక్షురాలు షీన్‌బామ్ కోరారు. మెక్సికో నుండి అమెరికా వెళ్ళిన పురుషులు, స్త్రీలు ఎంతో మంచివారనీ, తమ జీవితాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునేందుకే అమెరికా వెళ్లారని, వారందరూ మర్యాదస్తులు, క్రిమినల్స్ కాదనీ షీన్‌బామ్ క్లీన్‌చిట్ ఇచ్చారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడుల కారణంగా కాలిఫోర్నియాలో వలస ప్రజలు నిరసనకు దిగారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు 35 మందిని అక్రమంగా అరెస్టు చేశారని, ఈ ప్రభావం తమ దేశంలో కూడా ఉద్రిక్తతలకు ఆజ్యం పోసిందని షీన్‌బామ్ అన్నారు. వలస ప్రజలకు తగిన గౌరవ మర్యాదలు ఇవ్వాలని కోరారు.

### గొప్ప నిర్ణయం తీసుకున్నా : ట్రంప్

కాలిఫోర్నియాకు నేషనల్ గార్డ్స్‌ను పంపించి తాను గొప్ప నిర్ణయం తీసుకున్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన భుజాలను తానే చరుచుకుని అభినందనలు చెప్పుకున్నారు. మరోవైపు లాస్‌ఏంజల్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ నాథన్ హోచ్‌మన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రకటనలు, రాజకీయస్థాయిలో చేసే సంభాషణలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, చట్టబద్ధ హక్కుల ప్రకారం వలస ప్రజలు అభద్రతతో తమ వాదన వినిపించేందుకు వేలాదిమంది వీధుల్లోకి వచ్చారని, పరిస్థితిని తాము సమీక్షించి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నేషనల్ గార్డ్స్‌ను పంపాల్సినంత అవసరంలేదని, స్థానికంగానే పరిష్కరించేస్థాయిలో పరిస్థితి ఉందని అన్నారు. గడచిన నాలుగు రోజుల్లో పోలీసులు, ప్రదర్శకులమధ్య ఘర్షణలు జరిగాయి. నలుగురు జర్నలిస్టులు కూడా గాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ట్రంప్ నియమించిన బోర్డర్ జార్ టామ్ హోమన్ ఒక ప్రకటన చేస్తూ అక్రమ వలస ప్రజల ఏరివేత చర్యలకు ఎవరు అడ్డువచ్చినాసరే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్‌కు కూడా ఇది వర్తిస్తుందన్నారు. రోజుకు 6000 మంది వలస ప్రజలను గుర్తించాలని బోర్డర్ జార్ కార్యాలయం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఈ లక్షిత సంఖ్యను రోజుకు 660గా నిర్దేశించారు.

# ఆస్ట్రియా సెకండరీ స్కూల్‌లో కాల్పులు

## పది మంది మృతి



**వియన్నా :** ఆస్ట్రియా ఆగ్నేయప్రాంత నగరం గ్రాజ్‌లోని ఒక స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో తొమ్మిదిమంది విద్యార్థులు సహా పదిమంది మరణించినట్లు స్థానిక మేయర్ ఎల్కే కహర్ మీడియాకు తెలియజేశారు. కాల్పుల్లో అనేకమంది గాయపడ్డారు. మృతులు చాలామంది ఉంటారని, అనేకమంది గాయపడ్డారన్నది ప్రాథమిక సమాచారం. కానీ తర్వాత మృతుల సంఖ్యను ధృవీకరించారు. డ్రీయర్ షట్జంగాస్సే సెంకడరీ పాఠశాలలో మంగళవారం ఉదయం పది గంటలకు కాల్పుల సంఘటన జరిగిందని మేయర్ చెప్పారు. కాల్పులు జరిపింది కూడా ఒక విద్యార్థే. కాల్పులకు పాల్పడిన విద్యార్థి తర్వాత టాయిలెట్‌లోకి వెళ్ళి తన ప్రాణం తానే తీసుకున్నాడు. రెండు తరగతి గదుల్లోకి ఈ విద్యార్థి ప్రవేశించి గుండ్రంగా తిరుగుతూ కాల్పులు జరిపాడు. ఇతర వివరాలను సేకరిస్తున్నారు. ఘటన వివరాలు తెలియగానే పెద్దసంఖ్యలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల భద్రత కట్టుదిట్టం చేశారు. ఎలాంటి కిడ్నాప్ ఘటనలు జరగకుండా ప్రత్యేక కోబ్రా దళాలను స్కూలు దగ్గర మోహరించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఛాన్సలర్ క్రిస్టియన్ స్టోల్‌కర్ సహా ఇతర ఉన్నతాధికారులు కూడా పనులన్నీ స్తంభింపజేసి స్కూలువద్దకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్డర్ బెల్లెన్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తనకు మాటలు రావడంలేదన్నారు. సెకండరీ స్కూల్లో కాల్పులు, విద్యార్థుల మరణాలపట్ల యూరోపియన్ కమిషన్ చైర్మన్ ఉర్సులా ఓండర్ లేయన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

# పలు అమెరికా నగరాలకు నిరసనల జ్వాల



**వాషింగ్టన్ :** వలస ప్రజలపై అధికారులు దాడులు చేయడాన్ని నిరసిస్తూ కాలిఫోర్నియాలో ఉధృతంగా మొదలైన నిరసన ప్రదర్శనలు అమెరికాలోని పలు నగరాలకు విస్తరించాయి. న్యూయార్క్, బోస్టన్, చికాగో, డల్లాస్, తంపా, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలలో పెద్దసంఖ్యలో ప్రదర్శకులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేశారు. వలస ప్రజలకు రక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస ప్రజలపట్ల ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను అమెరికా ప్రజలు కొద్దికాలంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారిని ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుని యుద్ధఖైదీల తరహాలో తరలించడాన్ని అమెరికన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వలస ప్రజలవల్లే అమెరికాలో నేరాలసంఖ్య గణనీయంగా పెరిగిందని ట్రంప్ చాలా గట్టిగా విశ్వసిస్తున్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) నినాదాన్ని అమలు చేయడంలో భాగంగా వలస ప్రజలను దేశంలోకి రాకుండా అడ్డుకోవాలనే నినాదంతో ట్రంప్ చర్యలు తీసుకోవడం ప్రారంభించి దేశంలో అనేక దశాబ్దాలుగా ఉన్న వలస ప్రజలను కూడా నిర్దాక్షిణ్యంగా తరలిస్తూ ఉండటంతో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఐతే పలువురు ప్రదర్శకులను అన్ని నగరాలలోనూ పోలీసులు అరెస్టు చేశారు.

# 5020 మందికి ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

సాదరంగా ఆహ్వానిస్తున్నాం' అని చెప్పారు. 'శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంయుక్తంగా రివలేషన్స్ బయోటెక్ లో రూ.1360 కోట్లు, మనాకిన్ బయోలో రూ.340కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్‌లో రూ.80 కోట్లు, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.90 కోట్లు, యంత్ర టెక్ కంట్రోల్స్‌లో రూ.255 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి' అని చెప్పారు. 'ఇది తొలి అడుగు మాత్రమే. రాబోయే మూడేళ్లలో బయోటెక్, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్ టెక్, పబ్లిక్ సెక్టార్స్ తదితర రంగాల్లో మరో రూ.24వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు శైవ గ్రూప్, టారనిస్ కేపిటల్ సంసిద్ధత వ్యక్తం చేశాయి' అంటూ హర్షం వ్యక్తం చేశారు. 'ఈ రెండు కంపెనీలు రాబోయే మూడేళ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట్ ఉత్పత్తులు, పబ్లిక్ సెక్టార్‌లో ఫోర్త్ సిటీ, ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంపై నమ్మకం ఉంచి... 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన వీరికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చెప్పారు. 'కొందరు రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు... పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి వారికి మేం తీసుకొస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉద్యోగాలు కనిపించడం లేదా..? ఒక్కసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలి' అని కోరారు. 'ఇక్కడి యువత ప్రతిభే మాకున్న పెద్ద ఆస్తి. డిగ్రీ, ఇంజినీరింగ్ పట్టా తీసుకుని బయటికొచ్చే విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదనే ఫిర్యాదు పారిశ్రామికవేత్తల నుంచి తరచూ వస్తోంది.

కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ రాయ్ డిన్ రోచ్, శైవ గ్రూప్ చైర్మన్, సిఇఒ అమిత్ జగన్నాథ్ వర్మ, టారనిస్ కేపిటల్ సిఇఒ నికోలస్ ఎస్.బింగ్ హామ్, రివలేషన్స్ బయోటెక్ ఎండి రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజాం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్ మెంట్స్ అడ్వైజర్స్ సిఇఒ సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పాండురంగా రావు తమ్మినేని, యంత్ర టెక్ కంట్రోల్స్ సిఇఒ సమీర్ కాంత్ పాల్గొన్నారు.

# అనుమతి లేని విద్యా సంస్థలకు నోటీసులు




## జులై మొదటి వారంలో ఇంజినీరింగ్ కౌన్సిలింగ్
## రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజినీరింగ్ కౌన్సిలింగ్‌ను జులై మొదటి వారంలో నిర్వహించనున్నామని, ఆగస్టు 14లోపు ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఆగస్టు 14 నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభిస్తామన్నారు. అనుమతి లేకుండా కొనసాగుతున్న విద్యా సంస్థలకు నోటీసులు జారీచేసినట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తో కలిసి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా విద్యాసంస్థలను నడుపుతున్నారని, ఇలాంటి సంస్థలైన నెక్స్‌ట్‌వేవ్, బైట్ ఎక్స్‌ఎల్ టెక్ ఎడ్, లీప్ స్టార్ట్, ఇంటెల్లిపాత్ సంస్థలకు నోటీసులు జారీ చేశామని, వివరణ కోసం ఈనెల 13 వరకు ఆ విద్యాసంస్థలకు గడువు ఇచ్చామని తెలిపారు. ఈ సంస్థలలో విద్యార్థులు చేరుతున్నారన్నారు. డీమ్డ్ వర్సిటీలతో ఒప్పందం చేసుకున్నట్లు ఆ విద్యాసంస్థలు తెలుపుతున్నాయని, డీమ్డ్ యూనివర్సిటీల అంశం కోర్టు పరిధిలో ఉందని బాలకిష్టారెడ్డి వివరించారు. ఉన్నత విద్యామండలిలో సంస్కరణల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, సిలబస్ మార్పుపై కసరత్తు చేస్తున్నామని బాలకిష్టారెడ్డి తెలిపారు. సిలబస్ మార్పుపై కసరత్తు చేస్తున్నామని, కోర్సుల ఎంపికపై విద్యార్థులకు హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జెఇఇ కౌన్సెలింగ్ కాకుండా రాష్ట్రంలో కౌన్సెలింగ్ చేపట్టలేమని, విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌కు సమయం ఉండటంతో కళాశాలల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. బి కేటగిరీ సీట్లలపై ఇంకా స్పష్టత రాలేదని, ఈ అంశం ప్రభుత్వం వద్ద ఉన్నదని ఆయన చెప్పారు. తల్లిదండ్రులు అనవసరంగా బి కేటగిరీ సీట్ల కోసం డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. బి కేటగిరీ సీట్ల అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్టు బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు.

# భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు చిన్న పిల్లలు వెనుకబడిపగా, వారిని రక్షించడానికి యశ్ తిరిగి వెనక్కి వచ్చాడు. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించగా, వారిని రక్షించలేకపోయాడని అధికారి తెలిపారు. కుటుంబంలోని మరో ఇద్దరు వ్యక్తులు, యష్ భార్య, అతని పెద్ద కుమారుడు (18) గాయపడ్డారు. కాగా, ఉదయం 10.01 గంటలకు అగ్నిప్రమాదం గురించి డిపార్ట్‌మెంట్‌కు కాల్ వచ్చినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీస్ వెల్లడించింది. మొదట ఎనిమిది అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి, కానీ మంటల పరిమాణం స్పష్టంగా కనిపించడంతో మరిన్ని శకటాలను మోహరించారు. కొంత దూరం వరకు మంటలు కనిపించగా, పై పై అంతస్తుల నుండి నల్లటి పొగలు వెలువడినట్లు ఘటన స్థలంలో ఉన్న అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. దేవుడు వారిని రక్షించు!' అని పక్కనే ఉన్న భవనం నుండి ఒక మహిళ రికార్డ్ చేసిన వీడియోలో ఒక గొంతు వినిపించింది. భవనం నిర్మాణ స్థిరత్వాన్ని అంచనా వేయడానికి డిడిఎ, ఎంసిడికి సమాచారం అందించినట్లు పోలీస్ అధికారి చెప్పారు.

# కమిషన్ ముందుకు కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

సన్నద్ధమైంది.అలాగే తెలంగాణ భవన్, బిఆర్‌కెభవన్ కార్యాలయం సమీపం వరకు బిఆర్‌ఎస్ శ్రేణులను పెద్ద సంఖ్యలో చేరుకోవాలని పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో కొందరు ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. విచారణకు కెసిఆర్ హాజరవుతున్న నేపథ్యంలో భారీ జన సమీకరణకు బిఆర్‌ఎస్ సన్నద్ధమైనట్టు సమాచారం.

**కాళేశ్వరం విచారణ ముగిసినట్టేనా..!**'కాళేశ్వరం ప్రాజెక్ట్' విచారణ తుదిదశకు చేరుకుంది. కెసిఆర్ విచారణతో ఇక 'జస్టిస్ పి.సి.ఘోష్ విచారణ' ప్రక్రియ కూడా మొత్తం ముగిసినట్టే. దీంతో ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. ఈనివేదికలో ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతుల నుంచి నిర్మాణ పనులు, పిల్లర్ కృంగిపోవడం వరకు అన్ని అంశాలను క్రోడీకరిస్తూ పలు సిఫార్సులు కూడా చేయనున్నట్టు తెలుస్తోంది.

# బాలుడు కిడ్నాప్

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో పరిచయం లేని పక్కన కూర్చున్న ఓ మహిళ వృద్ధురాలితో మాట్లాడుతూ నమ్మించి బాలున్ని తీసుకుంది. ఆమె మాటలను నమ్మిన వృద్ధురాలు బాలుని ఆమె దగ్గర ఉంచి భోజనం తెచ్చుకోవడానికి హోటల్ కి వెళ్లడంతో అదే సమయంలో మహిళ బాలుని ఎత్తుకొని ఆసుపత్రి ప్రహరీ గోడ దూకి పారిపోయిది అక్కడ నుంచిఆటోలో నేరుగా ఆర్టిసి బస్టాండ్‌కు వచ్చి భువనగిరికి వెళ్లే బస్సు ఎక్కి పరారైనట్లు ఆస్పత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు ఆధారంగా పోలీసులు గుర్తించారు.

# కోటి ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు రాత్రి, పగలు అని తేడా లేకుండా శ్రమిస్తారని, ప్రకృతి వైపరీత్యాలకు ప్రాణాలు అడ్డంపెట్టి విధుల్లో నిమగ్నమవుతారని, వారి కుటుంబాల యోగక్షేమాల కోసం ఈ ప్రమాద బీమా పథకాన్ని తీసుకువచ్చామన్నారు. విద్యుత్ శాఖ రాష్ట్ర జిడిపి పెరుగుదలకు ఇంధనంగా ఉపయోగపడే ప్రధాన శాఖ అని తెలిపారు. లైన్‌మెన్ మొదలు సిఎండి స్థాయి వరకు పనిచేసే ఉద్యోగులందరికీ కుటుంబాలు ఉంటాయని, హోదాలు వేరైనా కుటుంబం విషయానికి వచ్చేసరికి ఒకే రకమైన బంధం అనుబంధం, బాధ్యత ఉంటుందని తెలిపారు. ఇంటి పెద్దకు ఊహించని ప్రమాదం ఏదైనా ఎదురైతే ఆ కుటుంబం తలకిందులవుతుందని, గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఆ పరిస్థితులు ఏర్పడవద్దని కోరుకుంటున్నానని, అనుకోకుండా అలా జరిగితే ఆ కుటుంబాలు తలకిందులయ్యే పరిస్థితులు రాకుండా ఉండడానికే ఈ ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టామని డిప్యూటీ సిఎం తెలిపారు. విద్యుత్తు సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకువచ్చామని, దీని ద్వారా ఉద్యోగుల్లో మనోధైర్యం పెరుగుతుందని, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం బాధ్యతగా భావిస్తున్నానని డిప్యూటీ సిఎం తెలిపారు. ఎస్‌బిఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమా నే కాకుండా పెళ్లి, విద్యాపరమైన ఆర్థిక సహాయం లోను రుణాలు అందించి చేయూతను ఇవ్వనున్నారని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 80 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంధన శాఖ సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభలు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసుకుని మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్ళారు. ఈ విషయాలపై కూడా భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని సీనియర్, ముఖ్యమైన నాయకులతో అధిష్టానం చర్చించే అవకాశం ఉంది. బుధవారం ఉదయం కూడా మరి కొంత మంది నాయకులకు అధిష్టానం నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నారు. మరోవైపు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్న పి.సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులను ఇప్పటికే మంత్రులు బుజ్జగిస్తుండగా, అసంతృప్తితో ఉన్న నాయకుల విషయంలో ఎలా వ్యవహరించాలని కూడా అధిష్టానం ఆలోచిస్తున్నది.

ఈ విషయాలన్నింటిపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై ఢిల్లీలో హాట్ హాట్‌గా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. శాఖల కేటాయింపు నేడు లేదా రేపు ఖరారవుతాయని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

# అమెరికాలో అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాయి. కునాల్ జైన్ అనే సామాజిక కార్యకర్త ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ వైరల్ అవుతోంది. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని.. భారతీయ విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని జైన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఘటనను చూసినప్పుడు చాలా బాధ కలిగిందని విద్యార్థి తన కలల కోసం అమెరికాకు వచ్చాడు.. అతడిని నేరస్థుడిలా ట్రీట్ చేశారని ఆవేదన కలిగించదన్నారు. దీనిపై భారతీయ నెటిజన్‌లు తీవ్రంగా స్పందించారు. వీసా నిబంధనలు, ప్రయాణికులతో వ్యవహరించే తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ ఘటన తర్వాత భారత్‌లోని యుఎస్ ఎంబసి ప్రకటన విద్యార్థుల్లో మరింత భయాందోళన పెంచుతోంది. ఈ ఘటనపై స్పందించిన భారత్‌లోని యుఎస్ ఎంబసీ.. తమ దేశానికి చట్టబద్ధంగా వచ్చే ప్రయాణికులను ఎల్లప్పుడూ స్వాగతిస్తుందని చెబుతూనే అమెరికా చట్టాలను ఉల్లంఘించడం, వీసాలను దుర్వినియోగం, అక్రమంగా చొరబడితే ఇదిగో ఇలా ఉంటుందని హెచ్చరిక స్వరంతో పేర్కొంది. అమెరికా సందర్శించడానికి ఎవరికీ హక్కు లేదు అని కూడా యూఎస్ ఎంబసీ తీవ్రంగా హెచ్చరించింది. భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా తీరును సోషల్ మీడియాలో తీవ్ర ఆందోళన వ్యక్తం అయింది. అమెరికా తీరుపట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ దీనిపై స్పందిస్తూ.. విద్యార్థిని అమానుషంగా బంధించిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్న వీడియోపై వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపింది.

# తక్షణం ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

విచ్ఛిన్నమైపోయిందని అక్కడ నివసిస్తున్న ఆదివాసీలు దీర్ఘకాలంగా ఫిర్యాదులు చేస్తున్నారు.రాజ్యాంగంలోని ఐదో షెడ్యూలులో పేర్కొన్న ఆదివాసీ ప్రజల హక్కులన్నింటినీ ఒక క్రమపద్ధతిలో ఉల్లంఘిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలలోని అడవులను, అక్కడ ఉన్న ఖనిజ వనరులన్నీ ఇష్టానుసారంగా కార్పొరేట్ శక్తుల దోపిడీకి గురవుతున్నాయి. ఈ దోపిడీవల్ల పర్యావరణ స్థిరత్వానికీ, స్థానిక ప్రజల జీవనానికీ వినాశకరమైన ఆటంకాలు కలుగుతున్నాయి. ఈ ప్రాంతాలలో ఆదివాసీలపట్ల పూర్తిస్థాయి విద్వేష శత్రుత్వ బెదిరింపు చర్యలకు దారితీసే భద్రతా బలగాల మోహరింపు చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చివరకు మరణించిన తర్వాత కూడా వారి మృతదేహాలను కుటుంబాలకు స్వాధీనం చేయకుండా శత్రుత్వవైఖరి అనుసరిస్తున్నారు. దీనివల్ల కుటుంబసభ్యులు కడసారి మృతులకు సగౌరవంగా వీడ్కోలు పలికే హక్కులను కూడా భద్రతాబలగాలు తిరస్కరిస్తున్నాయి. చర్చలకు ఆహ్వానించాలన్న తమ విజ్ఞప్తిని పరిశీలించాలని మావోయిస్టులు పదే పదే ప్రభుత్వాన్ని కోరారు. కానీ దురదృష్టవశాత్తూ, కేంద్ర ప్రభుత్వం, బిజెపి సారథ్యంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్చలద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని ఎన్నుకునేందుకు తిరస్కరించాయి. చర్చలకు బదులుగా వారిని హత్యచేసి, పూర్తిగా నిర్మూలించాలనే అమానవీయ విధానాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాయి. మావోయిస్టుల నిర్మూలనకు తుదిగడువును కేంద్ర హోంశాఖామంత్రి పదే పదే ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి కూడా మావోయిస్టులతో చర్చల అవసరం లేదని పదే పదే ఉద్ఘాటించారు. ప్రభుత్వం నిష్కపటంగా వ్యవహరించకుండా, భారతదేశ చట్టాల స్ఫూర్తికి, ప్రజాస్వామ్య పరిపాలనా సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మనుషుల ప్రాణాలు బలితీసుకోవడాన్ని ఉత్సవం చేసుకుంటున్నది. సమస్యలన్నీ చర్చల ద్వారా పరిష్కరించడానికి సంభాషణలు ప్రారంభించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ అందుకు వీలుగా కాల్పుల విరమిస్తున్నట్లు మావోయిస్టులు చేసిన ఏకపక్ష ప్రకటనకు ప్రభుత్వం తగినరీతిలో స్పందించాలంటూ విభిన్నమైన ఆలోచనలు, వైఖరులు కలిగి ఉన్నప్పటికీ కూడా అనేక మంది సంబంధిత పౌరులు, రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి ఇప్పటికే అనేక విజ్ఞప్తులు చేశాయి. అదే విజ్ఞప్తిని ఇప్పుడు మేం కూడా మీకు ఈ లేఖ ద్వారా పునరుద్ఘాటిస్తున్నాం. చట్టవిరుద్ధమైన హత్యలను,హింసాకాండను తక్షణం నిలిపివేయండి, నిష్పక్షపాతమైన న్యాయ విచారణకు ఉత్తర్వులు జారీ చేయండి'' అని ఐదు వామపక్షాలు ప్రధానమంత్రికి ఉమ్మడి విజ్ఞప్తి చేశాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రానున్న మూడు రోజులూ... భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. మంగళవారం మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జనగాం సిద్ధిపేట యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వికారాబాద్ మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు.

## ప్రశ్నించే కమ్యూనిస్టులపై
# మోదీ, అమిత్‌షా కక్ష
### ఆపరేషన్ కగార్ నియంత పాలనకు పరాకాష్ట : కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్రమోదీ, అమీత్ షాలు కక్ష కట్టి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో సిపిఐ పాల్వంచ మండల 19 మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని తొలుత అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పించి మహాసభ ప్రాంగణంలో మహాసభ ప్రారంభ సూచీగా అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, పలువరు మవోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీతో నాయ్య విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమీత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరం అన్నారు. ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. దీనిని శాంతి భద్రతలకు విఘాకం కలిగించే చర్యగా చూడాలన్నారు. 2026 మార్చి 31 నాటికి నక్సలైట్లను అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకుని ఏకపక్ష ఎన్‌కౌంటర్లు చేస్తుండటం, తాము శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా ఉద్దేశ్య పూర్వకంగానే ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది ప్రజా స్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటిని పరిగణలోనికి తీసుకుని సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద ప్రజలలకు ఎర్రజెండా భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. విషయ అవగాహన,పరపక్వత లేని అనర్హతపిటీషన్ వేసి కోర్టు సమయాన్ని వృధా చేశారని, ప్రజాతీర్పుకు సరైన న్యాయం లభించిందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ దోపిడీ, అణిచివేతకు గురవుతున్న ఏజెన్సీ పల్లెల ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నాంధి పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానే అన్నారు. గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాలవిశ్వనాధంతో పాటు నాయకులు నరాటి ప్రసాద్, వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, వీ పద్మజ, ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, కొండలరావు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గొడుగు కిందికి తీసుకొస్తాం : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గతంలో ఐటిడిఎ పరిధిలో ఉన్న 26 శాఖలను తిరిగి ఐటిడిఎ గోడుగు కిందికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. అంబేద్కర్ ఓవర్‌సిస్ స్కాలర్ షిప్‌లో గిరిజన విద్య సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు 40 నుంచి 50 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి సీతక్క అధ్యక్షతన మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో గిరిజన, ఆదివాసుల ఎంఎల్‌ఎల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్, ఎంఎల్‌ఎలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మి ,అనిల్ జాదవ్, ఆదినారాయణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక్ తిరుపతి, గిరిజన కార్యదర్శి శరత్, ఎస్‌టి గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి, అదనపు డైరక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి, గిరిజన శాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. గ్రామసభ అనుమతి లేకుండా గిరిజన గ్రామల్లో, పొలాల్లో అటవీ శాఖ అధికారులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఎంఎల్‌ఎలు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రూ.1000 కోట్లతో రాజీవ్ యువ వికాసం, రూ.12600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికా సం, రూ.17168 కోట్లతో ఎస్‌టి ఎస్‌డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఏజెన్సీ పాంత్రాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న పలు ఇబ్బందులను ఎంఎల్‌ఎలు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సభల అనుమతులు లేకుండా, 'పెసా చట్టాలను' ఉల్లంఘిస్తు అటవీ అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'తడోబా టైగ ర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వు' మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ జారీ చేసిన జిఒ నం.49ను ఉప సంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్‌నుమంత్రి సీతక్క, ఎంఎల్‌ఎలు శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కెలాగా జిఒ నం.3ను పునరుద్ధరించాలన్న ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందిరా సౌరజల గిరి వికాసం ద్వారా గిరిజన రైతుల భూముల్లో సిరులు పండించబోతున్నామన్నారు. వెనుకబడిన ఉట్నూరు, ఏటూరునాగారం ఐడిడిఎల అభివృద్ధి నిమ్మితం రూ.12 కోట్లు ప్రత్యేకంగా కేటాయించామన్నారు. గిరిజన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రికరిస్తేనే వారి ఆర్థికాభివృద్ధి పుంజుకుంటుందని చెప్పారు. 'పెసా' చట్టం నిబంధనలకు విరుద్ధంగా అటవీ శాఖ తీసుకొచ్చిన జిఒ 49ని ఉప సంహరించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌ఎలు కోరుతున్నారని, వారి అభిప్రాయాలను సిఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లుల అంశాన్ని సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు విడుదలయ్యేలా చూస్తామని హామీనిచ్చారు. మన సంస్కృతితోనే మన అస్థిత్వం కపాడబడుతుందని, అందుకే మన సంస్కృతిని, కళలను కపాడుకునేలా చర్యలు తీసుకుంటామని సీతక్క అన్నారు. భద్రాచలం తరహా ఇతర ఐటిడిఎలో గిరిజన మ్యూజియలు, లైబ్రరీలను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీఏరియాలో ప్రత్యేక జాబ్ మేళాలను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి మార్గాలు కల్పిస్తామన్నారు. గిరిజన ఎంఎల్‌ఎల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సిఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,అందుకు తగిన నిర్ణయాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. ఇదిలా ఉండ గా అంతకు ముందు సంక్షేమ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫటేరియాను మంత్రి సీతక్క ప్రారంభించారు. కొమురం భీం పోరాటం, అమరత్వం ఇతివృతంగా రూపొందించిన కొమ రం భీమ్ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను గిరిజన ఆదివాసి ఎంఎల్‌ఎలతో కలిసి మంత్రి సీతక్క గిరిజన ఆడిటోరియంలో వీక్షించారు.

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు

### 17మందితో జిల్లా కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సిపిఐ జిల్లా కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. ఇతనితో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులు, 42మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, ఉస్తేల నారాయణరెడ్డి, యల్లెంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు ఎన్నికైన వారిలో ఉన్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గన్నా చంద్రశేఖర్, ఆహ్వానితులుగా ఎస్‌కె సాయిబెల్లి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులకు, కార్యకర్తలకు కృ తజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ద్వేయంగా ముందుకు సాగుతామన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

## ఖమ్మం జిల్లా మతికేపల్లిలో నూతన మార్కెట్ యార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం జిల్లాలో మతికేపల్లిలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, నేలకొండపల్లి మార్కెట్ యార్డులు విభజించి చింతకాని, ముదిగొండ మండలాలతో మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేయనున్నారు. మార్కెట్ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈప్రాంతంలో మార్కెట్ యార్డు సదుపాయం లేకపోవడంతో మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలను రైతులు ప్రైవేట్ దళారులకు అమ్ముకునే వారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కాని ఇప్పుడు మతికేపల్లి మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం ద్వారా రైతులు తమ పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే ఖమ్మం, నేలకొండపల్లికి పోయే అవసరం తప్పుతుందని, దూరం తగ్గిపోవడం వలన రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి దళారుల వద్దకు వెళ్లడం తగ్గడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా ఆదా కానున్నాయన్నారు. ఈ మార్కెట్ యార్డు ఏర్పాటు ద్వారా రైతులు మద్దతు ధరకు అమ్ముకునే వీలు కలగడంతో పాటు, రైతులు మంచి ఆదాయం పొందే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలను యుద్ధ ప్రతిపాదికన కల్పించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# బోనాల ఏర్పాట్లకు రూ.20 కోట్లు




### ఆషాడ మాస బోనాల నిర్వహణపై మంత్రుల సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని మొత్తం 28 దేవాలయాల్లో ఆషాఢ బోనాల జాతర ఘనంగా జరపాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. బోనాల నిర్వహణకు బడ్జెట్ లోటు కూడా లేదని, ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. మరిన్ని నిధులు అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయిస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వెల్లడించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ గారే ఇబ్బంది పడ్డారని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని పఢ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**జూన్ 26న తొలి బోనం..**

ఇక ఆషాఢ మాస బోనాలు సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదం అందరి మీద ఉండాలి. జూన్ 26న తొలి బోనం గోల్కొండలో ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత బల్కంపేట, ఉజ్జయిని మహంకాళీ, లాల్ దర్వాజ బోనాలు ఉంటాయి. రంగం, తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుంది. అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

**పండుగలకు ముందు అన్ని చెక్స్ క్లియర్**

దేవాలయాలకు ఇచ్చే చెక్స్ రెవెన్యూ ఎండోమెంట్ కోఆర్డినేట్ చేసుకొని పండుగలకు ముందే పూర్తి చేయాలని, అధికారులు ఉద్యోగం లాగ కాకుండా సేవ చేస్తున్నామనే దృక్పథంతో పని చేయాలని మంత్రులు సూచించారు. శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని, అధికారులు ఎక్కడా లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో జరిగిన ఈ ఆషాడమాస బోనాల రివ్యూ మీటింగ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల చైర్మ న్లు, సభ్యులతోనూ సమావేశం కొనసాగింది.



## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి :నర్సింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, వర్షాకాలం దృష్టిలో వుంచుకొని పనిము ట్లు, కిట్లు, 15 రోజులు క్యాజువల్ లీవులు తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 9న జరుగు దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించేంతవరకు పోరా టం కొనసాగించాలన్నారు. ఇప్పటికే 3 నెలలుగా వేతనాలు రాని మున్సిపాల్టీల్లో తక్షణమే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, కార్యనిర్వాహక అధ్యక్షులు పి.వెంకటయ్య, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, రంగారెడ్డి జిల్లా నాయకులు మద్దిలేటి, మేడ్చెల్ జిల్లా నాయకులు బి.ఐ.శ్రీను, జె.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## బిసి,ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ విద్యార్థులకు తక్షణమే
# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల
### బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత 4ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్లు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదలచేసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులను ఆదుకోవాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబా ద్‌లోని బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి నాయకులు పి.కనకయ్య, చిలకరాజు శ్రీనుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ధనంజయ నాయుడు మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో పాసైన విద్యార్థులు ఫీజులను చెల్లిస్తే తప్ప ప్రైవేట్ కళాశాలలు సరిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదని, దీం తో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో తక్షణ మే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు దాటినప్పటి కీ తెలంగాణ ఏర్పడి 10ఏండ్లు దాటిన పుటికీ ఇప్పటికీ అనేక హాస్టళ్లు అద్దె భవనాలోనే కొనసాగడం సిగ్గుచేటు విషయమన్నారు. ఇప్పటికే అనేక బాలిక హాస్టళ్లలో కనీసమరుగుదొడ్ల సౌకర్యం లేదని, అనేక ప్రభుత్వ బాలికల పాఠశాలలో 500 మంది విద్యార్థినులకు కేవలం ఒకే ఒక మరుగుదొడ్డి ఉన్న బాధాకరమైన పాఠశాలలు తెలంగాణలో కోకొల్లుగా ఉన్నాయన్నారు. ప్రభు త్వం తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే విదేశీ విద్య ఓవర్సీస్ మంజూరు సంఖ్య పెంచాలని, ఇందుకు తగిన్న నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు ఫీజు రీయింబర్స్ బకాయిలతో పాటు పదివేల ర్యాంకు నిబంధనలు ఎత్తివేస్తామని, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు, స్కాలర్ షిపులు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తామని పెరిగిన ధరల ప్రకారం ప్రతి ఏటా ఉపకారవేతనాలు, మెస్ ఛార్జీలు పెంచుతామని ప్రైవేటు యూనివర్సిటీలలో సామాజిక రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన కోరారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీ సహా ఎకనామీలో భారత్ అగ్రగామి : కేంద్ర మంత్రి



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** సైన్స్ ,టెక్నాలజీతో పాటు ఎకనామిలో భారత్ అగ్రగామి అని కేంద్ర విద్యాశాఖ మంత్రి అన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఇచ్చిన వసుధైక కుటుంబకం అనే నినాదంతో అన్ని రంగాల్లో భారతదేశం ముందుకు సాగుతుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. కంది ఐఐటి హైదరాబాద్ దేశంలోనే మొదటి సారిగా గ్లోబల్ యంగ్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి 60 దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ నినాదంతో భారత దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి పరుస్తున్నామన్నారు. భారత దేశం కల్చరల్ పవర్ హౌస్ మాత్రమే కాదని ఎకానమిలో కూడా అగ్రగామిలో నిలిచిందన్నారు. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ అందుబాటులో ఉన్న తరుణంలో అది మానవాళికి ఎంత వరకు పని చేస్తుందని సందేహం కలగడంలో తప్పేమీ లేదన్నారు. అయితే ఓడిస్సాకు చెందిన ఓ యువతి డిజినల్ భోదనలో ఇబ్బంది పడుతుంటే ఏఐతో తమ సొంత భాషలో ఆ భోదన నేర్చుకోవడం గొప్ప విషయమని ఓ సంఘటనను ఆయన గుర్తు చేశారు. టెక్నాలజీని అభివృద్ధి పరచడం కోసం అనుసందాన్ అనే కార్యక్రమం కోసం 500 బిలియన్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఐపీ ఫిలింగ్స్‌లో గ్లోబల్ ర్యాంకిగింగ్లో భారత దేశం ఆరోస్థానంలో నిలవగా ఎకో సిస్టం స్థాపనలో ప్రపంచంలోనే భారత దేశం మూడవ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నా రు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్, సైన్స్ ఆకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెస ర్ అశితోష్, శర్మ, ఐఐటి బోర్డు ఆప్ గవర్నర్ బీవీ మోహన్ రెడ్డి డైరెక్టర్ బిఎస్. మూర్తి ఆయా దేశాల సైంటిస్టులు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశ ప్రజల పట్ల కేంద్రం బాధ్యతారాహిత్యం

### తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాకిస్థాన్‌తో చేసిన యుద్ధంలో భారతదేశం ఏమి కొల్పోయింది.. ఏమి సాధించిందో చెప్పాలిన బాధ్యత దేశ ప్రధాని నరేంద్రమోదీపై ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అధ్వర్యంలో నిర్వహించిన జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి లు హాజరయ్యారు. మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ సారథ్యంలో నందిగామలో భారీ గజమాలతో స్వాగతం పలకడంతోపాటు భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్ళి ముఖ్యకూడలిలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించి సభా స్థలికి వెళ్ళారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు చెప్పిన మాటలకు తలొగ్గి ప్రధాని నరేంద్రమోదీ తొక ముడిచి యుద్ధాన్ని నిలిపివేశారని, దాంతో భారత్ ఏమి సాధించింది..ఏమి కొల్పోయిందో చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో పాకిస్థాన్‌కు చెందిన 92వేల మంది సైనికుల ముక్కు నేలకు రాయించిన ఘన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. దేశ ప్రజల పట్ల కేంద్రం బాధ్యత రహితంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశ సమాగ్రతకు తుట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. దేశ సంపద గుజరాత్ ఆర్థిక నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మండిపడ్డారు. తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు కేంద్ర మంత్రులుగా ఉండి ఏమి సాధించారని, రాష్ట్రానికి ఒక్కపైసా తీసుకురాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న షాద్ నగర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిసిసి అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మెన్ చల్లా నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దాన్ని తిప్పికొట్టేందుకు ప్రజలందరు సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యం చేసేందుకు జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. రాజ్యాంగం ద్వారానే నేడు సమాజంలో సమాన ఫలాలను అందుకుంటున్నామని, అలాంటి రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. రాజ్యాంగమే లేకపోతే ఎన్నో దుష్పరిణామాలు జరిగేవని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాద యాత్ర చేశారని, వారు చూపించిన మార్గంలోనే నేడు గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి, పట్టుదలతో పని చేయాలిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇన్ చార్జిలు తారాసింగ్, జైపాల్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహ్మా, హరినాథ్‌రెడ్డి, వీరేష్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 01/EE-III(H)/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 10.06.2025

**పని పేరు:** మరమ్మతు పనులు, **మొత్తం:** 01 పని, **అంచనా విలువ:** రూ.15.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 11.06.2025న సా.04.00గం.లకు, ఆఖరి తేది: 20.06.2025న మ.03.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III (హౌసింగ్), జిహెచ్ఎంసి. సెల్ నెం. 9963551524. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telengana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III (హౌసింగ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 3379-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, కొత్తకొండ.**
మం॥ భీమదేవరపల్లి, జి॥ హనుమకొండ - 505471, Email: sriveerabhadraswamydevastanam@gmail.com

లేఖ నెం. SVBST/66/2025, తేది: 09.06.2025

**నోటిఫికేషన్ మెమో నెం. ఎఫ్5/1471/2025, ది:04.06.2025**
**శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారము.**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ జిల్లాకు దేవాదాయ చట్టము 30/1987 (సవరించబడిన చట్టము 33/2007, తెలంగాణ ఆర్డినెన్స్ నెం. 3/2016 ననుసరించి) సెక్షన్ 15 ఉపసెక్షన్-1కి లోబడి వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమింపబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకం కొరకు వారి ధరఖాస్తులను సెక్షన్ 17నందలి ఉప సెక్షన్ - 3 ననుసరించి నిర్ణీత ప్రొఫార్మా (ఫారము - II)లో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 20 రోజుల లోపు శ్రీయుత డైరెక్టర్ మరియు అదనపు కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్/శ్రీయుత ఉప కమీషనర్/ శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ వారికి పంపవచ్చును.

శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్

సం/- కార్యనిర్వహణాధికారి, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానము, గ్రా॥ కొత్తకొండ, మం॥ భీమదేవరపల్లి, జి॥ హనుమకొండ-505471.

DIPR R.O. No. : 3378-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

**పురపాలక సంఘ కార్యాలయం, హాలియా, జిల్లా: నల్లగొండ**

లేఖ నం.యం.ఇ/38/యం.హా/2025, ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ తేది: 10.06.2025

పురపాలక సంఘం, హాలియా - Engaging of JCB, Dozer, Tractor, Man power for various sanitation activities, Supply and delivery of plants for avenue plantation and Supply and delivery of supporting sticks, tree guards and pitting ..etc for avenue plantation, Supply and Fixing of New Street lights accessories (Wires, Clamps, Holders etc..) and Supply and Delivery of New Street lights, under 15th FC / MGF / PP Grants - 2025-26 నిధుల నుండి చేయుటకు అర్హత కలిగిన రిజిస్టర్ కాంట్రాక్టర్స్ నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

| | |
|---|---|
| 1. యస్.ఐ.టి.నెం. | : యం.ఇ/ /యం.హా/2025, తేది: 10.06.2025 |
| 2. పనుల సంఖ్య | : 7 |
| 3. పనుల విలువ | : 35 లక్షలు |
| 4. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ మొదలు తేది | : తేది: 12.06.2025 ఉదయం గం.11:00 ని.ల నుండి |
| 5. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ చివరి తేది | : తేది: 19.06.2025.2025 సాయంత్రం గం.03:00ని.ల వరకు |
| 6. టెండర్లు స్వీకరించు చివరి తేది | : తేది: 19.06.2025 సాయంత్రం గం.03:30ని.ల వరకు |
| 7. బిడ్ ఓపెనింగ్ తేది | : తేది: 19.06.2025 సాయంత్రం గం.05:00 ని.లకు |

టెండర్ నోటీస్ వివరములకు వెబ్ సైట్ www.eprocurement.gov.in ద్వారా తెలుసుకోగలరు. మరియు ఇతర వివరములకు కార్యాలయము పని వేళలో ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- మునిసిపల్ కమీషనర్, పురపాలక సంఘం, హాలియా

DIPR R.O. No. : 3348-PP/CL/ADVT/1/2025-26, Date: 10-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 11 జూన్

# వృద్ధ భారతీయులకు దిక్కెవరు?

'భారతదేశానికి యువతరమే పెద్ద ఆస్తి. దాన్ని ఉపయోగించుకుని అభివృద్ధిలో దూసుకుపోతాం. ప్రపంచ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా, ప్రపంచ గురువుగా ఎదుగుతాం'– రాజకీయ గణం నుంచి తరచూ ఇటువంటి మాటలు వింటూ ఉంటాం. అయితే ఇటీవల కాలంలో సన్న గొంతుకతోనైనా మరో ఆందోళనకరమైన మాట వింటున్నాం. అదేమంటే మన దేశం జనాభాలో చైనాను మించి ప్రపంచంలో నెం.1 స్థానానికి చేరుకుంది. అది మంచో చెడు వివరణ ఉండదు. కానీ దేశంలో వృద్ధుల జనాభా పెరుగుతోంది. ఆర్థిక అభివృద్ధి నిరాటంకంగా సాగాలంటే యువ జనాభా అవసరం కాబట్టి సంతాన ఉత్పత్తిని పెంచండి అంటున్నారు. నాయకుల ఇష్టాఇష్టాల ప్రకారం జనాభా ఉత్పత్తి తగ్గుదల లేదా పెరుగుదల సాధించడానికి మనుషులేమన్నా యాంత్రికమైన బొమ్మలా? ఉత్తరాది రాష్ట్రాల జనాభా నియంత్రణను పాటించనందున లోక్‌సభలో వారి సీట్లు పెరుగుతాయి, జనాభాను నియంత్రించాలన్న జాతీయ విధానాన్ని విజయవంతంగా అమలు పరచడం దక్షిణాది రాష్ట్రాలు తప్పా– మా సీట్లు తగ్గకూడదు అనే రాజకీయ ఆందోళన ప్రారంభించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, మరికొందరు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల మద్దతు పొందుతున్నారు. కాగా కుటుంబ నియంత్రణను తమ కుటుంబంలో, సమాజంలో గట్టిగా అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల తదుపరి కొత్త బాణీ మొదలుపెట్టారు. 'ముఖ్యంగా పట్టణ కుటుంబాలు ఇద్దరు లేక ఒకరు సంతానంతో సరిపెట్టుకుంటున్నారు. దాంతో సమాజంలో క్రమంగా వృద్ధుల సంఖ్య పెరుగుతూ యువత తగ్గుతోంది. ఇది భవిష్యత్‌కు ప్రమాదం. అందువల్ల ముగ్గురు –నలుగురు పిల్లల్ని కనండి' అంటున్నారు. అంతేనా? ఇద్దరి కన్నా మించి సంతానమున్న తల్లిదండ్రులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని నిషేధిస్తూ చట్టం చేసిన పెద్దమనిషి ఇప్పుడు నిషేధాన్ని ఎత్తివేస్తూ చట్ట సవరణ చేశారు. ఎంత యాంత్రిక ఆలోచన. నయా ఉదార విధానాలు ఛాంపియన్‌గా ప్రైవేటికరణను అభివృద్ధి మార్గంగా ప్రవచిస్తున్న విద్యను, వైద్యాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిన ఈ 'ఆధునిక రాజకీయవేత్త' ఇప్పుడు హితబోధలు చేస్తున్నారు. కుటుంబాలు ఒకరిద్దరు సంతానానికే ఎందుకు పరిమితమవుతున్నారో తెలియని అమాయకుడా? కుటుంబాలు చిన్నవి అవుతున్నాయి. ఆర్థికంగా గౌరవప్రదంగా జీవించే పరిస్థితులు తరిగిపోతున్నాయి. విద్య, వైద్య ఖర్చులు మోయలేని భారమైనాయి. పిల్లలు ఇంటికి వెలుగే గానీ వారి పోషణ తలకు మించిన భారమైంది.

మరోవైపున ఐదారు దశాబ్దాలుగా క్యాంపులు పెట్టి, టార్గెట్లు పెట్టీ ప్రోత్సాహకాలు ఇచ్చి గర్భనిరోధక ఆపరేషన్లు చేబట్టిన ప్రభుత్వాల వైఖరి తోడైంది. దాంతో 'చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం' అని అత్యధిక మెజారిటీ ప్రజలు తమ జీవితానుభవం నుంచి నేర్చుకున్నారు. దాన్ని తిరగగొట్టటం సాధ్యం కాదు. జపాన్ లాంటి బాగా అభివృద్ధి చెందిన దేశమే సంతానోత్పత్తి తరిగిపోయి వృద్ధులు పెరిగి భవిష్యత్తు గూర్చి బాధపడుతోంది. జనాభా నియంత్రణ కోసం చైనా 'ఒకే ఒక్క సంతానం' సూత్రాన్ని దీర్ఘకాలం అమలు చేసి యువత కన్నా వృద్ధులు పెరుగుతున్నారన్న భయంతో కొద్ది సంవత్సరాల క్రితం ఈ నియమం ఎత్తివేసి అధిక సంతానానికి ప్రోత్సాహకాలు ప్రకటించినా సంతానోత్పత్తి రేటు పెరగలేదు.

నిజమే–జనాభాలో యువత (శ్రామిక శక్తి) దామాషా తగ్గుతూ వృద్ధుల సంఖ్య పెరగడం సమాజానికి భారమే. వెనుకటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఛిద్రమైన పరిస్థితుల్లో చిన్న కుటుంబాలకు వృద్ధులు మోయలేని భారమే. వృద్ధులకు పోషణ, వసతి, ఆరోగ్యం వ్యయాలను భరించడం ప్రభుత్వాలకూ భారమే. జీవితమంతా చెమటోడ్చిన జీవులకు గౌరవప్రదమైన చరమఘడియలు ప్రాప్తింపజేయడం కుటుంబంతోపాటు సమాజం, ప్రభుత్వం బాధ్యత. ఎలా, ఏంటి అన్నది సర్వదా చర్చనీయాంశం.

'గివ్ గ్రాంట్ ఇండియా' అనే సంస్థ 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ : ది లాండ్‌స్కేప్ టుడే' పేరుతో ప్రచురించిన నివేదిక ప్రకారం భారతదేశంలో జనాభా పొందిక నిశ్శబ్దంగా, గాఢంగా మార్పు చెందుతున్నది. వృద్ధుల జనాభా (60 ఏళ్లు పైబడిన వారు) ప్రస్తుతం జనాభాలో 10 శాతం. ఈ సంఖ్య 2050 నాటికి దాదాపు 20 శాతానికి అనగా 34.7 కోట్లకు చేరుతుంది. ఆర్థిక అభద్రత, కుటుంబం తోడ్పాటు వ్యవస్థ ఛిద్రం, ఆరోగ్య సంరక్షణ అరకొరగా ఉన్న నేపథ్యంలో ఈ స్థితిని చూడాలని ఆ నివేదిక కోరింది. ఇండియా ఏజింగ్ రిపోర్ట్, 2023 ఈ నివేదికకు ఆధారం. ఆ రిపోర్టును యుఎన్‌ఎఫ్‌పిఎ ఇండియా, జనాభా శాస్త్రాల అంతర్జాతీయ సంస్థ, నీతి ఆయోగ్ సంయుక్తంగా తయారు చేశాయి.

వృద్ధుల్లో 29 శాతానికే పెన్షన్లు అందుతున్నాయి. వృద్ధుల ఆరోగ్య అవసరాలు తీర్చే విధంగా వైద్య వసతులు లేవు. వృద్ధుల్లో సగం మంది రక్తపోటు, 43శాతం షుగర్, మూడవ వంతుకు పైగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. పిఎంజెఎవై వంటి ప్రభుత్వ బీమా పథకాలు సీనియర్ సిటిజనులలో 25 శాతానికే అందుతున్నాయి. భారతదేశంలో 1000 వృద్ధాశ్రమాలు మాత్రమే ఉన్నాయి. జనాభాలో వృద్ధులు ఆంధ్రప్రదేశ్‌లో 19 శాతం, తెలంగాణలో 17.1శాతం. కాబట్టి రానున్న కాలంలో వృద్ధుల సంరక్షణ ఒక బృహత్ సమస్య కానుంది. అందుకని ఇప్పటినుంచి ముందు చూపుతో ప్రణాళికలు, కార్యాచరణ అవసరం.

## పేదరికం తగ్గుదల..
# ప్రచారం మాత్రమేనా!?

భారతదేశంలో గత పదకొండేళ్లలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గిందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికను విడుదల చేసింది. 26.9 కోట్ల మంది అత్యంత పేదిరకం నుంచి బయటకు వచ్చారని పేర్కొంది. 2011–12లో 34.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉండగా, 2022–23 నాటికి ఈ సంఖ్య 7.5 కోట్లు మాత్రమే అని పేర్కొంది. ఇదే విషయాన్ని బిజెపి.. మీడియా, సోషల్ మీడియా లో జోరుగా ప్రచారం చేస్తున్నది. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెబుతున్నారు. అయితే అసలు పేదరికం నిర్వచనంపైనే అనేక విమర్శలు ఉన్నాయి. పేదరికం తగ్గితే మరి 80 కోట్ల మందికి ఉచిత రేషన్, ఉపాధి హామీ వంటి పనులు ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**రోజుకు రూ.200 లోపే..**

ప్రపంచ బ్యాంక్ డేటాలో అత్యంత పేదరికానికి రోజుకు రూ.2.15 డాలర్లు (2022–23 ధరల ప్రకారం) అంటే రూ.200 లోపు వ్యయం చేసే వారిని పరిగణనలోకి తీసుకున్నది. అంటే నెలకు సుమారు రూ.5200 వ్యయం చేసే శక్తి ఉండడం. ఈ కేటగిరిలో 2011–12లో 16.2 శాతం మంది ఉండగా, ఇది 2.3 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 18.4 నుండి 2.8 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 10.7 నుంచి 1.1 శాతానికి తగ్గింది. దీంతో రూరల్ అర్బన్ పేదరిక వ్యత్యాసం 7.7 నుంచి 1.7 శాతానికి తగ్గింది. లోయర్ మిడిల్ ఇన్‌కమ్ పేదరికం.. అంటే రోజు వ్యయం 3.65 డాలర్లు (సుమారు రూ.300) కంటే తక్కువ నుంచి 37 కోట్ల మందికి పైగా బయటపడ్డారని పేర్కొంది. అంటే నెలకు రూ.8,800 ఖర్చు చేసే శక్తి ఉన్న వారు. అయితే ఇక్కడ పేదరికం నిర్వచనమే తప్పుగా తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రోజుకు అన్ని రకాల ధరలు పెరుగుతుండగా.. పేదరికాన్ని లెక్క వేయడానికి తీసుకునే ప్రామాణికాలే తప్పుగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రకారమే తీసుకున్నా.. 2011–12లో 60.18 శాతం మంది ప్రజలు రోజుకు 3.65 డాలర్లు (రూ.300 వరకు) సంపాదనతో జీవించేవారు. 2022–23 నాటికి ఈ సంఖ్య 28.1 శాతానికి తగ్గింది. అంటే ఆ నివేదిక ప్రకారమే చూసుకున్నా ఇప్పటికీ 35 కోట్ల మందికిపైగా ప్రజలు పేదరికంలో ఉన్నట్టే. పేదరికం తగ్గిందని ఓ వైపు ప్రగల్భాలు పలుకుతూనే.. మరోవైపు 80 కోట్ల మందికి (దేశ జనాభాలో 55 శాతం) ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఒక వేళ పేదరికం తగ్గితే ఇంత మందికి ఉచిత రేషన్ పంపిణీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా 30 శాతం కుటుంబాలు ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి.

**గత, ప్రస్తుత శాంపిలింగ్‌లో వ్యత్యాసం..**

2011–12లో చేసిన సర్వేలతో పోల్చుకుంటే 2022–23 చేసిన హౌస్ హోల్డ్ కన్స్యూమర్ ఎక్స్ పెండిచర్ సర్వేలో శాంపిలింగ్ డిజైన్, డేటా సేకరణ, రీకాల్ పీరియడ్‌లలో తీవ్ర వ్యత్యాసమున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరోవైపు 2017–18 సర్వే డేటాను ప్రభుత్వం 'డేటా క్వాలిటీ' కారణాలతో విడుదల చేయలేదు, ఇది డేటా పారదర్శకతపై సందేహాలను లేవనెత్తుతున్నది. పేదరికాన్ని ఆదాయం ఆధారంగా కాకుండా వినియోగ వ్యయం ఆధారంగా లెక్కించడం ద్వారా ఇది ఇది రోజువారీ కూలీలు, స్వయం ఉపాధి వారి ఆర్థిక అస్థిరతను దాచిపెడుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా వినియోగ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (వినియోగ వ్యయంలో ఆర్థిక అసమానతలు) 2011–12లో 28.8 శాతం ఉండగా, ఇది 2022–23కి వచ్చే సరికి 25.5కి తగ్గిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అదే సమయంలో ఆదాయ ఆధారిత జినీ కోఎఫిషియంట్ (ఆదాయ అసమానతలు) 2004లో 52 శాతం ఉండగా, 2023లో ఇది 62 శాతానికి పెరిగింది. అంటే ఆదాయ, వ్యయాల్లో పూర్తి వ్యతిరేక దృశ్యం మనకు కనిపిస్తుంది. మరోవైపు 40 శాతానికి పైగా సంపదను దేశంలోని ఒక శాతం జనాభా మాత్రమే కలిగి ఉండగా, 6.4 శాతం సంపదను దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా కలిగి ఉన్నారు.

**ఎన్నికల కోసమే 'పేదరికం తగ్గుదల'!**

రానున్న ఏడాది కాలంలో జరిగే ఆరు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పేదరికం తగ్గుదల అనే అంశాన్ని ఒక ప్రొపగండాలా బిజెపి ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా బిహార్‌లో వచ్చే నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఇక్కడ పేదరికం అనేది ప్రధాన సమస్య. పేదరికం తగ్గించామనే అంశం ద్వారా ఇక్కడ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు 2026 మే నుంచి ఆగస్ట్ మధ్యలో అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడా ఈ అంశాన్ని లేవనెత్తి ప్రజలను తమవైపు తిప్పుకోవాలని భావిస్తున్నట్లు కనిపిస్తున్నది.

**– ఫిరోజ్ ఖాన్,**
9640466464

## సింధూ నదీజలాల నిలిపివేతతో
# పాకిస్థాన్‌కు అస్థిత్వ ప్రమాదం?

సంత్ కుమార్ శర్మ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 2025 ఏప్రిల్ 23న జరిగిన భద్రత వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) సింధు నదీ జలాల ఒడంబడిక (ఐడబ్ల్యుటి)ని నిలిపివేయాలని నిర్ణయించింది. అయితే ఆ ఒడంబడిక పాఠంలో ఎక్కడా 'అబేయెన్స్' (నిలుపుదల) అనే పదాన్ని ఉపయోగించలేదని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. అందుకే భారత్ నిర్ణయానికి చట్టపరమైన మద్దతు లేదని పాకిస్తాన్ నాయకులు వాదించడం సరైనదే. అయితే, చట్టపరమైనదా కాదా అనేది పక్కన పెడితే, ఇప్పుడు వారు ఈ నిర్ణయంతో వ్యవహరించాల్సి రావడంతో పాటు దాని పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది.



చాలా మంది పాకిస్తానీయులు ఈ నిర్ణయాన్ని అస్తిత్వపు ముప్పుగా పేర్కొంటున్నారు. ఎందుకంటే వ్యవసాయ సమాజం సాగునీటిపై ఆధారపడటం చాలా ప్రాథమికమైన విషయం. భారతదేశం చేసిన ప్రకటనతో తలెత్తే పర్యవసానాలు పాకిస్తాన్‌ను తీవ్రంగా కలవరపరుస్తున్నాయి. ఎందుకంటే ఇది వారికి ముందెన్నడూ ఎదురుకాని పరిస్థితి. పాకిస్తాన్‌లోని సైనిక శిబిరాలు లేదా ఉగ్రవాద శిబిరాల లక్ష్యాలపై బాంబు దాడులను భారతదేశం అప్పుడే నిలిపివేసింది. కానీ ఐడబ్ల్యుటిపై తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి నిరాకరించింది.

ఈ నిర్ణయం పాకిస్తాన్‌లో చూపిన మొదటి ప్రభావం ఏమిటంటే, ఏప్రిల్ 29న ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొత్త సింధు కాలువ పనులన్నింటినీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం ద్వారా బిలావల్ జర్దారీ భుట్టో ముందు ఓటమిని అంగీకరించారు. 2025 ఫిబ్రవరి 15న పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌తో కలిసి ఈ ప్రాజెక్టును ప్రారంభించిన పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌కు ఇది గట్టి దెబ్బ. విజ్ఞానవంతులు, న్యాయవాదులు లేదా రాజకీయ నాయకులు సహా పాకిస్తానీలందరూ ఒడంబడికను ఏకపక్షంగా నిలిపివేయడానికి ఎటువంటి నిబంధన లేదని వాదిస్తున్నారు. ఈ ఆధారంగా, వారందరూ దీనికి సంబంధించి భారతదేశం తీసుకున్న చర్యను చట్టవిరుద్ధమని, చట్టబద్ధత లేనిదని అభివర్ణించారు.

ఒడంబడికలోని 12 ఆర్టికల్స్, ఎనిమిది అనుబంధాలలో దేనిలోనూ దానిని నిలుపుదలలో ఉంచటానికి ఎటువంటి నిబంధన లేదని ఇక్కడ పేర్కొనడం ముఖ్యం. తుది నిబంధనలు అనబడే ఆర్టికల్ XII ప్రకారం, ఒప్పందాన్ని 'ఎప్పటికప్పుడు' సవరించవచ్చు. ఆర్టికల్ XII తుది నిబంధనలు పూర్తిగా ఇక్కడ ఇస్తున్నాను. అందులో ఏమి ఉందంటే : (1) ఈ ఒప్పందానికి పీఠిక, సంబంధిత ఆర్టికల్స్ , ఎ నుండి హెచ్ వరకు అనుబంధాలు ఉన్నాయి. దీనినే 'సింధు జలాల ఒడంబడిక 1960'గా ఉదహరించవచ్చు. (2) ఈ ఒడంబడికను రెండు ప్రభుత్వాలు ఆమోదించాలి. ఆ ఆమోదాలను న్యూఢిల్లీలో ఇచ్చిపుచ్చుకోవాలి. ఆమోదాల మార్పిడి తరువాత ఇది అమలులోకి వస్తుంది. అప్పుడు 1960 ఏప్రిల్ 1నుండి పూర్వ ప్రభావంతో అమలులోకి వస్తుంది. (3) ఈ ఒడంబడిక నిబంధన రెండు ప్రభుత్వాల మధ్య అంగీకారం, ఆమోదం మేరకు ఎప్పటికప్పుడు సవరించవచ్చు. (4) ఈ ఒడంబడికలోని నిబంధనలు, లేదా, పేరా (3) నిబంధనల ప్రకారం సవరించబడిన నిబంధనలు, రెండు ప్రభుత్వాల మధ్య ఆ ప్రయోజనం కోసం కుదుర్చుకున్న, అధికారయుతంగా ఆమోదించబడిన ఒప్పందం ద్వారా రద్దు చేయబడే వరకు అమలులో ఉంటాయి. ఈ ఆర్టికల్ XIIని భారతదేశం 2023 జనవరి 25న మొదటిసారిగా ఉపయోగించింది. భారతదేశం ఆశించిన లేదా కోరుకున్న విధంగా పాకిస్తాన్ స్పందించలేదు. ఈ నిబంధన కింద ఒప్పందాన్ని సవరించడానికి కొత్తగా చర్చలను ప్రారంభించడానికి అది నిరాకరించింది.

అయితే, ఒడంబడికలోని ఆర్టికల్ XIIని పాకిస్తాన్ 'ఏకపక్షంగా' వమ్ము చేస్తోందని చెప్పవచ్చునా? 2024 ఆగస్టు 30న ఆర్టికల్ XII కింద భారతదేశం ఇచ్చిన రెండవ నోటీసుపై కూడా చర్చలను ప్రారంభించడానికి నిరాకరించినందున పాకిస్తాన్ ఇప్పటికే రెండుసార్లు ఆ పని చేసింది. ఈ మధ్యకాలంలో పాకిస్తాన్‌కు మరికొన్ని నోటీసులు కూడా ఇవ్వబడి ఉండవచ్చు. అయితే చాలా వరకు ప్రజాబాహుళ్యంలో అందుబాటులో లేవు.

ఒడంబడికలోని ఆర్టికల్ XIIకి కట్టుబడి ఉండటానికి నిరాకరించడం దాని సారాంశానికి కట్టుబడి ఉన్నట్లు అవుతుందా? లేదా ఇది ఒడంబడిక స్ఫూర్తికి విరుద్ధమా?

ఐడబ్ల్యుటిపై కరాచీలో ప్రపంచ బ్యాంకు అధికారుల సమక్షంలో 1960సెప్టెంబర్ 19న భారత ప్రధాని పండిట్ జవహారాలాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఇది దాదాపు 65 సంవత్సరాలు కొనసాగింది. యుద్ధాలు కూడా దీనిని కదిలించలేకపోయాయని పాకిస్తాన్ ఒక కథనాన్ని నిర్మించింది. తప్పుగా అవగాహన చేసుకోబడిన మంచి మనసు గల భారతీయులు కూడా దీనిని సమర్థించారు. రెండు పొరుగు దేశాల మధ్య, తరచుగా తీవ్ర ప్రత్యర్థులు, శత్రువుల మధ్య సహకారానికి ఇది చెదరని తాయెత్తు అని ఆకాశానికి ఎత్తారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని భారత ప్రభుత్వం 2001 డిసెంబర్ 13న లష్కరే తోయిబా (ఎల్‌ఇటి) ఉగ్రవాదులు పార్లమెంటుపై దాడి చేసిన తర్వాత ఒడంబడికను రద్దు చేసే అవకాశం గురించి మాట్లాడింది. అయితే, ఆ హెచ్చరిక అమలు చేయబడలేదు. దానికి రెండు సంవత్సరాల ముందు కార్గిల్ యుద్ధం సమయంలో చర్చల ఎజెండాలో కూడా ఇది లేదు. దాదాపు 65 సంవత్సరాల తర్వాత, పహల్గామ్ ఉగ్రవాద హత్యల తర్వాత 2025 ఏప్రిల్ 23న ఐడబ్ల్యుటికి యుద్ధాలు చేయలేనిది ప్రధాని మోదీ చేశారు. ఐడబ్ల్యుటిని నిలిపివేయడం మోదీ ప్రభుత్వం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ఐదు ప్రధాన శిక్షలలో మొదటిది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సిసిఎస్ నిర్ణయాలను ప్రకటించారు. ప్రతీకారం త్వరితగతిన, తీవ్రంగా శిక్షించే విధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఐడబ్ల్యుటిని నిలిపివేయడం మోదీ మన పశ్చిమ ప్రత్యర్థికి అందించిన నిజమైన నాకౌట్ పంచ్ (ఒక్క దెబ్బకు ప్రత్యర్థిని కుప్పకూల్చడం).

విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించిన మొదటి అడుగు సింధు జలాల ఒడంబడికకు సంబంధించినది. ఆయన ఇలా వివరించారు: ఈ ఉగ్రవాద దాడి తీవ్రతను గుర్తించి, భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) కింది చర్యలను నిర్ణయించింది. తదుపరి వాక్యం ఇలా ఉంది: పాకిస్తాన్ నమ్మకం కలిగించేలా, వెనక్కి తీసుకోలేని విధంగా సీమాంతర ఉగ్రవాదానికి తన మద్దతును వదులుకునేంత వరకు సింధు జలాల ఒడంబడిక (ఐడబ్ల్యుటి) తక్షణమే నిలుపుదలలో ఉంచబడుతుంది.

ఐడబ్ల్యుటిని తక్షణమే నిలిపివేయడంతో పాకిస్తాన్‌లో ఏదైనా మారుతుందా? అయితే, పాకిస్తాన్ ధైర్యంగా ఉన్నట్లు ముఖం పెట్టినప్పటికీ ఈ ప్రకటన భారీ మానసిక దిగ్భ్రాంతిని కలిగించింది. ఆ దేశ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఐడబ్ల్యుటి పునరుద్ధరించబడని పరిస్థితి గురించి తాము ఆలోచించలేమని స్పష్టంగా పేర్కొన్నారు. కొంతమంది పాకిస్తాన్ రాజకీయ, సైనిక నాయకులు తమ దేశానికి నదీ ప్రవాహాలను నిలిపివేయడం యుద్ధ చర్యగా పరిగణించబడుతుందని అన్నారు. ఈ బెదిరింపు మాటలు లేదా వైఖరులు భారతదేశంలో ఎవరినీ భయపెట్టలేదు. ఢిల్లీలో ఎవరినీ మాటలను తగ్గించుకోవడానికి లేదా ఒడంబడికను నిలిపివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి అవి ప్రభావితం చేసినట్లు కనిపించడం లేదు. నదీ ప్రవాహాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని పాకిస్తాన్‌తో పంచుకోవడాన్ని భారతదేశం తక్షణమే నిలిపివేసింది. 280 స్టేషన్ల నుండి వచ్చే ఈ సమాచారం దానికి అత్యంత విలువైనది. ఒడంబడిక నిలుపుదలలో ఉంచిన తరువాత అనేక ఇతర విషయాలు వరుసకడుతాయి.

**(ఐపిఎ సర్వీస్)**

# లాస్ ఏంజిల్స్‌లో సంక్షోభం: మీడియా భిన్న దృక్పథం

లాస్ ఏంజిల్స్, హాలీవుడ్ గ్లామర్‌కు, సాంస్కృతిక శోభకు పేరుగాంచిన మహానగరం. 2025 జూన్‌లో చెలరేగిన అడవి మంటలు, సామాజిక అశాంతి, రాజకీయ ఉద్రిక్తతలతో సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ వ్యాసం లాస్ ఏంజిల్స్‌లోని ప్రస్తుత పరిస్థితిని, దాని కారణాలను, అమెరికాలోనూ, అలాగే ప్రపంచ మీడియా భిన్న దృక్పథాలను విమర్శనాత్మకంగా పరిశీలన చేస్తుంది.




ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌ను వణికిస్తున్న ప్రధాన సమస్య 2025 ప్రారంభంలో సంభవించిన పాలిసేడ్స్, ఈటన్ అడవి మంటలు. ఈ మంటలు 12,000కి పైగా నిర్మాణాలను ధ్వంసం చేసింది. కనీసం 29 మంది ప్రాణాలు పోయాయి. దీర్ఘకాలంగా కొనసాగిన పొడి వాతావరణం, వాతావరణ మార్పులు ఈ మంటలకు ఆజ్యం పోశాయి. జనవరి చివరి వరకు గణనీయమైన వర్షం లేకపోవడం, గాలులతో కూడిన ఎరుపు జెండా హెచ్చరికలు మంటల వ్యాప్తికి దోహదపడ్డాయి. శాస్త్రవేత్తలు దీనిని 'వాతావరణ ఊగిసలాటం'గా అభివర్ణించారు. ఇది వేడెక్కుతున్న వాతావరణంలో తడి నుండి పొడి పరిస్థితులకు వేగంగా మారడం. ఈ విపత్తు బీమా నష్టాలు బిలియన్ల డాలర్లకు చేరవచ్చని అంచనా, కాలిఫోర్నియా ఆస్తి బీమా మార్కెట్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టింది.

ఈ పర్యావరణ విపత్తుతో పాటు, ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడుగా వచ్చిన తర్వాత ఫెడరల్ ప్రభుత్వ చర్యల వల్ల ఈ ప్రాంతంలో సామాజిక, రాజకీయ అశాంతి తలెత్తింది. 2025 జూన్‌లో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆధ్వర్యంలో 'నీడలో ఉన్న వలసదారులను' లక్ష్యంగా చేసికొని కఠినమైన వరుస దాడులు జరిగాయి. అందుకు వ్యతిరేకంగా శాంతి యుతంగా నిరసనలు పెరిగాయి. ఈ ఆందోళనాకారులను అణచివేసేందుకు 2,000 నేషనల్ గార్డ్ సైనికులు, 700 మెరైన్స్‌ను లాస్ ఏంజిల్స్‌కు పంపారు. ఈ దాడుల్లో డజన్ల మంది అరెస్టయ్యారు. ఫలితంగా నిరసనలు మరింతగా ఉద్ధృతమయ్యాయి. నిరసనకారులు హైవేలను అడ్డుకున్నారు. ఆటోనమస్ వాహనాలను తగలబెట్టారు. రక్షణ అధికారుల నుండి భాష్పవాయువు, మిరియాల స్ప్రేతో ఎదుర్కొన్నారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ ఈ జాతీయ సైనిక దళాల మోహరింపును 'చట్టవిరుద్ధం, అనైతికం' అని ఖండించారు. ఫెడరల్ ప్రభుత్వంపై దావా వేయనున్నట్లు ప్రతిఘటించారు. ఇది రాష్ట్ర ఫెడరల్ మధ్య విభేదాలను బయటపెట్టింది. ఈ అశాంతి వలస విధానాలు, అసమానత, సంస్థలపై అపనమ్మకం వంటి సమస్యలను ప్రతిబింబిస్తోంది. రాష్ట్ర గవర్నర్ నిర్ణయం లేకుండా ఫెడరల్ సైనిక దళాలు రాష్ట్రంలోకి ప్రవేశించి నేరుగా సైనిక చర్యలు తీసుకోవటం అమెరికా సంయుక్త రాష్ట్రాల హక్కులకు భంగకరం, రాజ్యాంగ ఉల్లంఘనగా భావిస్తున్నారు. ఇది అరుదైన సంఘటన.

**రాజకీయంగా దుమారం..**

వలసదారుల అరెస్టు నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్, లాస్ ఏంజెల్స్ స్థానిక నాయకత్వం మధ్య ఘర్షణ కూడా కూడా పెరుగుతోంది. శాంతియుతంగా ఆందోళనలు జరుతున్న వారిని అరెస్టు చేయడం, టియర్ గ్యాస్ బుల్లెట్స్ ఉపయోగించిచటం, గవర్నర్ అనుమతి లేకుండా ఫెడరల్ రిజర్వ్ సైనిక బలగాలు దించటం... మొదలైన ట్రంప్ వ్యవహారశైలిని తప్పుబడుతున్నట్టు లాస్ ఏంజెల్స్ నగర మేయర్ కరెన్ బాస్ పేర్కొన్నారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ కూడా ట్రంప్ చర్యలను ఖండించారు. ఇది ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యగా అభివర్ణించారు.

### ట్రంప్ ఆదేశాలు...

మాస్కుల్లో ఉన్న ఆందోళనకారులను అరెస్ట్ చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జరిగిన ఆందోళనల్లో మాస్క్ వినియోగాన్ని ఆయన నిషేధించారు. గత కొన్నాళ్లుగా ట్రంప్‌ను బద్ధవిరోధిలా ప్రవర్తిస్తున్న మస్క్ తాజాగా లాస్ ఏంజెల్స్ నేషనల్ గార్డులను రంగంలోకి దింపాలనే ట్రంప్ నిర్ణయాన్ని సమర్థించడం విశేషం. గత కొద్ది రోజులుగా ఎలాన్ మస్క్, డోనాల్డ్ ట్రంప్ పరస్పరం దూషించుకున్న వార్తలు దుమారం రేపాయి.

**ఆందోళనా ఉధృతి ఎందుకంటే?**

ఈ ఆందోళనలకు ప్రధాన కారణం ఫెడరల్ రక్షణ దళాలు చేస్తున్న అరెస్టులు. రోజుకు దాదాపు 2వేల మందిని అరెస్టు చేస్తున్నారు. అయితే వారి లక్ష్యం రోజుకు 3వేల మందిని అరెస్టు చేయడమే కారణమని తెలుస్తోంది. ఈ అరెస్టులకు వ్యతిరేకంగా చాలా మంది ప్రజలు మెక్సికన్ జెండాలు పట్టుకొని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్నారు.

ఈ సంక్షోభం వెనుక కారణాలు బహుముఖం. అడవి మంటలకు దీర్ఘకాల కరవు, భూమి నిర్వహణ లోపాలు, మంటలను అరికట్టడానికి తక్కువ నీటి ఒత్తిడి వంటి సాంఘిక, మానవ కారణాలు ఉన్నాయి. సామాజిక అశాంతికి ఫెడరల్ దురాక్రమణ, ఆదాయాల అసమానత, గృహ సంక్షోభం కారణం. లాస్ ఏంజిల్స్‌లో నిరాశ్రయుల సమస్య, పోలీసింగ్‌పై చర్చలు ఈ అసంతృప్తిని మరింత రాజుకొనేలా చేస్తున్నాయి. మీడియా కవరేజ్‌లో భిన్న దృక్పథాలు కనిపిస్తాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్, ఏబీసీ న్యూస్ మీడియా వంటి సంస్థలు అమెరికా అగ్ని మంటల ప్రభావాల స్థాయి, మానవ నష్టాలను వివరంగా చూపాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్, భద్రత కారణంగా నిర్వాసితులను తిరిగి గ్రామాలకు అనుమతించని విషయాన్ని గుర్తించింది. ఏబీసీ న్యూస్ 'సో–కాల్డ్ స్ట్రాంగ్' (బాధితుల సహాయ) నిధి సేకరణల ఆరోపణలుపై సమాజ స్పందనగా చూపింది. అయినా, 'ది నేషన్' ప్రకారం, కొన్ని కవరేజ్‌లలో వాతావరణ సంక్షోభంతో మంటల సంబంధాన్ని సరిగ్గా చూపలేదు. లాస్ ఏంజిల్స్, టైమ్స్‌లు రాసిన 'ఫాసిల ఇంధన కంపెనీలు మంటలకు బీజం వేశాయి' అనే వ్యాఖ్య గుర్తింపు పొందింది.


అంతర్జాతీయంగా, గార్డియన్, రాయిటర్స్ మీడియా సంస్థలు మంటలు, నిరసనలను కవర్ చేశాయి. గార్డియన్ నేషనల్ గార్డ్ మోహరింపను సర్వాధికార (నియంతృత్వ) ధోరణిగా, రాయిటర్స్ హింసాత్మక ఘర్షణలను వివరించాయి. అయితే, బిలీ క్రిస్టల్, పారిస్ హిల్టన్‌ల గృహ నష్టాలపై సంచలన కవరేజ్ సేవ కార్మికుల, అణగారిన వర్గాల సమస్యలను కప్పిపుచ్చిందని న్యూయార్క్ టైమ్స్ గుర్తించింది. ఎలన్ మస్క్ లాంటి వారి తప్పుడు ప్రచారాలు కూడా గందరగోళం సృష్టించాయని పేర్కొంది. దీనిని బీబీసీ, గార్డియన్ ఖండించాయి.

విమర్శనాత్మక విశ్లేషణలో, కొన్ని మీడియా సంస్థలు లోతైన కవరేజ్ ఇచ్చినా, వాతావరణ నాశనం, సామాజిక అసమానత వంటి మూల కారణాలను తక్కువగా చూపించాయి. సెలబ్రిటీ కష్టాలు, రాజకీయ వివాదాలపై దృష్టి సమస్యల తీవ్రతను తగ్గిస్తోంది. నిరసనలను ధర్మ పోరాటం లేదా గందరగోళంగా చిత్రీకరించడం రాజకీయ విభజనను ప్రతిబింబిస్తోంది.

చివరిగా, 2025 జూన్‌లో లాస్ ఏంజిల్స్ పర్యావరణ విపత్తు, సామాజిక అశాంతితో అల్లాడుతోంది. అమెరికా, అంతర్జాతీయ మీడియా దాని స్థాయిని చూపినప్పటికీ, మూల కారణాలు, అణగారిన గొంతులపై తక్కువ దృష్టి పెడుతున్నాయి. వాతావరణ నరమేధం, సామాజిక న్యాయం, రాజకీయ వేర్పాటును పరిష్కరించే విశ్లేషణాత్మక చర్చ అవసరం, తద్వారా లాస్ ఏంజిల్స్ కష్టాలు కేవలం తాత్కాలిక వార్తలకే పరిమితం కాకుండా నిజమైన మార్పును తీసుకురాగలవు.



**– డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
9849328496



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

### టెక్నాలజీ 'ఇరువైపులా పదునున్న కత్తి' స్వభావమైనా..

## నిర్ణయం తీసుకునే ప్రక్రియను భర్తీ చేయకూడదు

### భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్బోధ

**న్యూఢిల్లీ:** సాంకేతిక పరిజ్ఞానం రెండువైపులా పదును ఉన్న కత్తి స్వభావం అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ నొక్కిచెప్పారు. అయినప్పటికీ, ఆ తరహా నవకల్పనలు జ్యుడీషియల్ విధులను మెరుగుపర్చాలే కానీ, నిర్ణయం తీసుకునే ప్రక్రియను భర్తీ చేయకూడదన్నారు. కేంబ్రిడ్జి వర్సిటీలో జూన్ 9న 'న్యాయం అందుబాటులో రావడానికి సాంకేతికత పాత్ర'పై అంతర్జాతీయ సింపోజియాన్ని ఉద్దేశించి బిఆర్.గవాయ్ మాట్లాడుతూ వైవిధ్యమైన దేశంలో న్యాయం, సాంకేతిక పరివర్తనశక్తి ఆవశ్యకత ఎంతమేరకు దానిపై విశదీకరించారు. 'సాంకేతికపరిజ్ఞానం రెండువైపులా పదును ఉన్న కత్తిలా పనిచేస్తుందని, అసమానమైన విభజనలకు దారితీసే అవకాశం ఉంది. డిజిటల్ అంతరం, డిజిటల్ అక్షరాస్యతకు అసమాన ప్రాప్యత ఇప్పటికే న్యాయంకోసం అడ్డంకులను ఎదుర్కొంటున్న అట్టడుగు వర్గాలను మినహాయించడానికి దోహదపడుతోంది. జోక్యాలు లేకుండా న్యాయం అందించే యంత్రాంగంలో ఎలాంటి విప్లవం సాధించలేమన్నారు.



మనవళ్ళతో కలిసి

## వందేభారత్‌లో పయనించిన ఫరూఖ్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ :** ఇటీవల కశ్మీర్ నుంచి కాట్రా టౌన్‌షిప్ వరకు సాగే వందే భారత్ రైలులో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా , తన మనవళ్ళతో కలిసి మంగళవారం ప్రయాణం చేశారు. ఎట్టకేలకు భారతదేశ రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ అనుసంధానమైందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తన హృదయం సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయిందని, కళ్ళు నీళ్ళతో నిండిపోయాయని చెప్పారు.దీనిని పూర్తి చేసిన ఇంజనీర్లు, కార్మికులకు అభినందనలు తెలియజేశారు. అమర్‌నాథ్ యాత్రికులకు ఈ రైలు ఉపయోగపడుతుందని, వారు దీనిని ఉపయోగించుకుంటారని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈరైలు కశ్మీర్‌లో ఉద్యానవన రంగానికి ఉపయోపడుతుందని, మార్కెట్‌కు పంటను త్వరగా తీసుకువెళ్ళేందుకు ఉపకరిస్తుందని ఆయన అన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాతో పాటు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కుమారులు జమీర్, జహీర్‌లు కూడా వందే భారత్‌లో ప్రయాణం చేశారు.

### మరోసారి ఉగ్రదాడి జరిగితే

## భారత్ దీటుగా సమాధానం

### పాకిస్థాన్‌ను హెచ్చరించిన విదేశాంగ మంత్రి జైశంకర్..!

**న్యూఢిల్లీ:** దాయాది దేశం పాకిస్తాన్‌ను విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ మరోసారి హెచ్చరించారు. మరోసారి ఉగ్రదాడి జరిగితే భారత్ తిరిగి సమాధానం ఇచ్చేందుకు వెనుకాడదన్నారు. ఆయన బ్రస్సెల్స్‌లో పర్యటిస్తున్న ఆయన.. ఈ సందర్భంగా మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాద స్థావరాలు ఉంటే.. తాము పాక్‌లోకి వెళ్లి దాడి చేస్తామని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకాముగియలేదని.. పాక్ నుంచి మరో ఉగ్రదాడి జరిగితే.. భారత్ మళ్లీ సైనిక చర్య తీసుకునేందుకు వెనుకాడదన్నారు. 'ఉగ్రవాదం ఈ దేశం (పాక్) జాతీయ విధానంలో భాగం' అన్నారు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగిందని.. 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ తర్వాత పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసిందని.. అయితే, దీనికి స్పందనగా పాకిస్తాన్ భారత్‌పై దాడికి చేసేందుకు ప్రయత్నించిందన్నారు. పాకిస్తాన్‌లోని పలు వైమానిక స్థావరాలపై భారత్ భారీ దాడులు చేసిందని.. ఆ తర్వాత పాకిస్తాన్ దాడులుఆపాలని విజ్ఞప్తిచేసిందని.. దానికి భారత్ అంగీకరించిందన్నారు. భారత్‌కు చెందిన 4 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లుగా పాకిస్తాన్ చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిని ప్రశ్నించగా.. స్పందించేందుకు ఆయన నిరాకరించారు. దానిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని.. కానీ, త్వరలోనే సంబంధిత అధికారులు సరైన సమయంలో పూర్తిస్థాయి సమాచారాన్ని అందిస్తారన్నారు. భారత్ చేసిన దాడిలో పాక్ చాలా నష్టపోయిందని.. భారత యుద్ధ విమానాలు, ఇతర ఆయుధాలతో ఖచ్చితత్వంతో దాడి చేసిందని పేర్కొంది. పాక్ వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు గూగుల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పాక్ నిరంతరం ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూనే.. శిక్షణ ఇస్తుందన్నారు. వేలాది మంది ఉగ్రవాదులు దక్షిణ సరిహద్దుల్లో ఉన్నారన్నారు. ఇకపై తాము ఉగ్రవాదాన్ని సహించలేమని.. భవిష్యత్‌లో మళ్లీ ఏప్రిల్ తరహా దాడులు కొనసాగితే ప్రతీకారం తీర్చుకుంటామని.. ఉగ్రవాద సంస్థలు, ఉగ్ర నాయకత్వానికి వ్యతిరేకంగా తమ సందేశం స్పష్టంగా ఉందని జైశంకర్ హెచ్చరించారు.

## ముడా కేసులో రూ.100కోట్ల విలువైన ఆస్తులను అటాచ్‌చేసిన ఇడి

**న్యూఢిల్లీ:** మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్థలాల కేటాయింపులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రూ.100 కోట్ల మార్కెట్ విలువైన 92 ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. ఇప్పటి వరకు రూ.400కోట్ల విలువైన ఆస్తులు ఈ కేసులో జప్తు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులు సహకార సంఘాల పేరుతో నమోదయ్యాయని.. ఇప్పటివరకు తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ మార్కెట్ ప్రకారంగా రూ.400 కోట్లుగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత కర్ణాటక సియం, ఇతరులపై 1860 నాటి ఐపిసి, 1988 నాటి అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద మైసూర్‌లోని లోకాయుక్త పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దర్యాప్తు చేస్తున్నది. ముడాకి చెందిన 3.2 ఎకరాల భూమి విషయంలో కుంభకోణానికి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, వాస్తవానికి సతీమణి పార్వతికి 2010లో ఆమె సోదరుడు మల్లికార్జున స్వామి కేసరే గ్రామంలోని 3.2 ఎకరాల భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారు. ఈ భూమిని ముడా సేకరించింది. ఆ భూమికి పరిహారం ఇవ్వాలని పార్వతి డిమాండ్ చేయడంతో ముడా ఆమెకు దక్షిణ మైసూర్‌లోని విజయానగర్‌లో 14ప్లాట్లను కేటాయించింది. ఈ ప్లాట్ల ధర.. ఆమె ఇచ్చిన భూమి విలువైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తు న్నాయి.

# భారతవ్యోమగామి తొలి ఐఎస్ఎస్ యాత్ర నేడే



**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుంభాషు శుక్లా సహా నలుగురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) నిర్ణీత ప్రకారం బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరతారు. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నడీ స్పేస్ సెంటర్ నుండి యాక్సియమ్–4 కమర్షియల్ మిషన్ ఐఎస్ఎస్‌కు బయలుదేరుతుందని స్పేస్ ఎక్స్ ఉపాధ్యక్షుడు విలియమ్ గెర్స్టెన్మైర్ మంగళవారంనాడు పత్రికాగోష్ఠిలో చెప్పారు. ఈ నౌక గురువారం మధ్యాహ్నం 12.30 గంIIలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం అవుతుంది యాక్సియమ్–4 (ఎఎక్స్–4) మిషన్‌లో వ్యోమగాములకు నాయకత్వం వహిస్తున్న పెగ్గీ విట్సన్, భారత్ పైలట్ శుక్లా, స్పెషలిస్ట్ టైగర్ కపు (హంగేరీ), స్లావోజ్ ఉజ్నన్‌స్కీ విస్నయిస్కీ (పోలండ్)లు ఐఎస్ఎస్‌కు వెళుతున్నారు. 14 రోజులపాటు వారు ఐఎస్ఎస్‌లో ఉండి పరిశోధనలు చేస్తారు.

ఫాల్కన్–9 రాకెట్‌ను స్థిరంగా ఉంచి మంటలను బయటకు ఎగజిమ్మే పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు కొన్ని సమస్యలను ఇంజనీర్లు తొలుత గుర్తించారు. రాకెట్‌లో బూస్టర్లను పునరుద్ధరణను గుర్తించలేదు. దీంతో మంగళవారంనాడు జరగాల్సిన ఐఎస్ఎస్ ప్రయాణం ఒకరోజు ఆలస్యంగా బుధవారంనాటికి వాయిదా వేశారు. లాక్స్‌లో లోపం ఉన్న విషయాన్ని ఇంజనీర్లు గుర్తించారు. ఇంతకుముందు ప్రయోగం చేసిన తర్వాత మళ్ళీ బూస్టర్లను పునరుద్ధరించలేదు. వాటిని పూర్తిగా మరమ్మతు చేయలేదు. ఈ సమస్యను మంగళవారంనాటికి పరిష్కరించారు. అన్నింటినీ సరిదిద్దారు. ఇప్పుడు ఇంజనుకు సంబంధించిన సమస్యలన్నీ మంగళవారం సాయంత్రం నాటికి పూర్తిగా పరిష్కారమయ్యాయి.

కాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ దీనికిముందుగా సోమవారంనాడు ఒక ప్రకటన చేస్తూ, జూన్ 10 వతేదీకి బదులుగా 11వ తేదీన ఫాల్కన్ రాకెట్ ప్రయోగం వాయిదా వేసినట్లు ఎక్స్ వేదికగా చెప్పారు.

అమెరికా అంతరిక్షదళం 45వ వెదర్ స్క్వాడ్రన్ జిమ్మీ టాగర్ మాట్లాడుతూ, సెంట్రల్ ఫ్లోరిడా ఆగ్నేయ ప్రాంతం ఉపరితలంలో భారీఎత్తున గాలి ఒత్తిడి కొనసాగుతోందని, నైరుతీవైపు ఈ గాలి ప్రసరిస్తోందని చెప్పారు. రాబోయే రెండు రోజుల్లోనూ ఉపరితలంలో ఉన్న విపరీతమైన గాలి ఒత్తిడి తదుపరి ఉత్తరం వైపు కొనసాగుతుందని, ఉదయం పూట ఉరుములతో వర్షం పడుతుందన్నారు. ఐనప్పటికీ కూడా మంగళవారంనాడు మొదటి ప్రయత్నానికి పిఓవి తక్కువగా ఉన్నప్పటికీ, రెండో ప్రయత్నంలో బుధవారం నాడు ఈ పిఓవి ఇరవైశాతానికి పెరుగుతుందన్నారు. రెండు రోజులు గాలులు వేగంగా ఉంటాయని, బుధవారం నాటికి అంతా సాధారణస్థితికి వస్తాయని, గురువారంనాటికి పరిస్థితి మరింత ఉత్తమంగా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకూ ఐఎస్ఎస్‌కు ఫాల్కన్ రాకెట్‌ను పంపేందుకు అవకాశాలు ఉన్నాయని నాసా ఇంటర్నేషనల్ స్పేస్ ప్రోగ్రామ్ మేనేజర్ డానా వీగెల్ చెప్పారు. మా వాహనాలు సిద్ధంగా ఉన్నాయనీ, వాతావరణంకోసం తాము ఎదురుచూస్తున్నామనీ వీగెల్ చెప్పారు.

# ప్రజలకు భద్రతకల్పించడంలో కేంద్రసర్కార్ విఫలం

### మోదీ ప్రభుత్వం గద్దె దిగాల్సిందే: మమతా బెనర్జీ



**కోల్‌కతా:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి సంబంధించి కేంద్రం ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు భద్రత కల్పించడంలో విఫలమైనందున గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇటీవలి సైనిక సంఘర్షణ సమయంలో ఆ భూభాగాన్ని తిరిగి పొందేందుకు భారతదేశానికి సువర్ణావకాశం లభించిందని, కానీ నిర్ణయాత్మకంగా వ్యవహరించడంలో విఫలమైందని బెనర్జీ పేర్కొన్నారు. పిఒకెను నియంత్రించడానికి తమకు అవకాశం లభించిందని, అందుకు బదులుగా ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన కమిటీలో పాకిస్థాన్‌కు అనుమతి లభించిందని, దీని బట్టి చూస్తే మన విదేశాంగ విధానంలో లోపం ఉందా? అని ఆమె ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కచ్చితమైన దాడులకు సాయుధ దళాల శౌర్యాన్ని ప్రశంసించే తీర్మానంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రసంగించారు. అయితే ఈ పదాన్ని తీర్మానంలో స్పష్టంగా ప్రస్తావించలేదు. పహల్గామ్ దాడిని కేంద్ర ప్రభుత్వ పూర్తి వైఫల్యం, నిర్లక్ష్యపు ఫలితమని పేర్కొంటూ, 26 మందిని బలిగొన్న ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో భద్రతా దళాలు లేకపోవడాన్ని బెనర్జీ ప్రశ్నించారు. 'ఉగ్రవాద దాడి జరిగిన ప్రదేశంలో భద్రతా దళాలు లేదా పోలీసు సిబ్బంది ఎందుకు లేరు? ఒక్క ఉగ్రవాదిని ఎందుకు పట్టుకోలేదు? అధిక భద్రతా జోన్‌లో అటువంటి దాడి ఎలా జరిగింది? అని బెనర్జీ నిలదీశారు. అంతర్గత భద్రతలో భారీ లోపమే కారణమని ఆమె పేర్కొంటూ దానికి కేంద్రం జవాబుదారీతనంగా ఉండాలని డిమాండ్ చేశారు. తాము ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వమని, దానికి మతం, కులం అంటూ ఏమీ లేవన్నారు. పహల్గామ్ హత్యలకు బాధ్యులకు ఆలస్యం చేయకుండా న్యాయం చేయాలని బెనర్జీ అన్నారు. భారత సైనిక చర్యను ప్రశంసిస్తూ, మన సాయుధ దళాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తాం అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు చేస్తూ, ఆయన ప్రకటనలలో మాత్రమే బిజీగా ఉన్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌కు సంబంధించి భారతదేశ దౌత్య వ్యూహం గురించి కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మన దౌత్యంలో ఏదైనా సమస్య ఉందో లేదో తెలియదు, ఎందుకంటే పాకిస్థాన్ అంతర్జాతీయంగా ఇరుక్కుపోయే బదులు, ఎఎంఎఫ్ నుండి రుణాలు పొందుతోందన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సాయుధ దళాల శౌర్యాన్ని బిజెపి రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోందని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. గతంలో బిజెపి పుల్వామా దాడిని ఎలా రాజకీయం చేసిందో కూడా బెనర్జీ గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అశాంతిని రెచ్చగొట్టడానికి ఇలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా హెచ్చరించారు.

### 'మోదీరాజ్'లో అసమానతల స్థాయిలు

# 'వలసవాద బ్రిటీష్‌రాజ్'ను దాటిపోయాయ్

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ధ్వజం



**న్యూఢిల్లీ :** 'మోదీరాజ్'లో భారతంలో అసమానతల స్థాయిలు 'వలసవాద బ్రిటీష్ రాజ్'ను దాటిపోయాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. కీలక రంగాలలో గుత్తాధిపత్యం పెరిగిపోవడంతో ధరలు పెరిగాయని, పదేళ్ళుగా గ్రామీణ వ్యవసాయ కార్మికుడు మొదలు మధ్యతరగతి వేతన జీవుల వరకు సగటు భారతీయుని వేతనాలు స్థంభించిపోయాయని వెల్లడించారు. ఇటీవల విడుదలైన 'కేప్ జెమిని రీసెర్చ్ ఇన్స్‌టిట్యూట్' నివేదికను ఆయన ప్రస్తావిస్తూ ఆమ్ ఆద్మీని పెద్ద ఎత్తున నిరాశపరుస్తూ 2024లో భారతదేశంలో 33వేల మందిగా కొత్త 'ఖాస్ ఆద్మీ' మిలియనీర్లు అవతరించారని పేర్కొన్నారు. అలాగే అత్యధిక నికర విలువ కలిగిన వ్యక్తుల (హెచ్ఎన్‌డబ్ల్యు) సంపద 8.8 శాతం పెరిగిందన్నారు. అంటే మోదీ రాజ్‌లో ఉన్నత వర్గం రికార్డు స్థాయిలో పెరగడమే కాకుండా వారి సంపద కూడాఆశ్చర్యకరమైన స్థాయిలో పెరిగిందని జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. గడిచిన పదకొండేళ్ళలో ఆర్థిక అసమానతలు తీవ్రమవడమే మోదీ ప్రభుత్వ ట్రాక్ రికార్డ్ ఎద్దేవా చేశారు. నెక్ట్స్ జెన్ హెచ్ఎన్‌డబ్ల్యుఇతర దేశాలలో ఆస్తులను పెంచుకునేందుకు ప్రణాళికలు రచించుకుంటున్నారని, భారతదేశంలో సంపద కేంద్రీకృతం చేసకున్న వర్గాలు భారతదేశాన్ని వీడి సంఖ్య మరింత వేగంగా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చస్త్రశారు. ఇది భారతదేశం భరించలేని మేథో వలస, దీనికి పెరిగిపోతున్న అసమానతలకు ప్రత్యక్ష ప్రభావమని పేర్కొన్నారు.

**భారతీయుల గౌరవాన్ని కాపాడడంలో మోదీ విఫలం**

భారతీయుల పట్ల క్రూరత్వానికి, దారుణాలకు ఒడిగడుతున్న విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. అమెరికాలోని న్యూవార్క్ ఎయిర్‌పోర్ట్ నుంచి భారతీయ విద్యార్థిని వెనక్కి పంపే ముందుకు, సంకెళ్ళు వేసి, నేలపై అదిమిపట్టుకొన్న వీడియో, ఫోటోలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. వాటిని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. భారతదేశం, భారతీయుల గౌరవాన్ని కాపాడడంలో మోదీ ప్రభుత్వం వరుసగా విఫలమవుతోందని ఆయన ఆరోపించారు. చరిత్రలో మొదటిసారిగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణను అమెరిక అధ్యక్షుడు వాషింగ్టన్ డిసిలో ప్రకటించారని, భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చిన ఘనత తనదేనని అమెరికా అధ్యక్షుడు పదే పదే చెప్పుకుంటున్నారని తెలిపారు. కాల్పుల విరమణపై లేదా అమెరికాలో భారతీయులపై జరగుతున్న దురాగతాలపై మాట్లాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యాన్ని కూడదీసుకోలేకపోతున్నారని విమర్శించారు.



### అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్‌కుమార్ యాదవ్‌ను...

# రక్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నం

### రాజ్యసభ ఎంపి, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ ధ్వజం

### 'అభిశంసన'నోటీస్‌పై ఎందుకు చర్యతీసుకోలేదని రాజ్యసభ చైర్మన్ ధన్కర్‌పై విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీస్‌పై ఎందుకు చర్య తీసుకోలేదని మంగళవారం రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌ను ప్రశ్నించారు. గత ఏడాది మతపరమైన వ్యాఖ్యలు చేసిన జడ్జిని ప్రభుత్వం రక్షించేందుకు ప్రయత్నిస్తోందని కపిల్ సిబల్ ఆరోపించారు. సీనియర్ న్యాయవాది అయినటువంటి సిబల్ ఈ మొత్తం సంఘటన వివక్షతను సూచిస్తున్నదన్నారు. మరోవైపు రాజ్యసభ సెక్రటేరియట్ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిందన్నారు. ఎగువసభలో యాదవ్‌పై పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఆయనపై అంతర్గత విచారణకు వెళ్లవద్దని కోరిందన్నారు.అయితే జస్టిస్ యశ్వంత్‌వర్మ విషయంలో అలా చేయలేదన్నారు. కొన్ని నివేదికల ప్రకారం వర్మకు వ్యతిరేకంగా అభిశంసన ప్రక్రియలేకుండా సుప్రీంకోర్టు విచారణను ఉదహరించి, ప్రభుత్వం ఆయన్ను తొలగించడానికి ప్రయత్నిస్తే అది ప్రయత్నించడం రాజ్యాంగ విరుద్ధం అవుతుందని కపిల్ సిబల్ అన్నారు. న్యాయ స్వతంత్రతను ప్రమాదంలో పడేస్తున్నందుకు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటారన్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నటువంటి వర్మ అధికారిక నివాసంలో మార్చిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఆయన ఇంటి ఆవరణలో కాలిన నగదు కట్టలను కనుగొనడం జరిగింది. జస్టిస్ యాదవ్ అంశంపై సిబల్ మాట్లాడుతూ అది 'చాలా దురదృష్టకర సంఘటన' అని అన్నారు. రాజ్యాంగ పదవిలో సోపాన క్రమంలో రెండవ స్థానంలో ఉన్నటువంటి వ్యక్తి విషయమై లెక్కలేనన్ని ప్రశ్నలు తలెత్తాయని, ఆరు నెలల కాలంలో రాజ్యాంగ బాధ్యతలు తలెత్తినప్పుడు ఈ ప్రశ్నలు తలెత్తుతాయన్నారు. 2024, డిసెంబరు 13న మేం రాజ్యసభ చైర్మన్‌కు 55 మంది ఎంపీలు తమ సంతకాలతో కూడిన అభిశంసన తీర్మా నం నోటీస్ ఇచ్చి ఉన్నారని, అయినప్పటికీ ఎలాంటి చర్యా ఇప్పటివరకూ తీసుకోలేకపోవడం బాధాకరం అని కపిల్ సిబల్ ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. రాజ్యాంగ పదవిలో ఉన్నవారిని నేను అడగదలచానని, వారు సంతకాలు చేశారా? లేదా? అని మాత్రమే పరిశీలించడం వారి బాధ్యత అని, అందుకు ఆరు నెలల సమయం పడుతుందా? లేదా, ప్రభుత్వం శేఖర్‌యాదవ్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తుందా అని కపిల్ సిబల్ ప్రశ్నించారు.విశ్వహిందూ పరిషత్ సూచనల మేరకే యాదవ్ హైకోర్ట్ ప్రాంగణంలో ప్రసంగించారని, ఆ తర్వాత సుప్రీం కోర్టు దృష్టికి ఈ అంశం వెళ్లడంతో చర్య తీసుకున్నారని సిబల్ తెలిపారు. యాదవ్‌ను ఢిల్లీలో ప్రశ్నించారు. అలహాబాద్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి నుంచి ఒక నివేదికను కోరింది. ప్రధాన న్యాయమూర్తి 2025మే 13న ప్రతికూల నివేదిక ఇచ్చారని తాను విన్నానని, చైర్మన్ ఈ విషయాన్ని రాజ్యాంగబద్ధంగా పరిశీలించాలని, పార్లమెంట్ దానిపై ముందుకు తీసుకెళ్లవచ్చిన అన్నారని సిబల్ తెలియజేశారు. రాజ్యసభ సెక్రటేరియట్ సిజెఐ చర్య కోరుతూ ఒక లేఖ పంపించిందని , అభిశంసన తీర్మానం నోటీస్ ఉన్నందున ఈ విషయాన్ని పరిశీలిస్తామని, యాదవ్‌పై సుప్రీంకోర్టు అంతర్గత ప్రక్రియను తప్పకుండా నిలిపివేయాలని కపిల్ సిబల్ కోరారు. డిసెంబర్ 13న పలువరు ప్రతిపక్ష పార్టీల సభ్యులు విశ్వహిందూ పరిషత్ ఈవెంట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు జస్టిస్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఎగువ సభలో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అభింశన తీర్మానం నోటీస్‌పై సంతకం చేసిన 55మంది ప్రతిపక్ష ఎంపీలలో కపిల్ సిబల్ సహా జైరాం రమేష్, వివేక్ తన్ఖా, దిగ్విజయ్‌సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా, సాకేత్‌గోఖలే ఉన్నారు. డిసెంబర్ 8న జరిగిన విశ్వహిందూ కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ మాట్లాడుతూ ఏకరీతి పౌర నియమావళి (యూనిఫామ్ సివిల్ కోడ్ ) లక్ష్యం సామాజిక సామరస్యాన్ని, లౌకికవాదాన్ని ప్రోత్సహించడమేనని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించండి

### ప్రధాని మోదీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. ఈ పదవిని ఖాళీగా ఉంచడం 'భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచిది కాదన్నారు. రాజ్యాంగంలో రూపొందించబడిన నిబంధనలను కూడా ఉల్లంఘించడమే అవుతుందని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఖాళీకి సంబంధించి ప్రస్తుతం ఉన్న అత్యంత ఆందోళనకరమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి లేఖ రాస్తున్నానన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఇద్దరినీ ఎన్నుకోవడం తప్పనిసరి అని, రాజ్యాంగబద్ధంగా స్పీకర్ తర్వాత డిప్యూటీ స్పీకర్ సభకు రెండవ అత్యున్నత ప్రిసైడింగ్ అధికారి అని ఆయన అన్నారు. సాంప్రదాయకంగా, డిప్యూటీ స్పీకర్ కొత్తగా ఏర్పడిన లోక్‌సభ రెండవ లేదా మూడవ సమావేశంలో ఎన్నికవుతారని ఖర్గే అన్నారు. ఈ ఎన్నికకు సంబంధించిన విధానం స్పీకర్ విధానాన్ని ప్రతిబింబిస్తుందని, లోక్‌సభలో విధాన, ప్రవర్తన నియమాలలోని నిబంధన 8(1) ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తేదీని స్పీకర్ నిర్ణయిస్తారనే ఏకైక తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుండి పదహారవ లోక్‌సభ వరకు ప్రతి సభకు డిప్యూటీ స్పీకర్ ఉన్నారని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. సాధారణంగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుండి డిప్యూటీ స్పీకర్‌ను నియమించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. అయితే, స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా ఈ పదవి వరుసగా రెండు లోక్‌సభ పర్యాయాలు ఖాళీగా ఉందని, 17వ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగలేదన్నారు. ఈ సందర్భోచిత ఉదాహరణ ప్రస్తుతం జరుగుతున్న 18వ లోక్‌సభలో కూడా కొనసాగుతోందన్నారు. ఇది భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలకు శుభసూచకం కాదని, రాజ్యాంగంలో రూపొందించబడిన నిబంధనలను కూడా ఉల్లంఘిస్తోందని ంగ్రెస్ చీఫ్ అన్నారు. ఈ విషయాల దృష్ట్యా లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే ప్రక్రియను మరింత ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని తాను అభ్యర్థిస్తున్నానన్నారు. జూలై 21 నుండి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ఖర్గే డిమాండ్ వచ్చింది.

## ఎన్‌సిపి చీలుతుందని ఎప్పడూ అనుకోలేదు

### పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ పవార్



పుణె : ఇరవై ఆరేళ్ల క్రితం తాను స్థాపించిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలికను ఎదుర్కొంటుందని తాము ఎప్పుడూ అనుకోలేదని మంగళవారం ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్లను ఎదుర్కొని పార్టీని ముందుకు తీసుకెళ్లినందుకు కార్యకర్తలను అభినందిస్తున్నాన్నారు. 2023లో ఎన్‌సిపి విడిపోయిన విషయం తెలిసిందే. కాగా, పార్టీ 26వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పవార్ మాట్లాడారు. ఎన్‌సిపి కొన్ని సవాళ్లను ఎదుర్కొంది, కానీ నిరుత్సాహపడకుండా పార్టీని ముందుకు తీసుకెళ్లండని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో చీలిక వస్తుందని తాను ఎప్పుడూ అనుకోలేదని, కానీ అది జరిగిపోయిందన్నారు. 'ఇతర సిద్ధాంతాలతో కొంతమంది బయటకు వెళ్లారు, దీంతో పార్టీ చీలికకు దారి తీసింది. ఈరోజు దాని గురించి మాట్లాడదలచుకోలేదు. కానీ పార్టీకి విధేయులుగా ఉన్నవారు, అది మా పార్టీ సిద్ధాంతం వల్లనే' అని పవార్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో పరిస్థితి మరోలా ఉంటుందన్నారు. ఎవరో వెళ్లిపోయారని, లేక ఎవరోపార్టీలో చేరారు అని ఆలోచించవద్దు. మనం ఐక్యంగా ఉండి సామాన్య ప్రజలకు అండగా ఉంటే, మనకు ఎటువంటి సమస్యలు ఎదురుకావని పవార్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలు చాలా మంది ప్రజాసేవకు అంకితభావంతో ఉన్నారని, వారే పార్టీకి నిజమైన బలం అని పవార్ అన్నారు. 'అధికారం గురించి చింతించకండి. మనం ఐక్యంగా ఉంటే, అధికారం వెంటాడుతుంది. రాష్ట్రంలో ఆ అవకాశం ఉద్భవించేలా నేను చూసుకుంటా' అని అన్నారు. రెండు మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్నందున, పార్టీ నాయకత్వం ప్రతి జిల్లాలోని ఎన్‌సిపి (ఎస్పి) ప్రతినిధులతో మాట్లాడి స్వతంత్రంగా లేదా కూటమిలో పోటీ చేయాలా వద్దా అని నిర్ణయిస్తుందని పవార్ అన్నారు. రాష్ట్రంలో కొత్త తరం పార్టీ కార్యకర్తలు, నాయకులను సృష్టించడానికి ఎన్‌సిపి (ఎస్‌పి) పనిచేస్తుందని ఆయన అన్నారు. 'యువ నాయకత్వానికి ఎలా అవకాశాలు ఇవ్వాలో ఆలోచించాలి, అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. రాష్ట్రం లో కొత్తనాయకత్వాన్ని తీసుకురావడం ద్వారా పార్టీచరిత్ర సృష్టిస్తుందన్నారు. శరద్ పవార్ బంధువు అజిత్ పవార్ అప్పటి శివసేన–బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన తర్వాత జూలై 2023లో ఎన్‌సిపి విడిపోయింది. పార్టీ పేరు, గడియారం గుర్తును అజిత్ పవార్ వర్గానికి ఇవ్వగా, మాజీ కేంద్ర వ్యవసాయ మంత్రి నేతృత్వంలోని వర్గానికి ఎన్‌సిపి (శరద్‌చంద్ర పవార్) అని నామకరణం చేశారు.

## జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా సతీశ్‌రెడ్డి




**న్యూఢిల్లీ :** జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఎబి) సభ్యుడిగా డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి నియామకమయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఆయన బోర్డు సభ్యుడిగా కొనసాగనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రా మాజీ చీఫ్ అలోక్‌జోషీ నేతృత్వంలోని జాతీయ సలహా బోర్డును ఏర్పాటు చేసిన విసయం తెలిసిందే. ఈ బోర్డు ప్రధాని నేతృత్వంలోని జాతీయ భద్రతా కౌన్సిల్‌కు పలు సూచనలు చేస్తుంది. జాతీయ భద్రతా సలహా బోర్డును ఇటీవలే పునర్వ్యవస్థీకరించి.. రా మాజీ చీఫ్ అలోక్ జోషి నేతృత్వంలోని బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డులో ఏడుగురు సభ్యుల్లో ఆరుగురిని ఇప్పటికే కేంద్రం నియనించింది. ఇందులో మాజీ వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, ఆర్మీ సదరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకేసింగ్, రియర్ అడ్మి రల్ మోంటీ ఖన్నా, విశ్రాంతి ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్‌వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ విదేశాంగ శాఖ అధికారి బీ వెంకటేశ్‌వర్మను బోర్డు సభ్యులను నియమించింది. తాజాగా రక్షణరంగ నిపుణుడు, డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డికి సైతం చోటు కల్పించింది. ప్రస్తుతం ఆయన ఏపీ ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్నారు.

# ఢిల్లీ హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులపై 'సుప్రీంకోర్టు స్టే'

### ఎన్‌సిఐఎస్‌ఎంసి, ఇతరులకు 'అపెక్స్ కోర్ట్' నోటీసులు జారీ

**న్యూఢిల్లీ :** భారత వైద్యవ్యవస్థ జాతీయ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ఎన్‌సిఐఎస్ఎంసి)చైర్‌పర్సన్ పోస్ట్ నియామకానికి అర్హత లేదంటూ ఆయన్ను తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మంగళవారం సుప్రీంకోర్టు 'స్టే' విధించింది. వైద్య జయంత్ యశ్వంత్ దేవ్‌పూజారి దాఖలు చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్‌మోహన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఎన్‌సిఐఎస్‌ఎంసి, ఇతరులకు నోటీసులు జారీచేసింది. దేవ్‌పూజారి ఎన్‌సిఐఎస్‌ఎంసి చైర్మన్‌గా తన నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ హైకోర్టు రెండు పిటిషన్లను అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేశారు. చైర్‌పర్సన్ ఎంపిక, నియామక ప్రక్రియ ప్రారంభమైందని కమిషన్ న్యాయవాది హైకోర్టుకు తెలియజేయగా ఆ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో తన పరిశీలనను పరిగణనలోనికి తీసుకోవాలని హైకోర్టు సూచించింది. పూర్వ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ ప్రసిడెంట్ వేద్ ప్రకాష్ త్యాగి, డాక్టర్ రఘునందన్ శర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. కమిషన్ చైర్‌పర్సన్‌గా దేవ్‌పూజారిని నియమిస్తూ 2021 జూన్ 9న సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఒక సర్క్యులర్‌ను జారీచేయడంపై పిటిషన్లు దాఖలు చేసిన పిటిషన్‌దారులు భారతీయ వైద్య వ్యవస్థ జాతీయ కమిషన్ చట్టం 2020 (ఎన్‌సిఐఎస్‌ఎం) యాక్ట్) పేర్కొన్న ప్రకారంగా దేవ్‌పూజారికి తప్పనిసరిగా ఉండాల్సిన పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదని ఆరోపించారు. పుణే విశ్వవిద్యాలయం అతనికి ఇచ్చిన డిగ్రీ తక్కువ అర్హత (మాస్టర్స్ డిగ్రీ) సంపాదించడాన్ని సూచించదని స్పష్టం చేసింది.



# జనరల్

STATE & REGIONAL NEWS

## జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి నివాళులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనారోగ్యంతో ఇటీవల మరణించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శినికి హైకోర్టు మంగళవారం నివాళి అర్పించింది. యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ అధ్యక్షతన ఫస్ట్ కోర్టు హాల్లో సంతాప సమావేశం జరిగింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని సమావేశం మౌనం పాటించింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ గిరిజా ప్రియదర్శిని కుటుంబ సభ్యులతోపాటు, ఎజి సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జి.ప్రవీణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ హాజరయ్యారు. బార్ అసోసియేషన్ కూడా సంతాప సమావేశం నిర్వహించింది.



## చర్లపల్లి చెరువు అభివృద్ధికి హైడ్రా సహకారం

### హైడ్రాను కోరిన జైళ్ల విభాగం డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న 58 ఎకరాల చెరువును ఆధునికీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంలో హైడ్రా సహకారం అందించాలని జైళ్లు విభాగం డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ని హైడ్రా కార్యాలయంలో కలిసి చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న చెరువు వీడియోలను చూపించారు. నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు చేస్తున్న హైడ్రాను అభినందించారు. హకీంపేట నుంచి ఆరేడు గొలుసుకట్టు చెరువులతో అనుసంధానమైన ఈ చెరువునకు మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా ఉందని హైడ్రా ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుందన్నారు. చుట్టూ పాత్ వే, మినీ పార్కులు, చెట్లు, కుర్చునే సౌకర్యం కల్పించడంతో పాటు, సిసిటివి కెమేరాలు ఏర్పాటు చేస్తే అందరికీ వినియోగంలోకి వస్తుందన్నారు. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత కింద నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నారని సౌమ్య మిశ్రా తెలిపారు. అప్పటికప్పుడే చెరువు అభివృద్ధి బాధ్యతలను హైడ్రా అధికారులకు కమిషనర్ రంగనాథ్ అప్పగించారు. చెరువును త్వరలోనే సందర్శిస్తామని సౌమ్య మిశ్రాకు ఆయన హామీనిచ్చారు. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల అభివృద్ధికి సంబంధించిన వీడియోలను హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. హైడ్రాతో పాటు జైళ్ల విభాగం అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హరీష్‌రావుపై ఎలక్షన్ పిటిషన్ డిస్మిస్

### హైకోర్టు తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత టి. హరీశ్ రావు ఎన్నికను సవాల్ చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. పిటిషనర్ జి.చక్రధర్ గౌడ్ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపలేదని పేర్కొంది. ఆధారాలు సమర్పించకుండా, వివరాలు ఇవ్వకుండా ఎలక్షన్ పిటిషన్ వేశారంది. హరీష్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ బీఎస్పీ నుంచి పోటీ చేసిన(ప్రస్తుతం కాంగ్రెస్) చక్రధర్‌గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా చక్రధర్ వేసిన ఈపీని కొట్టివేయాలని హరీష్ వేసిన మధ్యంతర అప్లికేషన్‌ను ఆమోదించింది. ఈ మేరకు జస్టిస్ కాజా శరత్ విచారణ పూర్తి చేసి మంగళవారం జడ్జిమెంట్ చెప్పారు. గత ఏడాది జనవరి 10న చక్రధర్ గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఎన్నికల అధికారులకు వినతి పత్రం మాత్రం సెప్టెంబరు 30న సమర్పించారని, ఈపీ వేశాకే ఈసీకి ఫిర్యాదు చేశారని తప్పుపట్టారు. ఈసీకి అందజేసిన వినతిపత్రం ప్రతిని హైకోర్టుకు ఇవ్వలేదన్నారు. పోలింగ్ జరిగిన రోజు సాయంత్రం 4 గంటలకు 45 శాతమే పోలింగ్ ఉంటే దానిని హరీష్ తన అనుచరుల ద్వారా 85 శాతం పెరిగేలా చేశారనే ఆరోపణలకు ఆధారాలైన గంటలవారీ పోలింగ్ వివరాలు సమర్పించలేదన్నారు. మిట్టపల్లి రెవిన్యూ గ్రామంలో సర్వే నెం 1037లోని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా చూపి తప్పుదారి పట్టించారంటూ ధరణి పోర్టల్లోని వివరాలకూ ధ్రువీకరణ లేకుండా ఆరోపణ చేశారన్నారు. సర్వే నెం 1037లో 1431 చదరపు గజాలు. 520 చదరపు గజాలు వేర్వేరుగా కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లను హరీశ్ ఇచ్చారని తెలిపారు. క్రిమినల్ కేసుల వివరాలను హరీష్ ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని, కేసులతో పాటు శిక్ష పడిన కేసుల వివరాలను కూడా ఇచ్చారన్నారు. పిటిషనర్ ఆరోపణలకు ఆధారాలను సమర్పించలేదని తీర్పు చెప్పారు.

## గాలికి శిక్ష సస్పెన్షన్‌పై నేడు ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసు(ఓఎంసీ)లో సీబీఐ కోర్టు విధించిన శిక్షను సస్పెండ్ చేయాలని కోరుతూ గాలి జనార్ధన్‌రెడ్డి (కర్నాటక ఎమ్మెల్యే) దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌పై బుధవారం తీర్పు వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. ఓఎంసీ కేసులో గాలి జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ దోషులని తేల్చుతూ సీబీఐ కోర్టు గత నెల 6న ఏడేళ్ల జైలు విధించింది. ఈ తీర్పును వారితోపాటు ఓఎంసీ కంపెనీ కూడా సవాల్ చేస్తూ హైకోర్టులో అప్పీళ్లను దాఖలు చేశారు. శిక్ష అమలు జరిగితే తనపై కర్నాటక అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేశారని, నియోజకవర్గానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ఆస్కారం ఉంటుందని గాలి జనార్ధన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓఎంపీ డైరెక్టర్లు ఇద్దరూ జైలులో కంపెనీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఓఎంసీ దాఖలు చేసిన అప్లికేషన్‌లో పేర్కొంది. వీటిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం పూర్తి చేశారు. ఐఏలపై బుధవారం ఉత్తర్వులు వెలువరిస్తామని ప్రకటించారు. ఇదే కేసులో ప్రధాన పిటిషన్ విచారణ ఆగస్టు 11కు, మరికొన్ని అప్లికేషన్లపై విచారణ ఈ నెల 17కు వాయిదా వేశారు.

## మొహర్రం ఊరేగింపునకు ఏర్పాట్లు పూర్తి

### హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వచ్చేనెల మొదటి వారంలో జరగనున్న మొహర్రం ఊరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, షియా మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజి, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొహర్రం రోజున ఏనుగు ఊరేగింపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీరు అందించాలని, జిహెచ్‌ఎంసి అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బిబికాఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌళిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫీకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజీద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, అమీర్ అలీ ఖాన్, బల్మూరి వెంకట్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, జలమండలి ఎం.డి.అశోక్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, వక్ఫ్ బోర్డు సిఇఓ పాల్గొన్నారు.

## రాజ్యసభకు కమల్ ఏకగ్రీవ ఎన్నిక



**న్యూఢిల్లీ :** మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి ఆరుగురు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార డిఎంకె నుంచి ముగ్గురు, ప్రతిపక్ష ఎఐడిఎంకె నుంచి ఇద్దరు, ఎంఎన్ఎం నుంచి కమల్ హాసన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల పరిశీలన తర్వాత డీఎంకే, ఏఐడీఎంకే, ఎంఎన్ఎం సభ్యుల నామపత్రాలు ఆమోదం పొందినట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం ఏడుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతీ అభ్యర్థికి సుమారు 10 మంది ఎమ్మెల్యేల మద్దతు తెలపాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే స్వతంత్ర అభ్యర్థులకు ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్ల విత్ డ్రాకు జూన్ 12 వరకు గడువు ఉంది. ఈ నేపథ్యంలోనే ఈనెల 12న రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనట్లు ఆ ఆరుగురికి సర్టిఫికెట్లు అందజేయనున్నారు. అంతకుముందు శుక్రవారమే రాజ్యసభకు కమల్ హాసన్‌నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడులో త్వరలో ఖాళీ కానున్న ఆరు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం 2025 జూలై 25న ముగియనుండడంతో జూన్ 19న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలోనే జూన్ 2న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ జూన్ 9న ముగిసింది. ఆరు సీట్లకు గానూ 3 స్థానాల్లో డీఎంకే, రెండు స్థానాల్లో అన్నా డీఎంకే, ఒక స్థానానికి డీఎంకే మిత్రపక్షమైన ఎంఎన్ఎంకు పోటీ చేశాయి.

## మూడు నెలల్లో సీవరేజి టన్నెలింగ్ ప్రాజెక్టు పూర్తిచేయాలి

### జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూడు నెలల్లో సీవరేజి టన్నెలింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సీవరేజి టన్నెలింగ్ ప్రాజెక్టు వివిధ ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న పనులను జలమండలి ఎండి అశోక్ రెడ్డి సందర్శించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం నుంచి నింబోలి అడ్డా వరకు ట్రెంచెస్ టెక్నాలజీతో నిర్మిస్తున్న సీవర్ ట్రంక్ మెయిన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. మొదటగా కింగ్కోటి, కాచిగూడ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులలో వేగంపెంచి 40 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టాలన్నారు. పనులు జరిగే సమయంలో రక్షణ చర్యలు పాటించాలని, వర్షాకాలం నేపథ్యంలో పనులు జరిగే ప్రాంతంలో బారికేడ్లు ఉండేలాగా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ప్రాజెక్టు జిఎం కుమార్ పాల్గొన్నారు.

## జులై 9న సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సిద్ధం

### కార్మిక సంఘాల సమ్మె సన్నాహక సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అనేక రాష్ట్రాలలో కార్మిక కోడ్‌లను అమలు చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని దానిని ప్రతిఘటనగా జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు.ఈ సమ్మె నిజానికి మే 20న చేపట్టాల్సి ఉండగా అదే సమయంలో భారత్‌పాకిస్తాన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను జూలై 9కి వాయిదా వేసిందన్నారు. సమ్మెను విజయవంతం చేసేందుకు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్మిక సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకులు రిబ్బా రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నరసింహ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని కనీస పెన్షన్ రూ.9000 గా నిర్ణయించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని న్యూ పెన్షన్ స్కీమును రద్దుచేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్తో కార్మిక వర్గం పోరాటానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నద్ధంగా జూన్ 13 నుంచి 20 వరకు జిల్లాలలో కార్మిక సంఘాల సమావేశం ప్రెస్మీట్లో నిర్వహించాలని,జూన్ 20 నుంచి 25 తేదీలలో అన్ని పారిశ్రామిక వాడల లలో సమ్మె నోటీసులు అందజేయాలని, ఈనెల 25 నుండి 30 వరకు పారిశ్రామిక సదస్సులు నిర్వహించాలని, జూలై 1 నుండి 4 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, 5, 6 తేదీలలో బైక్ ర్యాలీలు నిర్వహించి ప్రచారం నిర్వహించాలని, జూలై 9న హైదరాబాదు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా పోరాటాన్ని నిర్వహించాలని కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ కుమార్ యాదవ్, టి యు సి ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం, ఐఎఫ్టియు నాయకులు శివ భాస్కర్, టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోస్, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## నాలా విస్తరణ పనులు వేగంగా జరగాలి

### బేగంపేటలో నాలాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలా విస్తరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలం ఆరంభంలో ఉందని, ఈ నెలాఖరుకు సాధ్యమైనంతమేరకు పూర్తి చేయడంతో పాటు నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తే, కొంతమేర వరద ముప్పు నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల ఆక్రమణలను తొలగించిన ప్యాట్నీ నాలా విస్తరణ పనులు సాగుతున్న తీరును కంటోన్మెంట్ సిఈఓ మధుకర్ నాయక్, హైడ్రా ఇరిగేషన్, ట్రాఫిక్ అధికారులతో కలిసి రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. వాస్తవంగా ఉండాల్సిన 20 మీటర్ల మేర వెడల్పు చేయడంతో పాటు, ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. ఈమేరకు పనులు ఎంత వరకు వచ్చాయనే విషయాన్ని గమనించారు. నాలాకు ఇరువైపులా 5 మీటర్ల బఫర్ కూడా ఉండేలా చూడాలన్నారు. నాలా విస్తరణ పనులు చేపట్టినందుకు స్థానికులు కమిషనర్‌ను కలిసి అభినందించారు. దశాబ్దాలుగా మునిగిపోతున్నామని, ఈ సారి వరదముప్పు తప్పించేందుకు చేస్తున్న చర్యలకు పూర్తి సహకారం ఉంటుందన్నారు.

**చికోటీ గార్డెన్స్ నాలా పునరుద్ధరణ..**

ప్రకాష్ నగర్ మెట్రో స్టేషన్ దగ్గర బేగంపేట విమానాశ్రయం నుంచి వచ్చే వరద నీటిని తీసుకెళ్లే కాలువ వాస్తవానికి 6 మీటర్లుండాల్సి ఉండగా, ఎక్కడికక్కడ కనీసం 2 మీటర్లు కూడా లేని పరిస్థితిని జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నందిని హోటల్ వద్ద మొత్తం 1.8 మీటర్లకే పరిమితమైంది. కూకట్‌పల్లి ప్రధాన కాలువ కలిసేవరకు 2 కిలోమీటర్ల పొడవు ఈ నాలా ఉండగా, కిలోమీటరు మేర ఆక్రమణలకు గురైనట్టు నిర్ధారించారు. ఈ నాలాను పునరుద్ధరించడానికి అధికార యంత్రాంగం సిద్ధమౌతోంది. నాలా విస్తరణకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని అక్కడి స్థానికులు తెలిపారు. అపార్టుమెంట్‌ల మధ్యలోంచి వెళ్తున్న నాలా విస్తరణకు తమకేమీ అభ్యంతరం లేదని పలు అపార్టుమెంట్‌ల అసోసియేషన్‌ల వాసులు చెప్పారు. కమిషనర్‌ను కలిసి ప్రతి ఏటా వరద ఉధృతి ఎలా ఉంటుందో నాటి వీడియోలు చూపించారు. మోకాలు లోతు నీటిలో తాము ఇళ్లకు చేరాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న నాలాను 6 మీటర్ల మేర విస్తరిస్తే బేగంపేట ప్రధాన రహదారిపై నుంచి వచ్చే వరద నీరు సాఫీగా సాగేందుకు వీలవుతుందన్నారు.

**చింతలబస్తీలో నాలా పరిశీలన..**

శంకరపల్లిలోని బుల్కాపూర్, కొంపల్లి, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, మెహిదీపట్నం, బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 మీదుగా చింతలబస్తీలోకి ప్రవేశించి హుస్సేన్‌సాగర్‌లో కలిసే బుల్కాపూర్ నాలాను హైడ్రా కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. పింఛను కార్యాలయం దగ్గర చింతలబస్తీలోకి ప్రవేశించే చోట నాలాను కబ్జా చేసి దుకాణాలు నిర్మించడాన్ని తీవ్రంగా పరిగణించారు. వరద ఫ్లోకు అడ్డుకట్ట వేసే మాదిరి ఆక్రమించి, ఇసుక, సిమెంట్ వ్యాపారాలు చేసుకోవడమేంటి అని ప్రశ్నించారు.

ఇలా చింతలబస్తీలో పలు చోట్ల నాలా కబ్జాలను పరిశీలించారు. నాలాను ఆక్రమించి కల్లు కాంపౌండ్ నిర్మించడాన్ని చూసి, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. పేరుకుపోయిన చెత్తను పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు.

## అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల దాష్టీకం సిగ్గుచేటు

### సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చదువులు, ఉద్యోగ, ఉపాధి కోసం అమెరికాకు వెళ్లిన భారతీయ విద్యార్థుల, వలస దారుల పట్ల దేశానికి ఆదేశ ఇమ్మిగ్రేషన్ అధికారులు అమానుషంగా వ్యవహరించడాన్ని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. చేతులు వెనుకకు విరిచికట్టి, తొక్కిపెట్టి బలవంతంగా పశువుల మాదిరిగా తిప్పి పంపించడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. కోటి ఆశలతో, పొట్ట చేత పట్టుకొని వెళ్లినవారు, ఏజెంట్స్ చేసే తప్పులతో వారు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా హర్యానా కు చెందిన వలస విద్యార్థి పట్ల అమెరికాలోని న్యూజెర్సీ నీవడా విమానశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారుల దాష్టికం భారతీయు లందరికి అవమానకరమైందని ఆయన పేర్కొన్నారు.. దీని పట్ల, గతంలో విమానాల్లో సంకెళ్ళతో కుక్కి అవమానకరంగా పంపిన దారుణాల పట్ల ట్రంప్ ప్రియ మిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కనీసం నిరసన తెలియ జేయక పోవడం అన్యాయమన్నారు.

## గోపీనాథ్‌పై ఎన్నికల పిటిషన్ మూసివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన రెండు ఎన్నికల పిటిషన్లపై హైకోర్టు విచారణ మూసివేసింది. ఈవీఎంలో అవకతవకలు జరిగినందున మాగంటి గోపీనాథ్ ఎన్నికను రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, ఓటరు వి నవీనీయాదవ్ వేసిన పిటిషన్లను కొట్టేస్తూ మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మాగంటి మరణించడంతో పిటిషన్లపై విచారణ అవసరం లేదన్నారు

## ఎన్‌డిపిఎల్ స్పెషల్ డ్రైవ్ సక్సెస్

### వారం రోజుల్లో రూ.25లక్షల మద్యం స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) పై వారం రోజుల పాటు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సక్సెస్ అయ్యింది. ఈ నెల 3 నుంచి 9 వరకు తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో రూ. 25 లక్షల విలువ చేసే లిక్కర్, బీర్, దేశీదారు మద్యాన్ని ఎక్సైజ్ శాఖ సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎస్‌టిఎఫ్ , ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్ టీమ్‌లతోపాటు ఎక్సైజ్ సిబ్బంది కలిసి నిర్వహించిన దాడుల్లో 64 కేసులు నమోదు చేశారు. 33 మందిని అరెస్టు చేశారు. 19 వాహనాలను సీజ్ చేశారు. దాడుల్లో 1188 మద్యం బాటిళ్లు, 22 లీటర్ల బీరు బీటిళ్లు, 21 లీటర్ల దేశీదారు లిక్కర్ను ఎక్సైజ్ శాఖ సీజ్ చేశారు.

**స్పెషల్ డ్రైవ్లో భాగంగా..**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన అదేశాల మేరకు ఢిల్లీ, గోవా నుంచి వచ్చె రైళ్లలో ఎస్ టి ఎఫ్ టీమ్లు తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానం వచ్చిన వారి బ్యాగులను తనిఖీలు నిర్వహించిన క్రమంలో 40 మద్యాం బాటిళ్లను పట్టుకున్నారు.గోవా నుంచి వాస్కోడిగామా రైలును ఎస్ టి ఎఫ్ టీమ్లుతోపాటు వికారాబాద్కు చెందిన ఎక్సైజ్, డీటిఎఫ్ సిబ్బంది కలిసి జరిపిదాడుల్లో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ మద్యం పట్టుకున్నారు. రంగారెడ్డి , శంషాబాద్ డీటిఎఫ్ జరిపిన దాడుల్లో పెద్ద మొత్తంలో ఎన్‌డిపిఎల్ మద్యం పట్టు బడింది. , గోవా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న మద్యం తోపాటు డిఫెన్స్ మద్యం బాటిళ్లను పెద్ద మొత్తంలో పట్టుకున్నారు.శంషాబాద్, సరూర్నగర్, మల్కాజ్గిరి, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్, సంగారెడ్డి, మెదక్, వరంగల్ అర్బర్, కరీంనగర్లో ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ ను పట్టుకున్నారు. అదిలాబాద్, నిర్మల్, అసిఫాబాద్ , కామారెడ్డి ప్రాంతాల్లో దేశీదారు మద్యంను పట్టుకున్నారు.

**ఇదే తీరును కొనసాగించాలి.. షానవాజ్ ఖాసీం**

వారం రోజుల్లో ఎస్‌టిఎఫ్ , ఎన్‌ఫోర్స్ మెంట్, డి టి ఎఫ్ టీమ్లుతోపాటు ఎక్సైజ్ యంత్రాంగం చేపట్టిన దాడులు మంచి ఫలితాలు ఇచ్చాయి. ఇదే తీరును అన్ని టీమ్లు నిరంతరం దాడులు నిర్వహించి నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ను అరికట్టాలి. నాన్ పెయిడ్ లిక్కర్ను వినియోగదారులు ఎవ్వరు వినియోగించ వద్దు.

## గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే దివ్యాంగులకు నష్టం

### అర్హులైన వారందరికీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

### సమాజంలో దివ్యాంగులను భాగస్వాములను చేయాలి

### 'సదరన్ సర్టిఫికెట్' వర్క్‌షాపులో మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'సదరం సర్టిఫికెట్ల' జారీలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, అందుకే చాలా మంది అర్హులు నష్టపోయారని మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ జారీ చేయకపోతే వారికి తీవ్ర అన్యాయం చేసినట్టు అవుతుందని, అర్హులైన వారికి సర్టిఫికెట్లను జారీ చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో సదరం ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో వైకల్య గుర్తింపు అంశంపైన వైద్యులకు మంగళవారం 'వర్క్ షాప్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, సెర్ప్‌సిఇఒ దివ్యాదేవరాజన్, సదరం డైరెక్టర్ సాయి కిషోర్, న్యూఢిల్లీ ఎయిమ్స్, గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లోని పలు విభాగాధిపతులు, స్పెషలిస్ట్‌లు, డాక్టర్లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ దివ్యాంగుల వైకల్యాన్ని గుర్తించేందుకు డాక్టర్లకు వర్క్ షాపును నిర్వహించడం రాష్ట్ర చరిత్ర లో మొదటి సారి అని అన్నారు.

ఎలాంటి వైకల్యం, ఎంత శాతం మేర వైకల్యం ఉంది, అనే అంశాన్ని డాక్టర్లు పక్కాగా గుర్తించి, సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 38 ఆస్పత్రుల్లో సదరం సర్టిఫికెట్ల జారీ కోసం అంగవైకల్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ఆస్పత్రికి రూ.10లక్షల చొప్పున మొత్తం రూ. 3.8 కోట్లను విడుదల చేశామని వివరించారు. సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే చేయిత పెన్షన్, ఉద్యోగ ఉపాధి రంగాల్లో రిజర్వేషన్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి పథకాలు ఇలా పలు సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్ ఆధారమని, అందుకే డాక్టర్లు మానవతను జోడించి వైకల్య పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు.

దివ్యాంగులకు ఆత్మగౌరవం దక్కాలంటే డాక్టర్లు పక్కాగా పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం ప్రతి ఏడాది రూ 50 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వం దివ్యాంగులను ఆత్మగౌరవంతో ముందంజలో నిలిచే విధంగా చేయుత నందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

**సర్టిఫికెట్లు ఇవ్వకపోతే దివ్యాంగులు నష్టపోయే ప్రమాదం**

వైద్యులు సక్రమంగా సర్టిఫికెట్ ఇవ్వకపోతే దివ్యాంగులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య వృత్తి అంటేనే ప్రాణం పోసే వృత్తి అని, ఓర్పు, నేర్పుతో పరీక్ష నిర్వహించి ధీకరణ పత్రాలు అందజేయాలని చెప్పారు.

21 రకాల వైకల్యాలను గుర్తించి సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని మంత్రి సీతక్క తెలిపారు. సిఎం ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తున్నామని, వైకల్యాన్ని సరిగ్గా గుర్తించేందుకు డాక్టర్లకు ఓరియంటేషన్ ఇప్పిస్తున్నామని వివరించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా డాక్టర్లు కృషి చేయాలని, సమాజంలో దివ్యాంగులకు భాగస్వామ్యం కల్పించి వారి ఎదుగుదలకు తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దివ్యాంగులకు చింతప త్రాలు ఇచ్చేది డాక్టర్లేనని, డాక్టర్లు ఇచ్చే సర్టిఫికెట్ల ఆధారంగానే దివ్యాంగులకు ఉపాధి ఉద్యోగం ఆత్మగౌరవం లభిస్తోందన్నారు. ఈపవిత్ర యజ్ఞంలో దివ్యాంగులందరికీ డాక్టర్లు అండగా నిలవాలని కోరారు. కాగా ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి రెండు వందల కు పైగా డాక్టర్లు హాజరయ్యారు.

## రాజీ మార్గమే, రాజమార్గం: ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** జూన్ 14 వ తేది వరకు జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ కోరారు. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవిత కాలం కొనసాగుతాయి. ఒకవేళ ఇంతటితో కలిసుంటానని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే అవి సమసిపోతాయని రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులలోని కక్షిదారులకు విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 14వ తారీకు వరకు నారాయణపేట, కోస్గి కోర్టులలో నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. మీకు తెలిసిన వాళ్లపై ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకుని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుందని అన్నారు. దీనికోసం ఫిర్యాదుదారుడు నేరస్తులు అందరు తమ యొక్క ఆధార్ కార్డు తీసుకుని సంబంధిత కోర్టు ప్రదేశంలో హాజరు కావాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశం అని దీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

## శతాబ్ది ఉత్సవాలు సక్సెస్ చేయండి : బి.బాలకిషన్

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** విరోచిత పోరాటాలకు అండదండగ నిలబడే మన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాడి (1925–2025) వంద సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పార్టీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ మాట్లాడుతూ.. ఈ తరుణంలోనే మన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల జూన్ 11న (నేడు) బుధవారం రోజున ఉదయం 11 గంటలకు తెలంగాణ చౌరస్తా సమీపంలోని సిపిఐ పార్టీ ఆఫీస్ నుండి వందలాది మందితో భారీ ర్యాలీ ప్రదర్శన ప్రారంభించి ఆల్మాస్ ఫంక్షన్ హాల్లో గొప్ప బహిరంగ సభ జరగబోతున్నది. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర రథ సారథి, అసెంబ్లీలో మన కార్మిక వర్గ గొంతును వినిపిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే, కామ్రేడ్ కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారు.

## సబ్‌స్టేషన్ స్థల పరిశీలన



**ప్రజాపక్షం/ఊర్కొండ :** ప్రజల బాగు కోసం, ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తూ, అహర్నిశలు అభివృద్ధే తన లక్ష్యంగా పెట్టుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఊర్కొండపేట గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ స్థల పరిశీలన మంగళవారం విద్యుత్‌శాఖ కన్‌స్ట్రక్షన్ ఏడి మాధవి, విద్యుత్‌శాఖ కల్వకుర్తి ఏడి శంకరయ్య ఏఈ సాయన్నగౌడ్ స్థల పరిశీలన చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

## సమస్యలపై అర్జీలు పెట్టుకోండి

**ప్రజాపక్షం/వెల్దండ :** కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ గ్రామసభను మండలకేంద్రంలోని రైతువేదికవద్ద నిర్వహించే సభను రైతులు పాల్గొని తమతమ సమస్యలపై అర్జీలు పెట్టుకోవాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వహయాంలో రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి రెవెన్యూ గ్రామసభలను తీసుకొచ్చి ఆ సభలలో రైతుల నుండి తమతమ సమస్యలపై అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సంబంధిత జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించాలి




**ప్రజాపక్షం/వంగూర్ :** ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఐకెపి పిడిచిన్న ఓబులేసు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐకెపి కార్యాలయంలో 40 ప్రభుత్వ పాఠశాలలకు గాను 2033 ఒకే రకమైన దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మురళిమోహనచారి, ఎంపిడిఓ బ్రహ్మచారి, ఐకెపి ఎపిఎం శ్రీనివాసులు, ఆయా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**ప్రజాపక్షం/ధన్వాడ:** ధన్వాడ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మండంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వంట మనుషులకు స్కావెంజర్లకు మండల స్థాయిలో సమావేశమును నిర్వహించడం అయింది. ఆ ఆ పాఠశాలలో వంటలను ఎలా చేయాలి. ఏఏ వంటను ఏ రకంగా చేయాలని పాఠశాలలు ఉన్న చుట్టూ ముట్టు స్థలాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నదానిపై ఒకరోజు శిక్షణ శిభిరాన్ని ఏర్పాటు చేయనైనది. ఈ శిక్షణ కార్యక్రమం జడ్పిహెచ్ఎస్ కొండాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి.శంకరయ్య, జెడ్‌పిహెచ్ఎస్ ధన్వాడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పిలు సిసిహెచ్‌లు స్కావెంజర్లు తదితరులు ఉన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా సెంటర్‌లో గత మూడు నెలలుగా కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం ట్రేడ్‌లలో ఉచిత నైపుణ్య శిక్షణ పొందిన రెండవ బ్యాచ్ అభ్యర్థులకు సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో నేడు (11/06/ 2025) ఫైనల్ పరీక్షలను ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు రాత పరీక్ష, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష సెంటర్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు పర్యవేక్షకులు గుండా మనోహర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సెట్విన్ విజయ్ కుమార్, నిజలింగప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు న్యాయం అందించడమే పోలీస్ వ్యవస్థ ప్రధాన బాధ్యత

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం, జడ్చర్లలోని ఇటీవల నియమితులైన మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ డి.జానకి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఒక్క మహిళా పోలీసు సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి.. వారి బాధ్యతలు, విధులు, ప్రవర్తనా నియమాలు గురించి అవగాహన కల్పించారు. శిక్షణా దశ నుండే ఉత్తమ సేవా ధ్యేయంతో ముందుకు సాగాలని, ప్రజలకు న్యాయం అందించడమే పోలీసు వ్యవస్థ యొక్క ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా సిబ్బంది సమర్థంగా పని చేస్తే వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుంది. మీ కర్తవ్యాన్ని అంకితభావంతో, నిబద్ధతతో నిర్వర్తించాలి. మహిళా బాధితుల సమస్యల పట్ల సమగ్ర దృష్టితో, దయాగుణంతో స్పందించాలి. మీరంతా పోలీసుతు మాత్రమే కాదు. ప్రజల ఆశాభూమికలు కూడా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ కేంద్రం డీఎస్పీ గిరి బాబు, ఇన్స్‌పెక్టర్ రవి కుమార్, ఆర్ఐ రమేష్, ఎస్ఐ, డబ్ల్యూ ఎస్సైలు, మహిళ కానిస్టేబుల్ సిబ్బంది హాజరయ్యారు.

## ప్రజాస్వామ్య రక్షణే 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' లక్ష్యం

### రాహుల్ గాంధీ పిలుపుతో మంత్రి జూపల్లి చైతన్య యాత్ర



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటిష్ వారిని శాంతియుత పోరాట మార్గంలో పోరాడి సాధించిన స్వాతంత్ర దేశానికే మార్గ నిర్దేశం చూపుతూ రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర పాలకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్ సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని గూడెం, బెక్కెం గ్రామాలలో మంగళవారం మంత్రి జూపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ 200 సంవత్సరాలు పరిపాలించిన బ్రిటిష్ వారిని శాంతియుత పోరాట మార్గంలో పోరాడి సాధించిన స్వాతంత్రదేశానికి మార్గ నిర్దేశం చూపుతూ రాజ్యాంగాన్ని రచించిన బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర పాలకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశ పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, అవకాశాలు కల్పిస్తూ ఈ దేశానికి ఒక మార్గ నిర్దేశం చేశారని, అలాంటి అంబేద్కర్‌పై కేంద్ర మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని గుర్తు చేశారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి పరిపాలన చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు అమలుపరుస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని జూపల్లి రాష్ట్ర పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, కొల్లాపూర్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాయకులు కళ్యాణ్ రావు, బీచుపల్లి యాదవ్, చిదంబరెడ్డి, తేజారెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

## జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట మండలం అప్పక్‌పల్లి వద్ద గల మెడికల్ కాలేజీలోకి ఇటీవలే మార్చబడిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డు, ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ వార్డులకు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఐసిటిసి ఫార్మసీ, రిజిస్ట్రేషన్ విభాగాలను చూశారు. రిజిస్ట్రేషన్ వద్ద పేర్లనమోదు రోగులు అధికంగా ఉండడం చూసి రోజుకు ఎంతమంది ఓపి, ఐపి పేషెంట్లు ఉంటున్నారని అక్కడి కంప్యూటర్ ఆపరేటర్ల ను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 1 నుంచి జిల్లా ఆసుపత్రి కొత్త భవనంలోకి మార్చడం జరిగిందని ఆ రోజు నుంచి ఇప్పటివరకు 2 వేలకు పైగా వైద్య సేవలు పొందినట్లు ఆపరేటర్లు కంప్యూటర్ ద్వారా రోజుల సంఖ్య వివరాలను కలెక్టర్‌కు చూపించారు. రోగులు, వారి బంధువులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలను ఏర్పాటు చేయించాలని అక్కడి సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అనంతరం ఎక్స్‌రే, కొత్తగా ప్రారంభించిన సిటీ స్కాన్ విభాగాన్ని ఆమె పరిశీలించారు. వాటితో పాటు ప్రసూతి విభాగం, చిన్న పిల్లల విభాగాన్ని చూశారు. ఇంకా ఏమైనా అవసరమైతే ఇండెంట్ ఇవ్వాలన్నారు. మూడో అంతస్తులో ఉన్న నాలుగు ఆపరేషన్ థియేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. చివరగా ఆసుపత్రి వెనుకభాగంలో ఎంసిహెచ్ మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం కొనసాగుతున్న భూమి చదును పనులను, అవతలి వైపు జరుగుతున్న నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం 18వ మండల మహాసభలు మండల కేంద్రంలోని శివగంగఫంక్షన్‌హాలులో జిల్లా సమితిసభ్యులు శంకర్‌గౌడ్, బాలమురళికృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అర్హులైన అన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు జాబితా వివరాలను గ్రామపంచాయతీ నోటిసు బోర్డుపై జాబితాపెట్టాలన్నారు. వీటితోపాటు రాజీవ్‌యువ వికాసపథకంలో దరఖాస్తు పెట్టుకున్న నిరుపేద యువకులకు సిబిల్‌స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలను మంజూరు చేయాలన్నారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు కేశవులుగౌడ్, సిపిఐజిల్ల కౌన్సిల్‌సభ్యులు బాల మురళికృష్ణ, తెలకపల్లి సిపిఐ మండల కార్యదర్శి రవీందర్, జిల్లారైతు సంఘంప్రధాన కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

## గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి ఇందిర సౌరగిరి జలవికాసం

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిర సౌర గిరిజల వికాసం పథకం అమలుకు జిల్లాలో పకడ్బందీ అమలు కు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో కలిసి ఇందిర సౌర గిరి జల వికాసం పథకంపై సమావేశంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టేదారులను మండల స్థాయి కమిటీ ద్వారా గుర్తించి భూగర్భ జల సర్వేలను నిర్వహించి, బోరు బావులు నిర్మించి, సోలార్ సిస్టం ద్వారా మోటార్స్ వినియోగంలోకి తీసుకు వచ్చి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఆర్టికల్చర్, వ్యవసాయం, సాగులోకి తీసుకు వచ్చి రైతు యొక్క సమగ్ర ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా చేయడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ప్రభుత్వ సూచనలు ప్రకారం సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ట్రైబల్ వెల్ఫేర్, అటవీ శాఖ, గ్రౌండ్ వాటర్, హార్టికల్చర్, అగ్రికల్చర్, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యుత్, రెడ్కో, ఐటీడీఏ, రెవెన్యూ సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతోకలిసి పనిచేసిన పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడి వారి అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి జూన్ 16 తేదీలోగా జిల్లా స్థాయి కమిటీకి సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డి.ఆర్.డిఓ నర్సింహులు, జడ్పీసిఈఓ వెంకట రెడ్డి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్, ఉద్యాన శాఖ అధికారి వేణు గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, మిషన్ భగీరథ ఈఈ పుల్లా రావు, తదితరులు పాల్గొన్నారు.

**15 నుండి 30 వరకు అవగాహన సదస్సులు**

గిరిజనుల వికాసానికి, సామాజిక ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీ.ఎం. ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో గుర్తించిన 25 గిరిజన ఆవాసాలలో ఈ నెల 15 నుండి 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఎం.పిం.డి.ఓలతో జిల్లా కలెక్టర్ పి.ఎం. ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము ద్వారా ప్రకటించబడిన ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ మహా అభిమాన్, దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకములపై అవగాహన కలిగించుటకు లబ్ధిదారులకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేకమైన క్యాంపులలో జన్మన్, ధర్తి ఆబా అభియాన్ కార్యక్రమం కింద ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భరత్ కార్డు, కులం సర్టిఫికెట్లు, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్ ధన్ బ్యాంక్ అకౌంట్ మొదలగునవి జిల్లాలోని ఎంపిక చేయబడిన గిరిజన నివాస గ్రామములలో దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఎం.పి.డి.ఓ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అవగాహన సదస్సులు నిర్వహించి సంబంధిత మండల కమిటీల అధికారుల లబ్ది దారులకు అవగాహన కలిగించాలని, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, కె.సి.సి కార్డ్, జన్ ధన్ అకౌంట్, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించి వారికి మంజూరుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మీ కోసం పని చేస్తున్నా.. అండగా ఉండండి

### లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి



**ప్రజాపక్షం/నారాయణపేట:** నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనే హోదాను పక్కనపెట్టి మీ కోసం ఓ సేవకురాలిగా పనిచేస్తున్నానని, మీరందరు నన్ను ఆశీర్వదిస్తు, నాకు అండగా నిలవాలని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం నారాయణపేట ఆర్డీవో కార్యాలయంలో నారాయణపేట పట్టణం మండలానికి చెందిన సుమారు 200 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వార్డులో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించే బాధ్యత నాదన్నారు. పేద ధనిక తేడా లేకుండా నిరుపేదలకు సైతం సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. వీటితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. గత 10 ఏళ్లలో గత ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేయలేదన్నారు. మన నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో రైతులకు రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉద్దేశంతో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ప్రారంభించడం జరిగిందన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా 3500 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం అయిందని ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జరుగుతున్న అభివృద్ధిని అందరికి తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచంద్రరావు,తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, ఆర్డీవో బోర్డు మెంబర్ పోషల్ రాజేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మనోహర్ గౌడ్, మహేష్, సతీష్ గౌడ్, వెంకు, మహిమూద్, ఖురేషి, యూసఫ్, తాజ్ అనిల్ ఉన్నారు.



## విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** 2025–26 విద్యాసంవత్సరానికి బడిబాట, యూనిఫాంల పంపిణీ, పిల్లల నమోదు పెంచడానికి చర్యలు, పాఠశాలల్లో సివిల్ వర్కులు, శిథిలావస్థకు చేరిన పాఠశాలల గుర్తించి రిపేరు చేయుటకు లేదా వెంబడే తగు చర్యలు చేపట్టడానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఆమె మాట్లాడుతూ... అవసరమైతే గ్రామపంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికుల సహాయం తీసుకోవాలి. వచ్చే ఏడాది కల్లా అన్ని పాఠశాలల్లో వంట కోసం వంట చెరుకు బదులు ఎల్పిజి వాడటానికి తగు ఏర్పాటు చేసుకోవాలి. మాధ్యాహ్న భోజనం బియ్యంలో పురుగులు లేకుండా నాణ్యత గల సరుకులు వాడటానికి తగిన చర్యలు తీసుకోవాలి. 'కడా' పరిధిలోని నాలుగు మండలాలకు 313 కంప్యూటర్లు ఎఫ్ఎల్ఎన్ ఎఎక్స్ఎల్ కార్యక్రమం కోసం వచ్చినట్టుగా కలెక్టర్ తెలియజేశారు. టీచర్ సపోర్టు గ్రూపు, పర్ఫామెన్స్ గ్రూప్, సపోర్టివ్ సూపర్ విజన్, తరగతిగది పరిశీలన, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్, లైబ్రరీ పీరియడ్, నిర్వహించడం అన్ని పాఠశాలల్లో జరగాలి. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో ఈ ఏడాది తెలుగు, ఆంగ్లము, గణితంతో పాటు ఇవిఎస్‌ని కూడా చేర్చినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గ్యాంగ్ వార్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, సీఎంఓసి రాజేంద్ర కుమార్, మిడ్‌డే మీల్స్ సమన్వయకర్త యాదయ్య శెట్టి, ప్లానింగ్ కోఆర్డినేటర్ నాగార్జున రెడ్డి, జిసిడిఓ నర్మదా పాల్గొన్నారు.

## భూసమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తునూ పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని తెలకపల్లి మండలం రాకొండ గ్రామంలో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజల భూసమస్యల దరఖాస్తులను తీసుకొని, వారికి రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

**బడిఈడు పిల్లలందరూ బడికిరావాలి :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుటకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని తెలకపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విద్యాశాఖఅధికారులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని ఇంటింటి ప్రచారాన్ని సైతం నిర్వహించారు. కలెక్టర్ వెంట పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, తెలకపల్లి ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


**రేషన్‌దుకాణం తనిఖీ :**

చౌకధరల దుకాణాల ద్వారా వినియోగదారులకు సకాలంలో సన్నబియ్యాన్ని పారదర్శకంగా అం దించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదప్రజలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని తెలకపల్లి మండలకేంద్రంలోని రాకొండ గ్రామంలోని 15నెంబర్ చౌకధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ డివైస్‌లో కొత్తగా అమల్లోకి వచ్చిన సాఫ్ట్‌వేర్ పనితీరుని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలలో అసంతృప్తి లేకుండా, సరఫరాలలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం నాణ్యత, సరఫరా తీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, లబ్దిదారులకు పారదర్శక విధానంలో, సకాలంలో నాణ్యమైన సన్న బియ్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**జూన్ 30వరకు జిల్లాలో రేషన్ పంపిణీ :**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని రేషన్‌కార్డుదారులు తమ రేషన్ తీసుకునేందుకు గడువు జూన్ 30వరకు పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా రేషన్‌కార్డు లబ్దిదారులకు ప్రజాపంపిణీ సన్నబియ్యం జూన్‌లో మూడు నెలలు ఒకేసారి పంపిణీ చేస్తున్నందున గడువు జూన్ 30వరకు తమకు కేటాయించిన బియ్యంను పొందవచ్చన్నారు.

## మంత్రికి ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జడ్చర్ల:** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌కు చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడం హర్షణీయమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాడు మంత్రి హోదాలో మొదటిసారిగా వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డితో పాటు అభిమానులు, కార్యకర్తలు, కులసంఘాలు, పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంక్షేమ పథకాలు ఇవ్వడంలో ఆయన ముందుంటానని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిపి నిత్యానందం, ఖాజా, కృష్ణయ్య, రాజు, భాస్కర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం, వేర్‌హౌస్‌ను పరిశీలన



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టరేట్‌లో గల ఇవిఎం, వేర్ హౌస్‌ను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం వేర్ హౌస్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సిఈ ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జలకుమారి, డి.టి.సురేష్ బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మూడు రకాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలో మూడు రకాల స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీవో పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సెర్ఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కిశోర బాలికలు, 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కొత్తగా 36 పరస్పర సహకార సంఘాల ఏర్పాటు చేశామని వారికి జిల్లాలో మూడు టీంలు శిక్షణ ఇస్తున్నారని అన్నారు. ఈ ఏడాది బ్యాంక్ లింకేజీ రుణాలు సుమారు రూ.1090కోట్లు, డీఆర్డీవో నుంచి రూ.144కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ.1200 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇచ్చామని వాటిలో 68శాతం వసూలు చేశామని, 32శాతం వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాత రుణాలు చెల్లిస్తే కొత్త రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పరస్పర సహకార సంఘాల నూతన సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రునాలు తీసుకోని సకాలంలో చెల్లించి ఆర్థిక సాధికారత సాధించాలని కోరారు.


## లిక్కర్‌దందాలో నాపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** లిక్కర్ దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లుగా వీడియో చిత్రీకరించి అవినీతి అరోపణలు చేస్తున్న దానిలో ఎలాంటి వాస్తవం లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం ఆయన లిక్కర్ దందాలో యాజమానులు సిండికేటై తనకు డబ్బులను తన ఇంట్లో ఇస్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంపై ఆయన స్పందించారు. తనపై అసత్య అరోపణలు చేస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దళితుడైన తనను ఎమ్మేల్యేగా చూసి ఓర్వలేక కొంతమంది కావాలనే కుట్రలు చేస్తున్నారని అన్నారు. తన ఇంటికి వచ్చి టీ తాగిన వీడియోలు కూడా ఉన్నాయన్నారు తనను బ్లాక్ మెయిల్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. చట్టపరంగా పోలీసులు విచారణ జరిపి అసలు దోషులు ఎవరో తేల్చాలని అన్నారు. నిత్యం ప్రజల కోసం శ్రమిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నానని అన్నారు. ప్రజాధరణ చూసి ఓర్వలేకే ఇలా తనను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. క్యూన్యూస్ ఛానల్ నిర్వాహకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నేతలు కలిసి తనపై కుట్రలు పన్నుతున్నారని అన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసిన చట్ట ప్రకారం ఎదుర్కొంటానని చెప్పారు.

## 'అమ్మ మాట(–)అంగన్‌వాడీ బాట' ర్యాలీ



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పౌష్టికాహార పంపిణీ, పాఠశాల పూర్వ విద్య కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందేందుకు 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ దగ్గర్లోని అంగన్వాడి కేంద్రాలలో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుండి 17 వరకు నిర్వహిస్తున్న అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గొల్లగూడ 3 వ అంగన్వాడి కేంద్రం పరిధిలో చిన్న పిల్లలతో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు, 6 నెలల నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు దగ్గర్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు కావాలని, ప్రభుత్వం వీరికోసం ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నదని, తొలిమెట్టు ఎలా ఉండాలన్న దానిపై ఏం బోధించాలనే దానిపై అంగన్వాడీ కేంద్రాల ద్వారా నేర్పించడం జరుగుతుందన్నారు.జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సిడిపివో హరిత,స్థానిక ప్రజా ప్రతినిధులు సుభాష్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు.


## భూ నిర్వాసితుల అభ్యున్నతే లక్ష్యం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పెద్దగట్టుకు చెందిన 10 మంది లబ్ధిదారులకు రూ. 13లక్షలు, అంబా భవాని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద భూముల కొల్పోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రూ. 32 లక్షలవిలువ గల నష్ట పరిహారం చెక్కులను 30 మంది లబ్దిదారులకు ఎంఎల్‌ఏ బాలునాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న వారి పునరావాసం కొరకు చింతపల్లి గ్రామం వద్ద నిర్మించ తలపెట్టిన ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం సేకరించిన భూములకు ఆయా రైతులకు ప్రభుత్వం నుండి రూ. 84 లక్షల విలువ గల నష్టపరిహారం చెక్కులను 9 మంది లబ్దిదారులకు ఎంఎల్‌ఏ అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పెద్దగట్టు, అంభాభవాని, నక్కలగండి ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రగతి దిశగా ముందడుగు వేయిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ భద్రు, ఈఈ నెహ్రు, రాములునాయక్, యాదన్‌కుమార్, సత్యనారాయణ, ఎస్‌డిసి యూనిట్1 నీల, డిఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డీవో రమణారెడ్డి, ఎఫ్‌డివో సంగీత, డిఈలు, ఏఈలు, ఫారెస్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## భూభారతితో భూసమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/కోదాడ(నడిగూడెం):** భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకి పరిష్కారం లభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 20వ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రత్నవరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో 113 దరఖాస్తులు వచ్చాయని, త్రిపురవరం గ్రామంలో 152 దరఖాస్తులు సమర్పించారని అదనపు కలెక్టర్ తెలిపారు. రత్నవరం గ్రామంలోని రేషన్ దుకాణంను సందర్శించి ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ అదేశాల ప్రకారం సన్నబియ్యం మూడు నెలలకి సరిపడేవి ఒకేసారి పంపిణీ చేయాలని రేషన్ డీలర్‌ను అదేశించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ సరిత, హిమబిందు, సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి, ఆర్‌ఐ రాంబాబు, కార్యదర్శి శ్రీను, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, రేషన్ డీలర్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ప్రజా పాలనలోనే ఇందిరమ్మ కళ సాకారం

### ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/గుండాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలోనే ఇందిరమ్మ కళ సాకారం అయిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై లబ్ధిదారులకు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి పేదకు సంక్షేమ, అభివృద్ధి ఫలా లు దక్కుతాయని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్‌లు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సిసి రోడ్లు వేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని, లింక్‌రోడ్లను పూర్తిచేయాలని, ఆయా గ్రామాల నుండి మండల కేంద్రానికి రోడ్లను పూర్తి చేయాలని అన్నారు. మండలానికి గురుకుల పాఠశాలను కేటాయించాలని ఎంఎల్‌ఏను అడగగా మండలానికి గురుకుల పాఠశాల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా చెరువులు నింపుతామని, గందమల్ల రిజర్వాయర్‌నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కృష్ణా రెడ్డి, బిక్షం, వేణుగోపాల్‌యాదవ్, విమల వెంకటేశ్వర్లు, కుమార్, స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను,కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణము అధికార సూచన ప్రకారం నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, మండల ప్రత్యేక అధికారి రాజారాం, తహసిల్దార్ లావణ్య,డిప్యూటీ తహసీల్దార్ సఫీ, ఆర్‌ఐ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

## నెల రోజులు గడవకముందే ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్...

### బడికి వెళ్లకుండా జీతాలు...మండల ఉపాధ్యాయుల బాగోతం....ఎఇఒ చందర్‌నాయక్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలం ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటూ తల్లిదండ్రులు కూలీ పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లల భవిష్యత్తు ఆలోచన చేస్తూ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. కానీ చందంపేట మండలంలో ఉపాధ్యాయురాలు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు చదువు చెప్పకుండా జీతాలు తీసుకుంటున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏప్రిల్ 22న విచారణ జరిపి వాస్తవాన్ని జిల్లా అధికారులు సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఏడాదిగా పాఠశాలకు వెళ్లకుండా జీతాలు తీసుకుంటుందని, ఆమె జీతంలో హెడ్మాస్టర్ మరియు మండల ఎంఈవో కొంత వాటా తీసుకుంటూ ఆమెకు సహకరించారన్న విషయం బయటకు రావడంతో ఉన్నతాధికారులు మండల ఎంఈవో చందర్‌నాయక్‌ను సస్పెండ్ చేశారు. గత నెలలో విద్యాశాఖ అధికారులు ఇద్దరు హెడ్మాస్టర్లను సస్పెండ్ చేసిన విషయం మరవక ముందు మరళ మండల ఎంఈవోను విద్యాధికారులు సస్పెండ్ చేయడం చర్చనీయాంశం అయ్యింది. మండలంలో ఎన్ని గ్రామాలలో ఇలా వాటాల దందా జరుగుతుందో జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామాలలో బడిబాట కార్యక్రమం నేపథ్యంలో ప్రభుత్వం ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ ంనుండి జీతాలు తీసుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహిస్తూ విద్యార్థులు భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇలాంటి చర్యలు మరళ పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

### కుదాబాక్షిపల్లి గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** సీలింగ్ భూములకు పట్టాలి ఇవ్వాలని కుదాబాక్షిపల్లి గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అంద.జేశారు. రెవిన్యూ సదస్సులు జరుగుతున్న సందర్భంగా మంగళవారం సదస్సుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా హాజరై మాట్లాడుతూ ఎవరైనా పెద్ద రైతులు వారి భూములలో కట్టడాలు, వ్యవసాయానికి యోగ్యం కాని భూమి ఉన్నట్లయితే వాటిని రైతులే స్వచ్ఛందంగా నాలా చేసుకోవాలని లేనిచో వారికి భారీగా ఫైన్ వేస్తామని అన్నారు. రేపటినుండి గ్రామ సభలు మండలములో ముగిసిన రానివారు తహసిల్దార్ కార్యాలయములో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా సాదా బైనామా కోర్టు పరిధిలో ఉన్నందున పరిష్కరించలేమన్నారు. రైతులతో వివిధ సమస్యలపై చర్చించారు. దీనిలో భాగంగా రైతులు అభ్యర్థిస్తూ ముఖ్యంగా గ్రామములో గతంలో ఇచ్చిన సీలింగ్ భూములకు నూతన పాస్ పుస్తకములు ఇవ్వాలని రైతులు కోరినారు. కేబి పల్లిలో, మేటిచ్చిందాపురంలో రైతులు ఇచ్చిన దరఖాస్తులను తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పాండురంగారెడ్డి, జహీరుద్దీన్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

**ప్రభుత్వ ప్రభుత్వ హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ**

మర్రిగూడలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి ఆకస్మిక తనిఖీ చేసి వైద్యులకు సూచనలు ఇచ్చారు. ఆసుపత్రిలో డెలివరీ కేసులను ఇంప్రూవ్ చేయాలని, ఆసుపత్రిలో ఉన్న ఎక్సేరే మిషన్ను త్వరలోనే బాగు చేయిస్తానని అన్నారు. సూపర్‌డేటెంట్ డాక్టర్ కే శంకర్ నాయక్, డాక్టర్ అరుణతార ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు అందించాలని వినతి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో హరిజనవాడ దొమ్మరి బజారులో ఉంటున్న అన్నపూరి జయమ్మ అనే పేద మహిళకు ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో తన పేరు రానందున బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన జయమ్మ భర్త చనిపోవడంతో తన భర్త చనిపోవడంతో తన పిల్లలను పోషించకోవడానికి పాత సామాన్లు సేకరించుకుంటూ, కూలీ పనులకు వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కావాలని జయమ్మ ఆరు గ్యారెంటీల్లో భాగంగా దరఖాస్తు చేసుకోగా ఆమె రిసీప్ట్ ఇచ్చారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జయమ్మకు ఇందిరమ్మ ఇల్లు అందించి ఆదుకోవాలని కోరారు.

## 12న భూదాన్ పోచంపల్లికి గవర్నర్ రాక

### ఏర్పాట్లను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఈనెల 12న భూదాన్ పోచంపల్లి పర్యటన సందర్భంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పోచంపల్లి టూరిజం పార్క్‌ను పరిశీలించారు. గవర్నర్తో 50 మంది చేనేత కార్మికులు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చేనేత పరిశ్రమకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు మెరుగుపడుతున్న జీవన పరిస్థితులు స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. ముఖాముఖి కార్యక్రమం అనంతరం గవర్నర్ రెండు లేదా మూడు చేనేత మగ్గాలు నేస్తున్న కుటుంబాలను సందర్శించి క్షేత్రస్థాయిలో చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కు ఘన స్వాగతం పలికేలా అధికారులు అందరూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కొంతమంది చేనేత ముఖ్య నాయకులతో కలిసి ఆయన గవర్నర్ తో ముఖాముఖిలో పాల్గొనే చేనేత కార్మికుల, సందర్శించే మగ్గాల కుటుంబాలను వివరాలను అధికారులకు అందజేయాలని కోరారు.టూరిజం పార్కులోని అన్ని విభాగాలను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసే ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. అధికారిక పర్యటన వివరాలు వెల్లడించాల్సి ఉంది.పోచంపల్లి తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్ చేనేత కార్మిక సంఘ ముఖ్య నాయకులు ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు. కాగా దంతూరు గౌస్కొండ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి పాల్గొని భూ యజమానుల నుంచి భూసమస్యల పరిష్కారం చేయాలని దరఖాస్తులను స్వీకరించారు.

# సాధారణ ప్రసవాలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎస్):** ఆత్మకూర్(ఎస్) మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, భూభారతి రెవిన్యూ సదస్సును సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మంగళవారం అకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపి రిజిస్టర్, ఏఎన్‌సి రిజిస్టర్ లను పరిశీలించారు. ఈడిడి రిపోర్టు పరిశీలించి వారంలో జరిగే ప్రసవాల వివరాలను ఎఎన్‌ఎం సంధ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాలకు దగ్గరలో ఉన్న పెషెంట్లను వారి డెలివరీ ప్లానింగ్ వివరాలను ఎఎన్‌ఎంల దగ్గర ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఆసుపత్రి నందు మందుల స్టాక్ బాక్సులు అడ్డదిడ్డంగా పెట్టడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వీటిని స్టోర్ రూంకు మార్చాలని డాక్టర్ మౌనికకు అదేశించారు. సాధారణ ప్రసవాలు చేపట్టాలని, అలాగే సిబ్బంది సమయపాలన పాటించాలని అదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మండలంలోని రైతు వేదికలో జరుగుతున్న భూ భారతి రెవిన్యూ సదస్సును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన రెవిన్యూ చట్టంలో భాగంగా గ్రామ స్థాయిలో రెవిన్యూ సంబంధించిన ఈ భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 20వ వరకు కొనసాగే రెవెన్యూ సదస్సులో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రోజు జరిగిన రెవిన్యూ సదస్సులో 261 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు అందజేసిన రైతు టీ పద్మ తన కుమారుడికి కలెక్టర్ స్వయంగా చేతుల మీదుగా అందజేశారు. రెవిన్యూ సదస్సుకు వచ్చిన తంగేళ్ల వెంకటరెడ్డి, అబ్బగాని బిక్షంతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను విన్నారు. ఈ కార్యక్రమంలో తహసిలార్ అమీన్‌సింగ్, ఆర్‌ఐ ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్లు అజయ్, సుధాకర్, ఎంపి ఎస్ శంకర్ పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంలో సత్వర చర్యలు

### రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీలపై దాడుల నివారణకు ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, భూ సమస్యలు ఎస్సీ, ఎస్టీ లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అణిచివేత, అసమానత్వం, అట్రాసిటీ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కమిషనర్ నిరంతరం పనిచేస్తోందని చైర్మన్ వెల్లడించారు. జిల్లాలో పెండింగ్‌గా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగు కేసులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలలో రెండు గ్లాస్‌ల పద్ధతి, కుల వివక్ష ఉన్నందున విచారం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు నివారణకు ప్రతి నెల చివర శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. అందుకు ఎస్‌ఐలు, తాహసీల్దార్లు సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రత్యేకంగా రాయపురం గ్రామంలో వివక్ష ఎక్కువగా ఉన్నందున ఆర్డీఓ, డీఎస్పీలు చొరవ చూపే గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా వారికే కేటాయించాలని నిధులు పక్కదారి పడకుండా చూడాలని తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ డివిఎంసీ వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం నష్టపరిహారం చెల్లింపులు, రెసిడెన్సియల్ పాఠశాలల వివరాలు వంటి జిల్లా ప్రొఫైల్‌ను కలెక్టర్ వివరించారు. జిల్లాలోని రెసిడెన్సియల్ పాటశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు 85 శాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కులాంతర వివాహాల క్రింద మొత్తం 59 దరఖాస్తులు అందగా, 6 జంటలకు రూ.15 లక్షల ప్రోత్సాహకాన్ని అందించామని తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే మిగతా వారికి ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, కోటా ప్రకారం మంజూరు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ సెప్టెంబరు 2023 నుండి ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 62 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా వాటిలో 19 కేసులు విచారణతో ఉన్నాయని, మిగతా కేసులకు చార్జ్‌షీట్ వేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో ఒకటిలో నిందితులకు శిక్ష విధించబడినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో 32 కేసులకు సంబంధించి రూ.38.75 లక్షల నష్టపరిహారం బాధితులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వివిధ సమస్యలపై బాధితుల సమస్యల పరిష్కారం పై వినతిపత్రాలను సేకరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ్ రావు, కమిటీసభ్యులు కొంకటి లక్ష్మీ నారాయణ, నీలాదేవి, రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఆర్డిఓ అలివేలు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రమేష్ బాబు, డిఎస్పీ మొగులయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మోదీకి ఉగ్రవాదులకు తేడా ఏమీలేదు

**సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మోడీకి ఉగ్రవాదులకు తేడా ఏమీ లేదని ఇద్దరు కూడా మత ఘర్షణలను సృష్టించేవారేనని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మ ఫంక్షన్‌హాల్లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలు,అఖిల భారత మహాసభలపై తమ్మినేని వీరభద్రం పాఠం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడి జరుగుతుందని ఇంటిలిజెన్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ముందే తెలుసన్నారు. దాడి జరుగుతుందని తెలవడం వలనే నరేంద్ర మోడీ పర్యటనను రద్దు చేసుకోవడం జరిగిందన్నారు. దాడి జరుగుతుంని తెలిసి కూడా పర్యాటకులను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పాకిస్తాన్‌తో జరిగిన దాడులలో జరిగిన నష్టాన్ని ప్రజలకు తెలియజేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి,నెమ్మాది వెంకటేశ్వర్లు, పోలిశెట్టి యాదగిరి,నాగారపు పాండు,ములకలపల్లి రాములు,కోట గోపి పాల్గొన్నారు.

# క్రీడ



## నేడు డబ్ల్యుటిసి ఫైనల్..

### ఆసీస్, సఫారీల 11 మంది సైన్యమిదే!

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సమయం దగ్గరపడింది. నేడు లార్డ్స్ మైదానంలో మెగా ఫైట్ షురూ కానుండగా.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు టెస్టు గద కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ బిగ్ ఫైట్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలవాలని సఫారీలు అనుకుంటుండగా.. ఐసీసీ ఫైనల్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటేందుకు ఆసీస్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరుజట్లు ఫైనల్లో ఆడబోయే 11 మంది పేర్లను ప్రకటించాయి.

లార్డ్స్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు నేడు (జూన్ 11 బుధవారం)తో తెరలేవనుంది.

సీజన్ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు అర్హత సాధించిన ఆస్ట్రేలియా, దక్షిణాలు టైటిల్ కోసం నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి.

ఇక.. ఐసిసి ఈవెంట్లలో చోకర్స్‌గా ముద్ర పడిన సఫారీలు ఈసారి టెస్టు గదను వదలొద్దనే కసితో ఉన్నారు. అందుకే.. బలమైన తుదిజట్టును ఎంపిక చేశారు కోచ్, కెప్టెన్.

ఐపీఎల్ 18వ సీజన్‌లో చెలరేగి ఆడిన మర్క్‌రమ్, రికెల్టన్, స్టబ్స్‌లతో పాటు వెర్రినే, బెడింగ్‌హమ్‌లు బ్యాటింగ్ భారం మోయనున్నారు. బౌలింగ్ యూనిట్ విషయానికొస్తే.. కగిసో రబడ, యాన్సెన్, కేశవ్ మహారాజ్‌తో పాటు సీనియర్ బౌలర్ అయిన లుంగి ఎంగిడి మూడో పేసర్‌గా జట్టులోకి వచ్చాడు.

**దక్షిణాఫ్రికా తుది జట్టు :**

ఎడెన్ మర్క్‌రమ్, రియాన్ రికెల్టన్, వియాన్ మల్డర్, తెంబా బవుమా(కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బెడింగ్‌హమ్, కైలీ వెర్రినే(వికెట్ కీపర్), మార్కో యాన్సెన్, కేశవ్ మహారాజ్, కగిసో రబడ, లుంగి ఎంగిడి.

**సగానికి పైగా వాళ్లే**

వరుసగా రెండోసారి ఫైనల్ చేరుకున్న ఆస్ట్రేలియా మరోసారి విజయంపై కన్నేసింది. నిరుడు ఛాంపియన్‌గా నిలిచిన జట్టులోని సగానికి పైగా ఆటగాళ్లు ఈసారి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. ఖవాజా, లబూషేన్, పేసర్ మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్ లియాన్, హెడ్ కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలు మరోసారి దేశానికి టెస్టు గదను అందించాలనే కసితో ఉన్నారు.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆడుతున్న ఆసీస్‌కు కమిన్స్ అతిపెద్ద బలం కానున్నాడు. తనదైన వ్యూహాలతో ప్రత్యర్థిని చిత్తుచేయగల సత్తా ప్యాట్ సొంతం. ఉస్మాన్ ఖవాజా, లబూషేన్, చిచ్చరపిడుగు ట్రావిస్ హెడ్ స్మిత్, కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీలతో కంగారూల బ్యాటింగ్ యూనిట్ దుర్భేద్యంగా ఉంది. ఐపిఎల్‌లో అద్భుతంగా రాణించిన హేజిల్‌వుడ్. తమకు లక్కీ హ్యాండ్ అవుతాడని కమిన్స్ బృందం భావిస్తోంది.

**ఆస్ట్రేలియా తుది జట్టు :**

ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్ బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ క్యారీ(వికెట్ కీపర్), ప్యాట్ కమిన్స్(కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, జోష్ హేజిల్‌వుడ్.

షూటింగ్ వరల్డ్ కప్..

## కాంస్యంతో మెరిసిన వలరివన్!



భారత యువ షూటర్ ఎలవేనిల్ వలరివన్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో కాంస్యం కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పిస్టల్ ఫైనల్లో పసిడిపై గురి పెట్టిన తను చివరకు కంచుమోత మోగించింది. జర్మనీలోని మ్యూనిచ్ వేదికగా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అదరగొట్టిన 25 ఏళ్ల ఈ యువకెరటం స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. తమిళనాడుకు చెందిన ఎలవేనిల్ వలరివన్ 2018 వరల్డ్ కప్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచింది. అయితే.. మ్యూనిచ్ ఆతిథ్యం ఇస్తున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో మాత్రం అంచనాలకు మించి రాణిస్తోంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో సత్తా చాటిన తను ఫైనల్లో తొలి షాట్‌లోనే 10.7 పాయింట్లు సాధించింది. ఆ తర్వాత 10.8 పాయింట్లు రాబట్టింది. దాంతో, రజతం వస్తుందని ఆశించింది. కానీ, కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**0.3 పాయింట్ల తేడాతో..**

అయితే.. రెండుసార్లు ఒలింపిక్స్‌లో పోటీ పడిన వలరివన్ .. కొరియా షూటర్ క్వాన్ యుంజీ కంటే 0.3 పాయింట్లు మాత్రమే వెనకబడింది. లేదంటే ఆమె ఖాతాలో సిల్వర్ మెడల్ చేరేది. ఫైనల్లో చైనీస్ షూటర్ వాంగ్ జీఫీ పసిడి పతకం గెలుపొందగా.. క్వాన్‌ను రజతం వరించింది. అయితే.. 231.2 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

# ఫోకస్ మహిళ

మహిళలపై జీవిత భాగస్వామి నుంచే లైంగిక హింసకు తెరపడుతుందనిగానీ అనుకోవడానికి వీల్లేదు. వైవాహిక అత్యాచారం అనే అంశం వ్యక్తిగత స్వేచ్ఛ, నైతికత, మానవ హక్కులు, న్యాయ వ్యవస్థ లాంటి అనేక విషయాలను చర్చకు తెస్తుంది. ఇది ఎంతో సున్నితమైన, కానీ కీలకమైన సామాజిక సమస్య.







### వ్యక్తిగత స్వేచ్ఛను హరించే

## వైవాహిక అత్యాచారం

ఇటీవల కాలంలో విస్తృతంగా చర్చకు వస్తున్న అంశం 'వైవాహిక అత్యాచారం'. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ అకృత్యంపై మహిళలు గళం విప్పడం హర్షణీయ పరిణామం. ఒక్కసారిగా సమాజం మారిపోతుందని గానీ, మహిళలపై జీవిత భాగస్వామి నుంచే లైంగిక హింసకు తెరపడుతుందనిగానీ అనుకోవడానికి వీల్లేదు. అయితే, సమస్యపట్ల ఆలోచన మొదలైతే, అది కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమవుతుంది. వైవాహిక అత్యాచారం అనే అంశం వ్యక్తిగత స్వేచ్ఛ, నైతికత, మానవ హక్కులు, న్యాయ వ్యవస్థ లాంటి అనేక విషయాలను చర్చకు తెస్తుంది. ఇది ఎంతో సున్నితమైన, కానీ కీలకమైన సామాజిక సమస్య. దీనిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ అంశాన్ని పలు కోణాల్లో విశ్లేషించుకోవాలి. ఇక్కడ వైవాహిక అత్యాచారం అంటే ఏమిటి? అనే ప్రశ్న తొలుత వినిపిస్తుంది. వైవాహిక అత్యాచారం అంటే, ఒక జీవిత భాగస్వామి మరొక జీవిత భాగస్వామిపై వారి అనుమతి లేకుండా లైంగిక సంబంధాన్ని బలవంతంగా పెట్టడం. ఇది మానవ హక్కుల ఉల్లంఘన మాత్రమే కాకుండా శారీరక, మానసిక, భావోద్వేగ హింస. కానీ, ఈ దుర్మార్గమైన పోకడలను భారత చట్టాలు ఖండించడం లేదు. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 375 ప్రకారం వివాహితుల మధ్య లైంగిక సంబంధం అత్యాచారంగా పరిగణించబడదు. అంటే భార్యపై భర్త చేసిన లైంగిక అత్యాచారం చట్టబద్ధంగా అత్యాచారం కాదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం ఇది నేరమవుతుంది. సెక్షన్ 375 రెండో క్లాజ్ ప్రకారం, భార్య లేక భర్త మైనర్ అయినప్పుడు మాత్రమే, వారి మధ్య లైంగిక సంబంధం నేరమవుతుంది. అయితే, ఈ సెక్షన్ తీవ్రమైన విమర్శలకు లోనవుతున్నది. లైంగిక సంబంధానికి భార్య అనుమతి అవసరం లేదన్న వైఖరిని విమర్శలు ఉన్నాయి. స్త్రీ అనుమతిని అసహజంగా పక్కకుపెట్టిన విధానాన్ని చాలా మంది తప్పుపడుతున్నారు. మానవ హక్కుల దృష్టిలో భార్య అనుమతి లేకుండా భర్త లైంగిక కార్యకలాపానికి ఒడిగట్టడం నేరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థలు వైవాహిక అత్యాచారాన్ని లైంగిక హింసగా పరిగణిస్తున్నాయి. వివాహమంటే ఒప్పందం మాత్రమేతప్ప, స్వీకార హక్కు తీసివేసే అనుమతి కాదని స్పష్టం చేస్తున్నాయి. అందుకే, సహజమైన సంబంధాల్లో కూడా సంపూర్ణ అనుమతి అవసరం అని నేడు న్యాయవ్యవస్థలు చెప్పడం ప్రారంభించాయి. తరతరాలుగా జరుగుతున్న వైవాహిక అత్యాచారం సామాజికంగా, మానసికంగా మహిళలను దారుణ పరిస్థితుల్లోకి నెడుతున్నాయి. బాధితురాలు తన స్వంత భర్త చేతినుండి లైంగికంగా హింసకు గురికావడం, ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, మానసిక శాంతిని నాశనం చేస్తుంది. ఇది ఒక నిరంతర వేదన, దానిని బయటకు చెప్పడానికి ఆమెకు భయము, సంకోచము, తిట్లు, అవమానాల భయం ఉంటుంది. బాధితురాలి ఆరోగ్యం, సంబంధాలు, పిల్లలపై ప్రభావం కలుగుతుంది. భార్యను సొంత ఆస్తిగా, ఒక వస్తువుగా చూడడం దుర్మార్గం. సమాజంలో మహిళలకు ఎలాంటి హక్కులు లేని పరిస్థితికి నిలువుటద్దమైన వైవాహిక అత్యాచారానికి ఎంత త్వరగా తెరపడితే అంత మంచిది. ఈ విషయంలో చట్టాల్లో మార్పులు ఎంతైనా అవసరం.



## మావోయిస్టులతో శాంతిచర్చలు జరపండి





**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ డిమాండ్**

**మంచిర్యాలలో 21,22 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు**

**ప్రజాపక్షం/మంచిర్యాల :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)జిల్లా మహాసభలు ఈనెల 21,22 తేదీలలో మంచిర్యాలలో ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. మంగళవారం సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టే కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలవేన శంకర్ మాట్లాడుతూ 21న ప్రదర్శన, బహిరంగ సభ, 22న ప్రతినిధుల సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాలు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని, మావోయిస్టులు లేకుండా చేస్తే అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను దోచుకుని కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేయవచ్చనే కుట్రను బిజెపి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలకు జరిపించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరేవారిని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల ఏరివేత వెనుక ఆదివాసి ప్రాంతాల్లోని సహజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. మావోయిస్టులను పట్టుకుని కాల్చి చంపే విధానాన్ని తక్షణమే మానుకొని శాంతి చర్చలు నిర్వహించాలని కేంద్రప్రభుత్వానికి సిపిఐ మొదట నుంచి విజ్ఞప్తి చేస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తి అవుతున్నందున ప్రజల ఆశలు, ఆకాంక్షలను నీరుగార్చకుండా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కమ్యూనిస్టులు గా కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, రేగుంట చంద్రశేఖర్, కె.వీరభద్రయ్య, బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, కలిందర్ అలీ ఖాన్, లింగం రవి, కాకూరి నగేష్, మిట్టపల్లి శ్రీనివాస్, ముస్కే సమ్మయ్య, రేగుంట చంద్రకళ, మిట్టపల్లి పోలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండ ఎర్ర జెండానే

**నూరేళ్ల ఉత్సాహంతో పోరాటాలు**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు**

**ప్రజాపక్షం/భద్రాచలం/చర్ల :** నాటి నుండి నేటి వరకు ఎర్రజెండానే పేదలకు అండగా ఉందని, ఉంటుందని, నూరేళ్ల ఉత్సాహంతో మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. చర్ల మండల సిపిఐ 20వ మహాసభ సంతపాకల ప్రాంగణంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పార్టీ అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు నూపా తిరుపతిరావు ఎగరవేయగా, మహాసభ అమరులకు నివాళ్లర్పించింది. అనంతరం భాగం మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా వందేళ్లుగా అలుపెరగని పోరాటాలు సాగిస్తుందన్నారు. అటవీహక్కుల చట్టం, ఉపాధిహామీ చట్టం కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే వచ్చాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాలు అడవుల్లోని విలువైన ఖనిజ సంపదను కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేయవచ్చనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలకు జరిపించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వలస ఆదివాసీ పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ఏజెన్సీలో తాగుసాగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సభలో నూపా పోతయ్య, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, నానిపల్లి భద్రం, కణితి మంగమ్మ, ఉప్పులూరి నాగరాజు, గుంజి మాల్యాద్రి, పొడియం ఆదిలక్ష్మి, కాకర్ల అనసూయ, కోడిరెక్కల రాజారావు, ఆంద్రు వామనరావు, చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావు, ఉప్పులూరి వెంకట నర్సమ్మ, కల్లూరి సీతారాములు, కట్టం నాగేశ్వరరావు, కట్టం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాసమస్యలపై పోరాటాలు

**సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజాసమస్యలపై కమ్యూనిస్టులు అలుపెరగని పోరాటాలు చేస్తున్నారని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో జరిగే సిపిఐ నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. ఈ మహాసభల్లో గత మూడు సంవత్సరాలలో జరిగిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తులో ప్రజాసమస్యలపై కలసివచ్చే శక్తులతో, లౌకిక వాదులతో కలిసి పని చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్రంలోని బిజెపి ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో లక్ష ఎకరాల ప్రభుత్వ భూమి పేదలకు పంచాలని భూ పోరాటాలను నిర్మాణాత్మకంగా బలమైన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకోబోతున్నామన్నారు. వంద సంవత్సరాలుగా అలసిపోకుండా అనేక అడ్డంకులను దాటుకొని అనేక సవాళ్లను ఎదుర్కొని దేశంలో నిరుపేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లాలో 35 వేలకు పైగా భూమిలేని నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు సాధించడమే లక్ష్యంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, కడారి రాములు, సిపిఐ జిల్లా నాయకులు రాజశేఖర్, అజ్జ వేణు, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు



**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్**

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి అధ్యక్షతన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా విద్యార్థి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు. ఈనెల 12 నుండి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో జలగల్లాక పీడిస్తున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో బుక్స్, స్కూల్ డ్రెస్, పేరుతో డబ్బులు దండుకుంటున్నా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిఓ నెం. 42, 91 ప్రకారం ఫీజులు పెంచాలంటే జిల్లా కలెక్టర్‌తో అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు పేరెంట్స్ అభిప్రాయాలు తీసుకుని కమిటీ ద్వారా నిర్ణయించి ఫీజులు పెంచాలన్నారు. విద్యాశాఖ అధికారులు ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజులు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ ఫీజులు పెంచటం నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోతే మాత్రం రాబోయే కాలంలో రాష్ట్ర, జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రాజేశ్వర్, గణేష్, కుషాల్, సంతోష్, రమేష్, మోతి, దినేష్, చరణ్ పాల్గొన్నారు.

## వడ్ల బోనస్ కాజేసిన వారిపై చర్యలు

**సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్**

**ప్రజాపక్షం/కోటగిరి :** కోటగిరి సొసైటీలో వడ్ల బోనస్‌పై అధికారులు విచారణ జరిపి, ఖజానా కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగిరి మండలకేంద్రంలో మంగళవారం సిపిఐ మండల మహాసభ నల్ల గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కోటగిరి సొసైటీలో గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారి పేర్లు అధికారులు బహిర్గతం చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏడాది దాటుతున్న ప్రభుత్వ ధనం కాజేసిన వారిపై చర్యలు తీసుకోకుండా చేస్తున్న ఆలస్యం కావడంతో అధికారులు తీరుపై అనుమానాలు సైతం వ్యక్తం చేయాల్సి వస్తుందని వారు ఆరోపించారు. ప్రజల ఎజెండా కోసం జీవితాలు త్యాగం చేస్తున్న మావోయిస్టులు చర్చలకు సిద్ధమని తెలిపిన ఆపరేషన్ కగార్ పేరుతో చంపడం అన్యాయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపద అ ప్పనంగా అప్పచెప్పడానికి అడవులను ఖాళీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దత్తత గ్రా మమైన కోటగిరిలో నూతన బస్టాండ్‌ను నిర్మించి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని సుధాకర్ కోరారు. ఈసందర్భంగా మహాసభలో సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా అంబాటి విఠల్‌గౌడ్, సభ్యులుగా నల్ల గంగాధర్, రాజు, బర్ల సునీల్ కుమార్, బుడాల రాములు, మల్లేష్‌గౌడ్, వెంకటేష్, గోపాల్‌రావులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఫర్టిలైజర్స్ దుకాణాలలో తనిఖీలు



**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ పట్టణంలోని పలు ఫర్టీలైజర్స్ దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారు లు తనిఖీలు చేపట్టినట్లు వ్యవసాయశాఖ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడు తు ఫర్టీలైజర్స్ దుకాణంలో నకిలి విత్తనాలు అమ్మినా, బిల్లు లు లేకుండా ఎరువులు విక్రయించిన చర్యలు తీసు కుం టామని హెచ్చరించారు. పట్టణం లోని ప్రదానమైన ఓంట్రెడింగ్, వైష్ణవి, రాఘవేంద్ర ఫర్టీలైజర్స్, పెస్టీ సైడ్స్ దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. వీరితో పాటు అగ్రికల్చర్ ఎఒ తులసి, ఎస్ఐ సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బంది కృష్ణ, రాములులు పాల్గోన్నారు.

## బడిబాట కార్యక్రమంలో తహసీల్దార్

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మంగళవారం జరిగిన బడిబాట కార్యక్రమాన్ని ఉద్దేశించి బుచ్చయ్య మాట్లాడుతూ సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఉచిత నోటుబుక్కులు పుస్తకాలు, యూనిఫామ్ మధ్యాహ్న భోజనం, అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్య కూడా కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మంచి మంచి చదువులు చదివి అనేక రకమైన పోటీ పరీక్షలు ఎదుర్కొని బోధించడానికి వచ్చిన వారిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవలం ప్రచారం మాత్రమే కాకుండా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తూ ఫలితాలను కూడా రాబట్టాలని ఉపాధ్యాయులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై పట్టింపులేని విద్యుత్ అధికారులు



**ప్రజాపక్షం/దుండిగల్ :** విద్యుత్ వైర్లు తగిలి రైతుల ప్రమాదానికి గురవుతున్నారని దుండిగల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ముప్పై ఏండ్ల క్రితం వేసి విద్యుత్ లైన్లు స్తంబాలు పడిపోయే దుస్థితిలో ఉన్నాయని పొలాల్లో విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేసి సమస్యకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు, రైతులతో పాటు ఆఫీస్‌కు పలుమార్లు వెళితే ఎఇ అందుబాటులో లేడనీ ఫోన్ చేసిన స్పందన కరువైందని ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్ అధికారుల పనితీరు ఉందన్నారు. ఇండ్లలో బిల్లులు కట్టకపోతే చర్యలు చేపట్టే అధికారులు రైతులకు సమస్యలు వస్తే పట్టించుకోవడంలేదని రైతుల పొలంలో ట్రాన్స్ ఫార్మ ర్, దానికి కంచె గాని, లూస్ పోల్స్ గాని లూస్ వైరింగ్ గాని, పట్టించుకోవడంలేదని వెంటనే స్పందించి విద్యుత్ అధికారులు సమస్య పరిష్కరించాలని బిజెపి తరపున డిమాండ్ చేస్తున్నమని లేకుంటే త్వరలో రైతులతో కలిసి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** సమయ పాలన చేస్తూ బస్తీ దవఖానాలకు వచ్చే రోగులకు అవసరమైన, మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమాగౌరి సూచించారు. మంగళవారం హబ్సిగూడలోని బస్తీ దవఖానాను సందర్శించి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి మందుల పంపిణీ, వ్యాధి నిర్ధారణ పరీక్షల తీరును పరిశీలించారు. బిపి, డయాబెటిస్ లాంటి దీర్ఘకాల వ్యాధులకు ప్రభుత్వం ఇస్తున్న నెలసరి మందులను ఏ విధంగా అందచేస్తున్నారని అడిగి తెల్సుకొన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. దోమల వల్ల వ్యాపించే జ్వరాల నివారణకు జిహెచ్ఎంసి అధికారులతో సమన్వయంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ఒఆర్ఆర్‌పై కెమికల్ ట్యాంకర్ బోల్తా

క్రేన్ సహాయంతో తీస్తుండగా చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట ఓఆర్ఆర్‌పై నుంచి కెమికల్ ట్యాంకర్ బోల్తాపడగా మంటలు చెలరేగిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబై నుంచి శంబాపేటలోని ఆల్మెలో కంపెనికి కెమికల్స్ సరఫరా చేస్తున్నారు. డ్రైవర్ మహ్మద్ ఫయాజ్ మద్యం సేవించి శామీర్‌పేట నుంచి కీసర వైపు వెళ్తుండగా ఓఆర్ఆర్‌పై నుంచి కెమికల్ ట్యాంకర్ సోమవారం కిందపడిపోయింది. మంగళవారం ఉదయం ట్యాంకర్ యజమాని బిలాల్ ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కెమికల్ ట్యాంకర్‌ను తీయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో చుట్టుపక్కల ఉన్న చెట్లు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఏలాంటి ప్రాణనష్టం జరుగలేదని ఆస్థి నష్టం సుమారు రూ. 80 లక్షలు జరిగిందని బాదితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మౌలాలీ హెచ్‌బి కాలనీలో భారీ చోరీ



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మౌలాలీ హెచ్‌బి కాలనీలో ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. సిఐ తెలిపిన వివరాల ప్రకారం హెచ్‌బి కాలనీ ఏపిఐఐసి కాలనీలో నివాసముండే పి రవీందర్(55) ఈ నెల 5వ తేదీన తిరుపతి,అరుణాచలం,పాండుచ్చేరి,కాణిపాకం యాత్రలకు వెళ్లి 10వ తేదీన రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు తాళం పగిలి ఉండడం గమనించిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా విరిగిపోయి, బట్టలు ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న లక్షన్నర నగదు,ఐదున్నర తులాల బంగారు బీడ్ గొలుసు,వంకు,ఇతర వస్తువులు ఒకటిన్నర తులం,చైన్ 1తులం,చెవి కమ్మలు,బంగారు గొలుసు 3 తులాలు,ముత్యాల హారం 4 తులాలు,ఉంగారాలు మూడున్నర తులాలు,బ్రస్లేట్ 3తులాలు,బంగారు బిస్కట్లు 5 తులాలు,గొలుసు తులం,2 కిలోల వెండి నగలు దొంగిలించారని బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల పరిధిలోని తోగపురం రవి ఉరు చివరిలో చింతచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన్నారు. గ్రామస్తులు , పోలీసులు తెలిపిన వివరల ప్రకారం ఆర్థిక ఇబ్బందుల వలన గోడవ జరిగి మంగళవారం చింత చెట్టుకు ఉరి వేసుకొని రవి మృతి చెందినట్లు అని తెలిపారు . ఇట్టి విషయపై అన్నా పిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అపహాస్యమౌతున్న ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ నిబంధన

- ఆక్యూపెన్సీ లేకుండానే మాల్స్‌లో వాణిజ్య కార్యాకలాపాలు
- టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు నీళ్లు
- అగ్ని ప్రమాద చర్యలు చేపట్టని వైనం
- బడా మాల్స్ వైపు కన్నెత్తి చూడని బల్దియా అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) భవన నిర్మాణ అనుమతుల నిబంధనలు సామాన్యులకే పరిమితమైనట్లుగా పరిస్థితి నెలకొంది. బడా సంస్థలు నిబంధనలు పాటించకున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులు చిన్న చిన్న ఇళ్లు కట్టుకుంటే నిబంధనల పేరుతో నాన ఇబ్బందులకు గురి చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులు బడా సంస్థలు నిబంధనలు పాటించకుంటే మాత్రం పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. సాధారణంగా భవన నిర్మాణం పూర్తయ్యాక ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే కొన్ని వాణిజ్య భవనాలు, మాల్స్, మల్టీపెక్స్‌లు ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ కాకుండానే యథేచ్ఛగా ప్రారంభమవుతున్నాయి. దీంతో ఆక్యూన్సీ సర్టిఫికెట్ నిబంధన అపహస్య పాలైందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటివల చిన్న చిన్న భవనాలు సిజ్ చేసిన జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు బడా మాల్స్ వైపు మాత్రం కన్నెత్తి చూడకపోవడం అంతర్యమేమిటో జిహెచ్ఎంసి బాస్‌లకే తెలియాలి. ఇలాంటి భవనాల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టకపోవడంతో పాటు పనులు జరుగుతున్నప్పుడు వాణిజ్య భవనాలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లు నిర్వహించడం వినియోగదారుల ప్రాణాలతో చేలగాటం ఆడటమేననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో ప్రారంభమైన మాల్..

గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మాణం పూర్తికాకముందే వాణిజ్య భవనాల్లో కార్యకలాపాలను మాల్స్, మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య భవనాలు ప్రారంభమవుతున్నాయి. ఉదాహరణకు నగరం నడిబొడ్డులోని ఆర్‌టిసి క్రాస్ రోడ్ సమీపంలోని ఒక మల్టీప్లెక్స్ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోయినా, గ్రౌండ్ ఫ్లోర్‌లో గత ఆగస్టులో మాల్‌ను సదరు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించింది. ఈ భవనంలో ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భవనం ముందువైపు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసే సెంట్రింగ్ రాడ్స్ అలాగే ఉన్నాయి. షాపింగ్ మాల్ మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనంలో అగ్ని ప్రమాద నివార చర్యలు కూడా చేపట్టనట్లు తెలిసింది. అయితే ఈ భవనానికి సంబంధించి ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ కోసం యాజమాన్యం దరఖాస్తు చేసుకోగా నిర్మాణ పనులు పూర్తికాని నేపథ్యంలో గత జనవరి 29వ తేదీన దరఖాస్తును జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు తిరస్కరించారు. దరఖాస్తును అయితే తిరస్కరించారు కానీ ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే షాపింగ్ మాల్ ప్రారంభించడంపై మాత్రం జిహెచ్ఎంసి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదానే విషయం ప్రస్తుతం ప్రశ్నర్థకంగా మారింది. ఇటీవలకాలంలో కూకట్‌పల్లి, ఎల్.బి.నగర్ జోన్‌ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నివాస భవనాలను అధికారులు సీజ్ చేశారు. మరి నిబంధనలు పాటించకుండా ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో ప్రారంభించిన మాల్ విషయంలో ఉదసిన వైఖరిని అవలంభిస్తున్నారు. అలాగే కావడిగూడలో కూడా మరో వాణిజ్య భవనం కూడా నిర్మాణం పూర్తయిన తర్యాత ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ లేకుండా వాణిజ్య కార్యాకలాపాలు ప్రారంభించారు. రిటైల్ స్టోర్, ఫిట్నెస్ సెంటర్ ప్రారంభమై సంవత్సరం గడిచినప్పటికీ, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకోలేదు. సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్‌లకు విరుద్ధంగా నిర్మాణం చేసినప్పటికీ, జిహెచ్ఎంసి అధికారులు 10 శాతం మార్టిగేజ్ భూమిని స్వాధీనం చేసుకోవడానికి సాహసం చేయడం లేదు. దాంతో, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ నిబంధన అపహస్యం అయిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూకట్‌పల్లిలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినినటుడు మహేశ్ బాబు ప్రారంభించిన మారునాడే ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ జారీ కానందున సదరు షాపింగ్ మాల్‌ను సీజ్ చేశారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, కావాడిగూడలలో ఆక్యూపెన్సీ లేకుండానే వాణిజ్య భవనాల నిర్వహణలో బడా వ్యక్తుల ఒత్తిళ్లతోనే చర్యలు తీసుకుంటలేరనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

### నిబంధనలు ఇలా..

టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం, 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో, లేదా భవనం ఎత్తు 7 మీటర్ల (గ్రౌండ్ ప్లస్ వన్) కంటే ఎక్కువగా ఉంటే, నిర్మాణం పూర్తయిన తర్వాత ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవడం తప్పనిసరి. భవన నిర్మాణంలో 10 శాతం విస్తీర్ణం మినహాయింపు పద్ధతిలో భవన నిర్మాణ యాజమాన్యం జిహెచ్ఎంసికి మార్టిగేజ్ చేయాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత, అన్ని నియమాలను పరిశీలించి, మంజూరైన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరిగితే సంబంధిత అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీకి కమిషనర్‌కు సిఫార్సు చేస్తారు. అనంతరం కమిషనర్ ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. జోనల్ అనుమతులు అయితే జోనల్ కమిషనర్, సర్కిళ్‌లో అయితే డిప్యూటి కమిషనర్ ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ జారీ చేస్తారు.

## సాంకేతికకు అనుగుణంగా పాత్రికేయులు అప్‌డేట్

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మారుతున్న సాంకేతికకు అనుగుణంగా పాత్రికేయులు తమ వృత్తిలో రాణించేందుకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. మేడ్చల్ జిల్లా పాత్రికేయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతుల అనంతరం మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆయన మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ సామాజిక విలువలతో కూడిన వృత్తి జర్నలిజమని, నిజాయతి, పారదర్శకతతో ప్రజలకు సేవ చేయాలన్న తపనతో పాత్రికేయులు పాఠకులను ఆకర్షించే ఉపయోగకరమైన విధమైన వార్తా కథనాలను చేరవేయాలన్నారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులకు క్రమం తప్పకుండా ఇచ్చే శిక్షణా తరగతులను నిర్లక్ష్య పరచకుండా హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజం పట్ల తమ వంతు బాధ్యతను పాత్రికేయులు నిర్వహించాలన్నారు. దీంతో పాటు మేడ్చల్ జిల్లాలో కొనసాగుతున్నఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు, మూడు నెలల కోటా సన్న బియ్యం పంపిణీ తదితర ప్రజాభివృద్ధి కార్యక్రమాలు, పథకాల ప్రగతిని వివరించారు. శిక్షణా తరగతులు హాజరైన పాత్రికేయులకు మీడియా చైర్మన్ సర్టిఫికెటుల అందచేసారు.

## జూన్ 30 వరకు సన్న బియ్యం

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా వ్యప్తంగా ఉన్న తెల్ల రేషన్ కార్డు దారులకు జూన్, జులై, అగస్టుకు సంబంధించిన సన్నరేషన్ బియ్యం సరఫరా చేయుటకు ప్రభుత్వము అదేశించిండం జరిగింది అని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. రేషన్ కార్డుదారులకు జున్ మాసంలో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఇవ్వబడును అని అన్నారు. ఇట్టి బియ్యం జున్ 1నుండి జున్ 30వరకు ఇవ్వబడును అని తెలియజేశారు.

### వసతి గృహాల్లో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలి:సుధీర్

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లోని పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకొని వారిని ఉన్నతులుగా తీర్చిదద్దే దిశగా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.సుధీర్ అధికారులకు సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీష్ కమిషన్ ద్వారా నూతనంగా ఎంపికైన 8మంది వసతి గృహ సంక్షేమ అధికారులకు కలెక్టర్ కార్యాలయంలో ఎంపికైన అధికారులకు సలహాలు సుచనలు ఇవ్వడం జరిగింది . విద్యార్థుల ఆరోగ్యపట్ల విధి నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా భోజన సౌకర్యం అందించాలని తెలిపారు.వసతి గృహలకు విద్యాశఖ తో సూచించిన వాటిని ,అనుసరించాల్సిన విషయాల పట్ల పలు సూచనలను డీఈఓ ద్వారా తీసుకోవాలని అయన సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిటిడిఓ కమలాకర్‌రెడ్డి ,డిఈఓ తదితరులు పాల్గోన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలి

సిడిఎంఎ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి



**ప్రజాపక్షం / కొడంగల్ :** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని పురపాలక పరిపాలన కమిషినర్, డైరెక్టర్ టికె శ్రీదేవి అన్నారు. మంగళవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలో సాగుతున్న 100 రోజుల కార్యచరణ ప్రణాళికలలో బాగంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, తడి, పోడి చెత్తా విభజనపై ఇంటింటికి అవగాహన కార్యక్రమాలతో పాటు ఆరోగ్య శిభిరాల నిర్వహణ, మురుగు కాలువల్లో పూడికతీత పనులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి కడ ప్రత్యేక కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించలేకపోతేన్నామన్నారు. మహిళ సంఘాల సభ్యులచే టెంట్ హౌస్‌లను ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌పై అవగాహణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. పలు శుభకార్యాలలో కూడా ప్లాప్టిక్ లేని విధంగా కార్యచరణ రూపొందించి ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు. దేశ వ్యాప్తంగా పర్యవరణాన్ని కాపాడడానికి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలన్నా రు. అనంతరం పట్టణంలో మురుగు కాల్వలలో ఎప్పటికప్పుడు పూడిక తీసివేసి శుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దోమల బెడదను అరికట్టేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్య శిభిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొడంగల్‌ను సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దే దిశగా ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజురు చేయడం జరిగిందని నియోజకవర్గ అభివృద్ధిలో బాగంగా మంజురైన పనులలో జాప్యం చేస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పట్టణ పురోగతి దిశగా అధికారులు పనులను చేపట్టాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పార్కులలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అదేవిధంగా పట్టణంలోని అమృత్ 2.0 నీటి సరఫరా పథకం కింద నిర్మాణం చేస్తున్న ట్యాంకు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, కడ ప్ర త్యేకాధికారి వెంకట్ రెడ్డి, ఎంఏయుడి జాయింట్ డైరెక్టర్ పల్గున్ కుమార్, మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## జంతు కళేభరాల వాహనాలను అడ్డుకున్న దోర్నాల్ గ్రామస్తులు




**ప్రజాపక్షం/ధారూర్ :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం దోర్నాల గ్రామ సమీపంలో ఉన్న ఫీడ్ కంపెనీకి జంతు కళేభరాలు తరలిస్తున్న లారీలను స్థానికులు అర్ధరాత్రి అడ్డుకొని అందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. కళెబరాల డంపింగ్ కారణంగా చుట్టుపక్కల గ్రామాలన్ని కలుషిత వాతావరణం ఏర్పడుతుందని గ్రామస్తులు మండిపడ్డారు. స్థానిక ప్రజలు అనారోగ్యాల కారణంగా అస్పత్రుల చుట్టు తిరుగుతుంటే అధికారులు మాత్రం కళ్లుమూసుకొని కూర్చున్నారని వాపోయారు. గత ఐదేళ్లలో ఎన్నోమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయెజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ వచ్చి మాకు హామి ఇస్తేనే ధర్నాను విరమించుకుంటామని తెలియజేశారు. జంతుకళెబరాల మలినాల వలన భూమి ఉత్పాదకత తగ్గిపోవడం, మంచినీటి కలుషితం, చిన్న పిల్లల నుంచి వృత్తుల వరకు అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నట్లు వారు ఆరోపించారు. పారిశుద్ధ్య , కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మంగళవారం ఉదయం ఆర్‌డిఒ వాసుచంద్ర, డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్ధారు సాజిదాబేగం, సిఐ రఘురాం, ఎస్ఐ అనితలు చర్చలు జరిపి కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక అధారంగా మరియా ఫీడ్ కంపనీపై చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.

## పిసిసి ఉపాధ్యాక్షులు రమేష్‌కు సతీష్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) వైస్ ప్రెసిడెంట్‌గా నియమించబడిన సందర్భంగా, నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన బండి రమేష్‌ను స్వయంగా కలుసుకుని శాలువాతో సన్మానించారు. ఆయన చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. బండి రమేష్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జిగా పని చేస్తూ, అత్యల్ప సమయంలోనే తెలంగాణ పిసిసి వైస్ ప్రెసిడెంట్‌గా నియామకమవ్వడంఎంతో అభినందనీయమైన విషయం అన్నారు. నియోజకవర్గంలో బండి రమేష్ స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై చేస్తున్న కృషితో ప్రతిపక్షాలు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డాయన్నారు. ఇలాంటి సమయంలో, బండి రమేష్, మరింత ఉన్నతమైన పదవులను పొందాలని, ఆయన నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయవంతంగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. తన నాయకత్వంలో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పని చేయాలని, మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులు, గొప్ప విజయాలు బండి రమేష్‌కు అందాలని ఆశిస్తూ, ఆయనతో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాధు ప్రతాపరెడ్డి, మేకల మైకెల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రకాష్, మార్కెట్ కమిటీ సభ్యులు ఫణీంద్ర కుమార్, మాజీ వైస్ ప్రెసిడెంట్ రేష్మ, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను ఎప్పటికప్పుడు తెలియచేయాలి : ఎమ్మెల్యే బండారి



**ప్రజాపక్షం/కాప్రా:** నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో మౌలిక వసతులు కల్పించటానికి ప్రాధాన్యత ఇస్తానని,ఈ విషయంలో తమ సమస్యలను ఎప్పటికప్పుడు తెలియచేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్‌లోని కెవిఎల్ రెడ్డి నగర్, హెచ్‌సిఎల్ నగర్ కాలనీల్లో రూ.64 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ల అభివృద్ధి పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాకుబ్‌రెడ్డి, ఈశ్వర్, శ్రావణ్ కుమార్, రాజు, శ్రీనివాస్, మల్లయ్య, చెల్లయ్య, నర్సింగ్, కుంటి కృష్ణ, కార్తిక్, రాజేష్, శ్రీనివాస్, వాసుగౌడ్, కృష్ణ యాదవ్, రఘు, శ్రీనివాస్, శంకర్, నర్సింగ్, మహేందర్‌గౌడ్ తదితరులు ప్రారంభించారు.

## ధారాసింగ్‌కు మరో చాన్స్

**ప్రజాపక్షం/తాండూరు :** టిపిసిసి కార్యవర్గంలో ధారాసింగ్ నాయక్‌కు పార్టీ అధిష్టానం మరో చాన్స్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త కార్యవర్గంలో తాండూరు నియోజవర్గానికి చెందిన సీనియర్ నేత పెద్దేముల్ మండల మాజీ జెడ్‌పిటిసి ధారాసింగ్ నాయక్ టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా మరో సారి నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారి చేశారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయనకు మరో మారు అదే పదవిలో కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యద ర్శి ఎంపి కేసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారిశారు. క్షేత్ర స్థాయిలో పార్టీకి ప నిచేస్తున్న వారి వివరాలను సేకరించిన పార్టీ అధిష్టానం పార్టీ పదవులను కట్టబెట్టి వారిపై మరింత బాధ్యతను పెంచారు.కాగా తనపై ఎంతో నమ్మకంతో మరో మారు టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా నియామించిన కాంగ్రెస్ అధిష్టానానికి ధారాసింగ్ కృతాజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పట్ల స్పందించిన డిప్యూటీ కమిషనర్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఎస్సార్ నాయక్ నగర్‌లో పలు సమస్యలపై కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం డిప్యూటీ కమిషనర్ నరసింహన్, వారి సిబ్బంది కాలనీకి విచ్చేసి సమస్యల పట్ల స్పందించి వారి సిబ్బందిపై సీరియస్ అయి పనితీరు మార్చుకోవాలని వారిని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఆర్ నాయక్ నగర్ విచ్చేసిన డిప్యూటీ కమిషనర్ నరసింహన్‌కి వారి సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గు బ్బల లక్ష్మీనారాయణ, ఆలూరి వెంకట శేషాచారి, పివీ భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్, పూర్ణ చందర్ గుప్త, శ్యామ్, ప్రభాకర్, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## 30వ తేదీ వరకు రేషన్ గడువు పొడిగింపు
రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రేషన్ కార్డుదారులు తమ రేషన్ తీసుకునేందుకు గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రజా పంపిణీ బియ్యం జూన్ మాసంలో మూడు నెలలు సంబంధించి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున, గడువు జూన్ 30 వరకు పొడిగించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రకటనలో పేర్కొన్నారు.

## సైనిక్ స్కూల్ ప్రారంభించాలి
సిఎం రేవంత్‌రెడ్డికి టిఎస్ఎస్‌పిఎ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 2025– 26 విద్యాసంవత్సరానికి సైనిక్ స్కూల్‌ను ప్రారంభించి, ఆరో తరగతి ప్రవేశాల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైనిక్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఎస్ఎస్‌పిఎ) రాష్ట్ర అధ్యక్షులు రామ్ ప్రసాద్, ప్రధానకార్యదర్శి అయిలయ్య, కెప్టెన్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఎపిలోని కోరుకొండ సైనిక్ పాఠశాలలో తెలంగాణ విద్యార్థులకు స్థానికత క్యాటగిరీ 67 శాతంగా పదేళ్ల పాటు పరిగణించబడ్డారని తెలిపారు. 2024లో పదేళ్ల గడువు ముగిసినందున ఇప్పుడు తెలంగాణ విద్యార్థులను నాన్‌లోకల్ క్యాటగిరీ కింద నిర్ణయించారని, దీంతో రాష్ట్ర విద్యార్థులకు తీవ్రఅన్యాయం జరగుతుందన్నారు. ఫోర్త్ సీటిలో ఎడ్యుకేషన్ హబ్ ప్లానింగ్‌లో భాగంగా రెండు సైనిక్ పాఠశాలలను మంజూరు చేయాలని వారు సిఎంకు విజ్ఞప్తిచేశారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు కొరివి పోచయ్య ముదిరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'ఓపెన్ వెంటిలేటర్'తో అగ్నిప్రమాదాల నివారణ
ఫౌండర్ డాక్టర్ వంశీనాగ్ వెల్లడి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అగ్ని ప్రమాదాల నివారణకు 'ఓపెన్ వెంటిలేటర్' పేరిట ఒక సరికొత్త పరికరం కనుగొన్నట్లు ఫౌండర్ డాక్టర్ వంశీ నాగ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల వరుస అగ్ని ప్రమాదాల్లో మృతుల సంఖ్య పెరగడం తనను కలిచివేసిందన్నారు. దీనికి పరిష్కారంగా విద్యుత్తు బ్యాటరీతో నడిచే ఓపెన్ వెంటిలేటర్ సిస్టమ్ పరికరాన్ని కనిపెట్టానని తెలిపారు. దీనిని మొబైల్ యాప్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఆటోమేటిక్‌గా నోటిఫికేషన్ వస్తుందన్నారు. తద్వారా మొబైల్ వినియోగదారుడు ఈ ఘటనను గుర్తించి దానిలోని ఒక ప్రత్యేకంగా రూపొందించిన డివైజ్ ద్వారా పోలీసులకు, అగ్నిమాపక, అంబులెన్స్‌కు సమాచారం వెళ్లిపోతుందని తెలిపారు. ఫలితంగా అగ్నిప్రమాద తీవ్రతను తగ్గించడంతోపాటు ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే త్వరలోనే మార్కెట్‌లోకి ప్రవేశపెడతానని తెలిపారు. ఔత్సాహికులైన పెట్టుబడిదారులు 96379 27116 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** సిఎం సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం నందిగామ మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపదలో ఉన్న పేదలకు అదుకునేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని వివరించారు. కార్యక్రమంలో మాజీసర్పంచులు శేఖర్ పంతులు, సావిత్రి బాల్‌రాజ్ గౌడ్, నర్సింలు, మాజీ ఎంపిటిసి సత్య ప్రమోద్, గ్రామ కమిటి అధ్యక్షుడు రాము, మాజీ కౌన్సిలర్ అద్దు అజాజ్, సుధీర్, దివిటి నర్సింలు, గుట్ట రాజులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి
రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట :** రంగారెడ్డి జిల్లా మణికొండకు చెందిన సినీనటి మధుకృష్ణ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్ అధ్వర్యంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుకృష్ణ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి తాను పార్టీలో చేరనని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేయాలని ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణరెడ్డి, పురుషోత్తం, శైలజ, మైనార్టీ అధ్యక్షుడు హాజీ, బుడ్డోలు శ్రీరాములు, శ్రావణ్ కుమార్, గంగాధర్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

## సుజాత నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజల సమస్యలపై నిరంతరం శ్రమించి ఆహర్నిశలుగా పనిచేస్తున్న హస్తినాపురం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ జన్మదిన వేడుకలను డివిజన్ కాలనీ ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సుజాత నాయక్ నివాసంలో కలిసి కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పలు కాలనీల వాసులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన కాలనీ సమస్యలు పరిష్కారం
జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యుద్ధప్రాతిపదికన కాలనీల సమస్యలు పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి మంగళవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అత్తాపూర్ లక్ష్మి నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కాలనీలో దోమల సమస్య, మెయిన్ రోడ్డు నుండి కాలనీ వరకు రోడ్డు విస్తరణ, కాలనీ చుట్టూ ఉన్న మూసీ పరివాహక స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంపు చేస్తున్నారని, అందువలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆర్.డబ్ల్యూ.ఎస్ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. అక్కడున్న జోనల్, డిప్యూటీ కమిషనర్లను వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఎంటమలాజి విభాగం ద్వారా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సిఅండ్‌డి డంప్‌ను నివారణకు విజిలెన్స్ అధికారులతో చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా డంప్ చేయకుండా వాహనాలపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి వివరించారు. వీధి దీపాల సమస్యను తీర్చడానికి చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని కోరారు. అందుకు వీధి వ్యాపారులు షాపు యజమానులు సింగిల్ ప్లాస్టిక్ వాడకంపై కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండి, నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరిపై బాధ్యత ఉందన్నారు. వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ పాల్గొన్నారు.




జిహెచ్ఎంసి కమిషనర్‌నుకలిసిన లైట్‌హౌస్ ఫౌండేషన్ చైర్మన్ గణేశ్ నటరాజన్

హైదరాబాద్‌లోని అన్ని జోన్‌లలో లైట్‌హౌస్ నైపుణ్య అభివృద్ధి కేంద్రాల విస్తరణపై చర్చించడానికి లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గణేశ్ నటరాజన్, రాష్ట్ర అధిపతి ఆకుల శ్రీనివాస్‌లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుపేద యువతకు జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం, నైపుణ్య అభివృద్ధి కెరీర్ సంసిద్ధత కార్యక్రమాలపై వారు చర్చించారు.

## ఇవిఎంల రక్షణలో జాగ్రత్తలు
రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ హరిసింగ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఇవిఎం, బ్యాలెట్ యంత్రాల రక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి.హరిసింగ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని రాజేందర్ నగర్ ఇవిఎం గోడౌన్స్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని గదులను రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బి.హరి సింగ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, బ్యాలెట్ యంత్రాల విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం భద్రపరిచిన గోడౌన్ సీల్ వేశారు. కార్యక్రమంలో రాజేందర్‌నగర్ ఆర్‌డిఒ వెంకట్‌రెడ్డి, రాజేంద్ర నగర్ తహసీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు శ్రీధర్, శ్రీనివాస్, తాహెర్ పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చని పాలకులు
సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/షాబాద్ :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పాలకులు నెరవేర్చడం లేదని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో చేవెళ్ల మండల సిపిఐ మహాసభలను పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి బడా పారిశ్రామిక వేత్తలకు, బడా బాబులకు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత అనేక అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుందని, వాటిని పెంచేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదని, ఖజానాలో డబ్బులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేవెళ్లలోకి సర్వేనంబర్ 75లో సుమారు రెండున్నర సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని



భూపోరాటం చేస్తున్నామని, మౌలిక సౌకర్యాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. అనంతరం మహాసభలో నూతన కమిటీని 27మంది కౌన్సిల్ సభ్యులతో 11మంది కార్యవర్గ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా ఎం.సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎండి మక్బూల్, వడ్ల మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుభాన్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, ఎఐటియుసి మండల అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తా
టిపిసిసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త



**పజాపక్షం/సరూర్‌నగర్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం సంతోషంగా ఉందని ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. మంగళవారం ఉప్పల విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో తాను చేసిన సేవలను గుర్తించి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ తనను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు నిబద్ధతను కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్ర నాయకులు సోనియాగాంధి, రాహుల్‌గాంధీ, జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి
కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హయత్‌నగర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్ నగర్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను కలిసి కాలనీల్లో నెలకొన్న సమస్యలను వివరించి, డివిజన్‌లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, నాయకులు సురేష్, సుభద్ర కాలనీ అధ్యక్షులు లక్ష్మ ణ స్వామి, కమాల నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి
తహసీల్దార్ రవీందర్‌దత్తుకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/గండిపేట :** శంషాబాద్ మున్సిపాలిటీ కెఎల్చారీ నగర్ బస్తీలో పేదలకు ఇచ్చిన పట్టాలకు చెందిన భూమిలో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని సిపిఐ నాయకులు మండల తహసీల్దార్ రవీందర్ దత్తుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆ.యాదగిరి, మండల కార్యదర్శి నర్ర గిరి మాట్లాడుతూ కబ్జాదారుల నుంచి పేదలకు ఇచ్చిన పట్టా భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షులు అన్నెపు ప్రభు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో 320 దరఖాస్తులు

**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో నేటి వరకు 320 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తూరు మండల పరిధిలోని తిమ్మాపూర్, కొత్తూరు గ్రామాల్లో రెండు టీంలుగా రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈనెల 3వ తేది నుండి 10వ తేది వరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఈ సదస్సుల్లో రైతుల నుండి మొత్తం 320దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కొన్ని సమస్యలకు అక్కడే పరిష్కరించడం జరిగిందని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



## సామాజిక బాధ్యతగా పనిచేయాలి
కార్పొరేటర్ బద్దం ప్రేమ్




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పార్టీ చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడ్డిఅన్నారంలో శ్రీసాయి పంక్షన్‌హాల్‌లో డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకత్వంలో జూన్ నెలలో డివిజన్‌లో చేపట్టబోయే పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా కలిసికట్టుగా ఉంటూ నిబద్ధతతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిలకూరి రామ్‌రెడ్డి, ఆనంద్, ఎనుగు శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఒట్టె రాజు, సుజాత, రాజేశ్వరి, సిరిరెడ్డి, శ్రీలక్ష్మీ, కళ్లెం రాఘవ రెడ్డి, టింకు, రామ్ తదితరులు పాల్గొన్నారు

## చట్టాలను ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** చట్టాలను ఉల్లంఘిస్తే వదిలిపెట్టే ప్రసక్తి లేదని బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హెచ్చరించారు. దిల్‌షుఖ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రాహ్మణులను కానీ ఇతర కులాలను కానీ మతాలను కానీ కించపరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సినీనటుడు మంచు మోహన్‌బాబు కుటుంబం బ్రాహ్మణ జాతిపై పగబట్టిందన్నారు. గతంలో ''దేనికైనా రెడీ'' అనే సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు చిత్రీకరించారని, తాజాగా కన్నప్ప అనే సినిమాలో పిలక, గిలక అనే రెండు పాత్రలతో బ్రాహ్మణులను కించపరిచారన్నారు. బ్రాహ్మణులనే కాకుండా వృత్తి పరంగా ఏ కులం వారినైనా కించపరిచే సన్నివేశాలు చిత్రీకరించడం ఫ్యాషన్‌గా మారిందని, తక్షణమే మోహన్‌బాబు పిలక, గిలక సన్నివేశాన్ని తొలగించాలని శ్రీనివాసరావు కోరారు. ఇప్పటికైనా కులాలను కించపరిచే సన్నివేశాలను తొలగించాలని హెచ్చరించారు.

## పండగ వాతావరణంలో
# పాఠశాలల పునః ప్రారంభోత్సవం
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి :** జూన్ 12న పాఠశాల పునః ప్రారంభోత్సవం పండగ వాతావరణంలో జరగాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బడిబాట, వనమహోత్సవం, ఇంద్రా మహిళా శక్తి తదితర అంశాలపై విద్య,అటవీశాఖ అధికారులతోపాటు డిఆర్డిఎ పిడి, ఎంపిడిఒలు తహసీల్దార్లతో కలెక్టర్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలకు తోరణాలు కట్టి, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు స్వాగతం పలకాలన్నారు. విద్యార్థుల శాతం తక్కువగా ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల సంఖ్య పెంచాలని, అతి తక్కువ పిల్లలు ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, లేని యెడల వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. కిచెన్ రూమ్స్, స్టోర్ రూమ్‌లలో, పరిసరాలు, పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పాఠశాలల ప్రారంభం రోజున పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఒక జత స్కూల్ యూనిఫాం దుస్తులు తప్పకుండా అందజేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జూన్ 12న అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభోత్సవం రోజున పిల్లలు, వారి తల్లిదండ్రులు వచ్చేలా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరణ చేయాలని తెలిపారు. జూన్ 12 నుండి 16 వరకు నిర్వహించే కార్యక్రమంలో పోషకాహారంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న 160 పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించి పని చేయాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెంచాలని విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

### నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించాలి

వన మహోత్సవంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తహసీల్దారులు, ఎంపిడిఒలు తమ మండలాలలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. పల్లె ప్రగతి స్థలాల్లో, పాఠశాలల్లో, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు పెద్దఎత్తున నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపులా నాటేందుకు స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పతాకంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉండాలని, మహిళా శక్తిని బలోపేతం చేయాలన్నారు. సోలార్ ప్లాంట్లకు స్థలాలు గుర్తించిన కేశంపేట తలకొండపల్లి మండలాల అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మండల కేంద్రాల్లో జన సమీకరణ ఉన్న కూడళ్లలో ఏర్పాటు చేయుటకు స్థలాలను గుర్తించాలని డిఆర్డిఏ పీడిని ఆదేశించారు. దివ్యాంగుల సదర్ సర్టిఫికెట్లు కొరకు సదరన్ క్యాంపులను వనస్థలిపురం గాంధీ హాస్పిటల్లో వెంటనే ఏర్పాటు చేయాలని, నియోజకవర్గానికి ఒకటి చొప్పున కొత్త మహిళా శక్తి క్యాంటీన్ స్థలాలను గుర్తించాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

# రీల్

## తెలుగు అమ్మాయిలకే మొదటి ప్రాధాన్యత

నిర్మాత ఎస్‌కెఎన్



తెలుగు తెరపై అమ్మాయిలకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, తెలుగు అమ్మాయిలను తన సినిమాల్లో ప్రోత్సహిస్తానని నిర్మాత ఎస్‌కెఎన్ అన్నారు. ఇప్పటిదాకా దాదాపు 10 మంది తెలుగు అమ్మాయిలకు హీరోయిన్స్‌గా అవకాశం ఇవ్వడం విశేషం. హీరోయిన్స్ గానే కాదు చిత్ర పరిశ్రమలోని అన్ని క్రాఫ్టుల్లో 25 మంది తెలుగు అమ్మాయిలను పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు ఎస్‌కెఎన్. ఇక తాజాగా తన కొత్త సినిమా చెన్నై లవ్ స్టోరీ ద్వారా తెలుగు అమ్మాయి శ్రీగౌరి ప్రియకు హీరోయిన్‌గా అవకాశం కల్పించారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న చెన్నై లవ్ స్టోరీ మూవీ టీజర్ ఇటీవల రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తానని తను మాటిచ్చినట్లే అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ రోజుల్లో చిత్రంతో రశ్మి, ఆనంది, రొమాన్స్ సినిమాతో మానస, టాక్సీవాలాతో ప్రియాంక జవాల్కర్, సంతోష్ శోభన్ కొత్త చిత్రంతో హారిక, మరో కొత్త చిత్రంతో ఐశ్వర్య, త్రీ రోజెస్ వెబ్ సిరీస్‌తో కుషిత కల్లపులను హీరోయిన్స్‌గా పరిచయం చేశారు. ఇప్పుడు శ్రీగౌరి ప్రియను చెన్నై లవ్ స్టోరీ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఫ్యూచర్ లోనూ తాను నిర్మించే చిత్రాల్లో హీరోయిన్స్‌గా మొదటి ప్రాధాన్యత తెలుగు అమ్మాయిలకే ఇవ్వాలని భావిస్తున్నానని ఎస్‌కెఎన్ తెలిపారు. తెలుగు అమ్మాయిలకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.

## తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు లోగో




తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డు లోగోను ప్రభుత్వం సిద్ధం చేసింది. తెలుగు సినిమా కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ లోగోను తయారు చేసింది. ఒక చేతిలో డప్పు వాయిద్యంతో రూపొందించారు. డప్పుపై తెలంగాణ గుర్తును పొందుపరిచారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత సినిమా అవార్డులు రెండు ప్రభుత్వాలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ళ తరువాత తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. 2024 ఏడాదికి సంబంధించిన అవార్డులతో పాటు , ఆరు జాతీయ అవార్డులు ఇస్తున్నారు. దీంతో పాటే పదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న ఒక్కో ఏడాదికి మూడూ సినిమాల చొప్పున అవార్డులు ఇవ్వనున్నారు. ఈ నెల 14న హైటెక్స్‌లో ఈ వేడుక జరుగనుంది.





పద్మభూషణ్ అవార్డు గ్రహీత నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలు తిరుమలలోని అఖిలాండం వద్ద ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్ వర్మ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా 650 కొబ్బరికాయలు పగలగొట్టి, 6.5 కిలోల కర్పూరంతో హారతి ఇచ్చారు. ఈ వేడుకల్లో రుపేష్ వర్మ, సుబ్బుపాల్గొన్నారు.

## జూలై 4న వస్తున్న తమ్ముడు




ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ 'తమ్ముడు'. ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు 'తమ్ముడు' సినిమా ట్రైలర్ విడుదల చేయబోతున్నట్లు నిర్మాత దిల్ రాజు తెలిపారు. 'తమ్ముడు' మూవీ ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ వీడియో ఫన్నీగా డిజైన్ చేశారు. తాను గట్టిగా అడిగినందు వల్లే ఈ చిత్ర రిలీజ్ డేట్ ను ప్రకటించారని, ట్రైలర్ రిలీజ్ చేయమని అడిగితే చేస్తారని హీరోయిన్ వర్ష బొల్లమ్మ చెప్పగా, తాను అడిగితేనే మూవీ రిలీజ్ డేట్ చెప్పారని లయ అంటుంది. వీళ్లిద్దరితో పోటీ పడుతూ స్వసిక విజయన్, సప్తమి గౌడ, బేబి శ్రీరామ్ దీత్య తాము చెప్పడం వల్లే 'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్ ను ప్రకటించారని అంటారు. ఇలా వీళ్లు గొడవ పడుతుండగా, దర్శకుడు శ్రీరామ్ వేణు వచ్చి 'మీ డౌట్స్ అన్నీ క్లారిఫై కావాలంటే ట్రైలర్ చూడండి.' అని చెప్తాడు. ట్రైలర్ అనౌన్స్ మెంట్ ఇలా సరికొత్తగా డిజైన్ చేయడం మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా..దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్ లో 'తమ్ముడు' సినిమా వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ను 'తమ్ముడు' సినిమాతో అందించబోతున్నారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కేవీ గుహన్, మ్యూజిక్ అజనీష్ లోకనాథ్.

## 13 నుంచి నాలుగు 'డీడీ నెక్ట్స్ లెవల్' స్ట్రీమింగ్




పాపులర్ హారర్ కామెడీ 'డెవిల్స్ డబుల్' ఇది 'డీడీ నెక్ట్స్ లెవల్'గా అందరికీ సుపరిచితమైన సంగతి తెలిసిందే. 'దిల్లుకు దుడ్డు'లో ఫ్రాంచైజీలో నాలుగో భాగం ఎక్స్‌క్లుజివ్‌గా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో కేవలం జీ5లో మాత్రమే స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. క్రియేటివ్ రైటర్, డైరెక్టర్ ఎస్.ప్రేమ్ ఆనంద్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హాస్యాన్ని అద్భుతంగా పండించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తటంలో తనదైన ప్రత్యేకతను సంపాదించుకున్న సంతానం ఇందులో ప్రధాన పాత్రలో నటించారు. ఇంకా సెల్వ రాఘవన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, గీతికా తివారి తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ది షో పీపుల్, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ ఈ మూవీ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. జీ5 తమిళ, మలయాళ భాషల బిజినెస్ హెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సౌత్‌మార్కెటింగ్ లాయిడ్ సిగ్జెవియర్ మాట్లాడుతూ అత్యుత్తమ సినిమాలను మా ప్రేక్షకులకు అందించటాన్ని మేము గర్వంగా భావిస్తాం. జూన్13 నుంచి జీ5లో స్ట్రీమింగ్ 'డీడీ నెకట్స్ లెవల్ కానుంది.

## 13న కన్నప్ప ట్రైలర్ రిలీజ్




మంచు విష్ణు టైటిల్ పాత్రను పోషిస్తూ భారీ బడ్జెట్‌తో నిర్మించిన కన్నప్ప సినిమా ట్రైలర్ ఈనెల 13న విడుదల చేయనున్నారు. మోహన్ బాబు, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారాగణం నటించారు. 24ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. భారీ గ్రాఫిక్స్ తో ఈ సినిమాను నిర్మించామని హీరో, నిర్మాత విష్ణు చెప్పారు. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

## కొత్త లవ్ స్టోరీతో ఆనంద్ దేవరకొండ



ఆనంద్ దేవరకొండ హీరోగా ఓ కొత్త లవ్ స్టోరీ తెరకెక్కుతోంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సారిక స్టూడియోస్, ఫార్చున్ 4 సినిమాస్, సితార ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వైష్ణవి హీరోయిన్‌గా నటిస్తుంది.

## 'నిశ్శబ్ద' టీజర్ రిలీజ్

మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'నిశ్శబ్ద'. ఈ చిత్రాన్ని శ్రీ రిషి సాయి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీనివాస్, ఎం.సంధ్యారాణి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రమణమూర్తి తంగెళ్లపల్లి రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'నిశ్శబ్ద' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు నిర్మాత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్ ను హైదరాబాద్‌లో ఘనంగా రిలీజ్ చేశారు. అనంతరం చిత్రబృందం కేక్ కట్ చేసి నిర్మాత శ్రీనివాస్ బర్త్ డే సెలబ్రేషన్స్ జరిపారు. ఈ కార్యక్రమంలో యువ హీరోలు కృష్ణ, సంజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా. 'నిశ్శబ్ద' టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా అని చెప్పారు. నిర్మాత ఎం. సంధ్యారాణి మాట్లాడుతూ మా 'నిశ్శబ్ద' సినిమా టీజర్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఒక డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ మూవీగా మా సినిమా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నాం. మా సంస్థ నుంచి మరిన్ని మంచి చిత్రాలు రాబోతున్నాయి. అన్నారు.



## ఆయిల్ ఫెడ్‌సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆయిల్ ఫెడ్‌సంస్థ ఆర్థికంగా బలోపేతంచేయడంతో పాటు రైతులు లాభాలను గడించేలా నిబద్ధతతో పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను అదేశించారు. హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్ లోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ జంగా రాఘవ రెడ్డిఅధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయిల్ ఫెడ్ సంస్థ పనితీరుపై అధికారులతో మంత్రి సమిక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిర్మిస్తున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పనులు జూలై నాటికి పూర్తి చేయాలన్నారు. ఆయిల్ పాం నర్సరీలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా నర్సరీ స్థాయిలోనే నాణ్యమైన మొక్కలను గుర్తించాలన్నారు. రైతులకు అంతర్ పంటల విషయంలో సరైన అవగాహన కల్పించాలని అందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహాకారం తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పాం పంట ను పొత్సహించడంతో పాటు విస్తీర్ణం పెంచాలని రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ఆయిల్ ఫెడ్ సంస్థ పనిచేయాలన్నారు. వచ్చే దశబ్ధానికి అన్ని విభాగాలలో సరిపడ నూతన సాంకేతిక గల ఉద్యోగులను నియమించాలని ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ ద్వారా ఆయిల్ ఫెడ్ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసి ఆర్థికంగా బలోపేతం చేసుకుని సంస్థను ప్రగతి పథంలో నడిపించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈడి ప్రశాంత్ కుమార్, ఒఎస్‌డి కిరణ్ కుమార్, జనరల్ మెనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మెనేజర్ శ్రీకాంత్ రెడ్డి, హెచ్ ఆర్ మెనేజర్ సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.



## బిసి కమిషన్‌లో రెండవ రోజూ.. బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బిసి కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవాలని వచ్చిన విజ్ఞప్తులపై తెలంగాణ బిసి కమిషన్‌లో రెండవరోజు ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు బహిరంగ విచారణ నిర్వహించారు. బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటి డైరెక్టర్ యు.శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. బహిరంగ విచారణలో 56 ప్రతినిధుల బృందాలను కమిషన్ విచారించింది. గవర, తూర్పుకాపు (గాజులకాపు), శెట్టిబలిజ, నాగవంశం, కొప్పుల వెలమ సంఘాల వారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను తెలంగాణ బిసి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ ఎం.పి. పాక వెంకట సత్యనారాయణ, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ కులం తరపున వాదనలు వినిపించారు. మరోవైపు తెలంగాణ బిసిఎ గ్రూపునకు చెందిన పలు కులాల ప్రతినిధులు తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవద్దని కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ విచారణ కమిషన్ కార్యాలయంలో బుధవారం కూడా జరుగుతుందని బిసి కమిషన్ అధికారులు తెలిపారు.

## సినిమా సిటీకి హైదరాబాద్‌ను రాజధానిగా తీర్చిదిద్దాలి

పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయండి
14న గద్దర్ సినిమా అవార్డులు అంగరంగ వైభవంగా నిర్వహించాలి
డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్: సినిమా సిటీకి హైదరాబాద్ నగరాన్ని రాజధానిగా మార్చేందుకు అవసరమైన పూర్తి వివరాలతో కూడిన ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం, మంత్రుల సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క సమాచార శాఖ కమిషనర్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రులు, సబ్ కమిటీ సభ్యులైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. హైదరాబాదును సినిమా సిటీగా అభివృద్ధి చేసి, దేశ, విదేశాల నుంచి సినిమా రంగ ప్రముఖులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ చేయాలంటే పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ శాఖ వంటి వివిధ శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది, ఫలితంగా సినీ పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు, ఈ సమస్యను పరిష్కరించాలని పెట్టాలని సబ్ కమిటీ నిర్ణయించింది. వివిధ శాఖల నుంచి ఇవ్వాల్సిన అనుమతులను ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లో ఒక అధికారిని నియమించి వారి ద్వారా అన్ని శాఖల నుంచి అనుమతులు త్వరితగతన ఇప్పించేలా సింగిల్ విండో పద్ధతిని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో షూటింగులు జరగడం మూలంగా పర్యాటక రంగం అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు. సినిమా థియేటర్లలో క్యాంటీన్ల ద్వారా విక్రయిస్తున్న తినుబండారాలు ఇతర వస్తువులు అత్యధిక రేట్లకు విక్రయిస్తున్నారు సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు ఈ నేపథ్యంలో ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిలిండెవలప్మెంట్ కార్పొరేషన్‌కు గతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు మంజూరు చేసింది, ప్రస్తుతం ఆ భూమి పరిస్థితి వాటి వివరాలను వచ్చే సమావేశం నాటికి తీసుకు రావాలని సబ్ కమిటీ అధికారులను ఆదేశించారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీపై ఏర్పాటుచేసిన ఆర్‌సిఎస్ కమిటీనీ వచ్చే సమావేశానికి పిలిపించాలని సూచించారు. 14న ఏర్పాటు చేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ ఫంక్షన్‌ను న భూతో.. న భవిష్యత్తు అన్నట్టుగా నిర్వహించాలని డిప్యూటీ సిఎం సూచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సినీ రంగ ప్రముఖుల అందరిని ఆహ్వానించాలని, తెలుగు సినిమాతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సినీ నటులను గుర్తించి ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

సమావేశంలో ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, హోం శాఖ స్పెషల్ సిఎస్ రవి గుప్తా, సమాచార శాఖ కమిషనర్ హరీష్, ఎఫ్డిసి డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలపై పెను భారం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రజలపై చార్జీల భారం మోపుతుతోందన్నారు. చార్జీల పెంపుపై ప్రభుత్వ, టిజిఎస్ ఆర్‌టిసి పునరాలోచాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని అఖిల భార త విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి యాజమాన్యం నెలకు రూ.400 ఉన్న బస్‌పాస్ చార్జిని ఏకంగా రూ.600కు, 3నెలల ప్యాకేజీని రూ.1200 నుంచి రూ.1800 పెం చడంతో రాష్ట్రంలోని 10లక్షలకు పైగా పేద,మధ్యతరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులపై పెనుభారం పడుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇప్పటికే ఇవ్వాల్సిన స్కాలర్‌షిపులు, ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఇప్పటికే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను మరింత భారం మోపుతూ బస్ పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు.

**తెలంగాణ జాగృతి, బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ధర్నా**

ఆర్‌టిసి బస్‌పాస్ చార్జీల పెంపును నిరసిస్తూ తెలంగాణ జాగృతి, బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం పోటాపోటీ ధర్నాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్ వద్ద ముందుగా బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ధర్నా నిర్వహించగా, ఆ తర్వా త తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బస్‌పాస్ చార్జీల పెంపును ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ధర్నా నిర్వహించారు. బస్‌భవన్ గేటు ముందు బైఠాయించారు. దీంతో పోలీసులు ఆమెతో పాటు జాగృతి నాయకులను అదుపులోనికి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం ఆమెను విడుదల చేశారు. అంతకుముందు బిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ సహా పలువురు బస్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. వారు గేటు దాటి బస్‌భవన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోనికి తీసుకున్నారు.

**బస్ పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోండి: కవిత**

పెంచిన బస్‌పాస్ ధరలను వెంటనే ఉప సంహరించుకోవాలని కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్ పాస్ ధరలను పెంచి ప్రజలపై ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందని మండిపడ్డారు. బస్‌పాస్‌ల పెంపుతో ఒక్క ప్రయాణికునిపైన నెలకు దాదాపు రూ300లకు పైగా భారం పడుతుందని కవిత వివరించారు.

**ఎఐడిఎస్ఓ ఖండన**

బస్ పాస్ ఛార్జీల పెంచడాన్ని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజషన్ (ఎఐడిఎస్ఓ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే అనేక ఆర్థిక సమస్యలతో చదువును నెట్టుకొస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఈ నిర్ణ యం తీవ్ర ప్రభావాన్ని చూపనుందని పేర్కొంది. విద్యార్థుల బస్ పాస్ ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఎఐడిఎస్ఓ రూపొందించిన వాల్ పోస్టర్‌ను సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు బి.రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నితీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగరాజు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల మంది విద్యార్థులపై, నగరవ్యాప్తంగా 2.5 లక్షల మంది ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## నెం.1 స్థానంలో భారత్ (మొదటి పేజీ తరువాయి)

విపరీతజనాభా కాదు, పునరుత్పత్తి సామర్థ్యమీదే సమాధానం ఆధారపడి ఉంది. ఎలాంటి వలసలు లేకుండా దేశంలో తర్వాతి తరం జనాభాను అదేస్థాయిలో కొనసాగించడానికి అవసరమైన దానికంటే తక్కువ సామర్థ్యం భారత మహిళలల్లో ఉంది. దేశంలో జననాల నిష్పత్తి మందగమనంలో ఉన్నప్పటికీ, భారత్ మాత్రం యువకుల సంఖ్యను కొనసాగించడంలో ప్రముఖస్థానంలో ఉంది. 14 ఏళ్ళ లోపు వయసుగలవారు 24 శాతం, 10నుండి 19 ఏళ్ళ లోపు వయసుగలవారు 17 శాతం, 10 నుండి 24 ఏళ్ళు లోపు వయసుగలవారు 26 శాతంమంది ఉన్నారు. మనదేశంలో పనులు చేసే ప్రజలు 68 శాతం ఉండగా, వారంతా 15 నుండి 64 ఏళ్ళ లోపు వయసుగలవారే. దేశంలో వృద్ధులు అంటే 65 సంవత్సరాలు వయసు అంతకంటే ఎక్కువ వయసుగలవారు ఏడూ శాతం ఉన్నారు. కానీ ఈ ఏడాదిలో మాత్రం వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. మగవారి జీవితకాలం 71 సంవత్సరాలు, మహిళల జీవితకాలం 74 సంవత్సరాలుగా ఈ ఏడాది అంచనా వేశారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం భారతదేశ జనాభా ఈ ఏడాదిలో 146 కోట్ల 39 లక్షలుగా ఉంది. ఇప్పటికి 40 సంవత్సరాల తర్వాత దేశ జనాభా క్షీణించడానికి ముందుగా 170 కోట్లకు చేరుకుంటుంది. ఈ అంచనాలన్నీ దేశంలో కుటుంబాలను విస్తరించాలనుకునే లక్షలాది మంది జంటలపైన, ఎప్పుడు గర్భం దాల్చాలనే స్త్రీల ఆలోచనలపైనా ఆధారపడి నిర్ణయించినవే. 1960 వ దశంకలో భారత్ జనాభా 43.60 కోట్లుగా ఉండేది. సగటున స్త్రీలకు ఆరుగురు పిల్లలు ఉండేవారు. కానీ రాబోయే దశాబ్దాలలో విద్యావసరాలు పెరిగాయి. సంతానసాఫల్య ఆరోగ్య సంరక్షణ, జాగ్రత్తలు పెరిగాయి. ఎక్కువమంది మహిళు తమ సొంత నిర్ణయాలు తీసుకుంటునానరు. ప్రస్తుతం సగటున స్త్రీలకు ఇద్దరు పిల్లలే ఉన్నారు. ఈనాడు భారత్‌లో, ఇతర దేశాలలో స్త్రీలకు ఎక్కువ హక్కులున్నాయి. ఎక్కువమంది పిల్లలు కావాలంటే వారు తమ హక్కులు పెంచుకోవాలి. భారతదేశాన్ని ఐక్యరాజ్యసమితి నివేదిక మధ్యతరహా ఆదాయాలు గల దేశాల జాబితాలో చేర్చింది. ఈ దేశ సహజసిద్ధంగా జనాభా రెట్టింపు కావాలంటే 79 సంవత్సరాలు పడుతుంది. 1970లో భారత స్త్రీకి సగటున ఐదుగురు పిల్లలు ఉండేవారు. ఇప్పుడు సగటున ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విధంగా భారత మహిళ తన సంతాన సాఫల్యతను గణనీయంగా తగ్గించుకోవడంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించింది అని యుఎన్ఎఫ్‌పిఎ భారత ప్రతినిధి ఎం.ఓజ్నర్ చెప్పారు. స్త్రీలకు పునరుత్పత్తి కేంద్రాలు, విద్య ఎంతో అందుబాటులో ఉందని చెప్పారు.

## మళ్లీ కులగణన (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. కర్ణాటకలో పరిస్థితులపై సవివరమైన, ఫలవంతమైన చర్చ జరిగిందన్నారు. తాము చర్చించిన ప్రధాన అంశాల్లో కులగణన ఒకటి అన్నారు. ఈ అం శంపై జూన్ 12న కర్ణాటక క్యాబినెట్ ప్రత్యేక సమావేశమై చర్చిస్తుందని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన విధానాన్ని తాము సూత్రప్రాయంగా ఏకీభవిస్తున్నప్పటికీ.. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కొన్ని వర్గాల్లో ఆందోళనలు ఉన్నాయన్నారు. గతంలో చేపట్టిన కుల గణన సమాచారం దాదాపు పదేళ్ల క్రితానిది గనక నిర్ణీత కాలపరిమితి (60–80రోజుల)లోగా తిరిగి కులగణన చేపట్టే అంశా న్ని పరిశీలించాలని కర్ణాటక సిఎంకు పార్టీ సూచించిందన్నారు. దీనిపై సిఎం సిద్ధరామయ్య మరిన్ని వివరాలను అందిస్తారని చెప్పారు. అలాగే, ఈ భేటీలో కర్ణాటకలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన విషాద ఘటనపైనా చర్చించినట్లు వేణుగోపాల్ తెలిపారు. తొక్కిసలాట ఘటన, తదనంతర పరిణామాలను కాంగ్రెస్ అగ్రనేతలకు కర్ణాటక సిఎం, పిసిసి చీఫ్ వివరించారని తెలిపారు. ప్రతి ఒక్కరి ప్రాణా న్ని తమ పార్టీ ఎంతో విలువైనదిగా భావిస్తుందన్న కెసి వేణుగోపాల్... ఈ దురదృష్టకర ఘటనలో ఏం జరిగిందో స్పష్టంగా తెలుసుకొనేందుకు ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిందన్నారు. ప్రజానుకూల వైఖరితో తమ పార్టీ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 2015లో కర్ణాటక వెనుకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలో ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ తాజా నిర్ణయం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com